మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 175 | గురువారం | 12-12-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


బక్కచిక్కుతున్న రూపాయి
మౌనం వీడని మోదీ

పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేసిన బిఆర్ఎస్

నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం లోపలి పేజీల్లో



## ధన్‌ఖడ్‌ది ‘పక్షపాత ప్రవర్తన’

ఉపరాష్ట్రపతి పదవి నుంచి తొలగించాలని కోరుతూ నోటీసు ఇచ్చాం

రాజ్యసభలో నిబంధనలకంటే రాజకీయాలే ప్రధానంగా మారాయి

ధన్‌ఖడ్ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారని ప్రతిపక్షాల మండిపాటు



**న్యూఢిల్లీ :** రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ‘పక్షపాత ప్రవర్తన’ కారణంగానే ఉపరాష్ట్రపతి పదవి నుంచి ఆయనను తొలగించాలని కోరుతూ నోటీసును ఇచ్చామని, ఎగువ సభలో నిబంధనల కంటే రాజకీయాలే ప్రాధాన్యంగా మారాయని పలు ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. న్యూఢిల్లీలోని కాన్స్‌టిట్యూషన్ క్లబ్‌లో బుధవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతూ ధన్‌ఖడ్ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారని, స్కూల్ హెడ్ మాస్టర్‌లాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అనుభవజ్ఞులైన ప్రతిపక్ష నాయకులు సభలో ప్రసంగిస్తున్న సమయంలో తరచూ అడ్డం పడుతున్నారని, సభలో అంతరాయాలకు ధన్‌ఖడే కారణమని ఆరోపించారు. రాజ్యసభ చైర్మన్ వ్యవహరించే తీరు, ఆయన ఉన్న పదవుల గౌరవానికి విరుద్ధంగా ఉన్నదని అన్నారు. ప్రతిపక్ష నాయకులను తరువాయి 2లో



## చర్చల్లేవ్

రాజ్యసభలో అధికార విపక్షాల మధ్య గందరగోళం

ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే సభ వాయిదా

**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి తొలగింపుపై విపక్షాల నోటీసు, జార్జ్ సోరొస్ అంశాలపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర గందరగోళం నడుమ రాజ్యసభ బుధవారం ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదా పడింది. తొలుత ఉదయం సభ ప్రారంభమవగానే ఈ అంశాలపై ఉభయ పక్షాలు పరస్పర ఆరోపణలతో మధ్యాహ్నం 12 గంటలకు రాజ్యసభను వాయిదా వేశారు. అనంతరం తిరిగి సమావేశమైన వెంటనే రాజ్యసభ సభా నాయకుడు, కేంద్ర మంత్రి జె.పి.నడ్డా మాట్లాడుతూ అమెరికా బిలియనీర్ జార్జ్ సోరొస్‌తో కాంగ్రెస్ నేతలకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ అంశంపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఉపరాష్ట్రపతిని ఆ పదవి నుంచి తొలగించాలని రాజ్యసభ చైర్మన్ తరువాయి 2లో



## 500 మందికి ఒక సర్వేయర్

- పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన
- 31వ తేదీ నాటికి పరిశీలన పూర్తి చేయాలి
- సామాజిక సర్వేకు తుదిగడువు 13వ తేదీ
- 14వ తేదీన సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో సహపంక్తి భోజనం
- కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, గ్రూప్–2 పరీక్షల నిర్వహణ, మెస్ ఛార్జీలపెంపు, సామాజిక సర్వే తదితర అంశాలపై బుధవారం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి సలహా దారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజా పాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31వ తేదీ లోగా పూర్తిచేయాలన్నారు. పరిశీలన చేసిన సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని, ప్రతి ఐదు వందల మందికి ఒక ఉద్యోగి (సర్వేయర్)ని నియమించుకోవాలన్నారు. సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలని, రాష్ట్రంలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కానట్లయితే వెంటనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ఆ ముందు రోజు రాత్రి గ్రామంలో చాటింపు చేయాలని, స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. ఏ ఒక్క దరఖాస్తును విడిచిపెట్టకుండా చిన్న చిన్న పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని, సర్వే వివరాలపై ప్రతి రోజు కలెక్టర్ లు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు, సలహాల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఓ నిరంతర తరువాయి 2లో



అలహాబాద్ జడ్జిపై రాజ్యసభలో

## అభిశంసనకు నోటీసు సిద్ధం

కపిల్ సిబల్ చొరవతో నోటీసు

ఇప్పటికే సిపిఐ, సిపిఐ(ఎం), కాంగ్రెస్ సహా 36 మంది రాజ్యసభ ఎంపిల సంతకాలు

న్యూఢిల్లీ : విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో హాజరై ముస్లింలను కించపరిచేలా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి సభ్యులు తరువాయి 2లో



నేటి నుంచి సచివాలయంలో ఉద్యోగులకు

## ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఈనెల 12వ తేదీ నుంచి ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ అమలు కానుంది. సచివాలయంలో పనిచేసే అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్‌ను వర్తింపజేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు తమ అటెండెన్స్ తరువాయి 2లో

తెలంగాణ బతుకు ఛిద్రమవుతుంటే

## ప్రేక్షక పాత్ర పోషిస్తారా?

రాహుల్‌గాంధీకి కెటిఆర్ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్



ఏడాది క్రితం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ఆగం చేయడంతో పాటు తెలంగాణ అస్థిత్వాన్ని కూడా దెబ్బతీస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. వ్యవసాయ రంగం నుంచి పారిశ్రామిక వర్గం వరకు సంక్షోభంలో కూరుకుపోతున్నదని, ఎన్నికల సమయంలో ‘మీరు’ ఊరూరా తిరిగి ఊదరగొట్టిన గ్యారంటీలన్నీ గారడీలేనని, ఏడాది పాలన చూస్తే అర్థమైందన్నారు. తాము తలుచుకుంటే తరువాయి 2లో

## రాష్ట్రంలోనూ ఉత్తమ లెజిస్లేటర్ అవార్డు

- ప్రదానం చేసేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నాం
- ప్రభుత్వం కోరిన విధంగా ఎక్కువ రోజులు శాసనసభ సమావేశాలు నిర్వహిస్తాం
- ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవగాహన కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



> గతంలో సీనియర్ సభ్యులు శాసన సభలో మాట్లాడుతున్నప్పుడు నూతన సభ్యులకు స్ఫూర్తిగా ఉండేది. రోశయ్య, రజబ్ అలీ, బోడేపూడి వెంకటేశ్వరరావు, చెన్నమనేని రాజేశ్వరరావు, ఓంకార్, వైయస్.రాజశేఖర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, నర్రా రాఘవరెడ్డి వంటి వారు గొప్ప వక్తలుగా పేరు తెచ్చుకున్నారు.
>
> – స్పీకర్

ప్రజాపక్షం /హైదరాబాద్

పార్లమెంట్‌లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు మాదిరిగా రాష్ట్రంలో ఉత్తమ లెజిస్లేటర్ అవార్డు ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడించారు. గతంలో మాదిరిగా మొక్కుబడిగా ఒకటి రెండు రోజులు కాకుండా ప్రభుత్వం కోరిన విధంగా ఎక్కువ రోజులు సభా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టసభలది క్రియాశీల పాత్ర, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలను రూపొందించాల్సిన బాధ్యత చట్టసభల సభ్యులపై ఉంటుందని ప్రసాద్‌కుమార్ అన్నారు. చట్టాల రూపకల్పనతో పాటు అనంతరం వాటి అమలు తీరు, ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయనే విషయాలను కూడా చర్చించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు లెజిస్లేచర్ అవగాహన కార్యక్రమం బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎంసిహెచ్ఆర్‌డి ఇనిస్టిట్యూట్ లో జరిగింది. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ప్రారంభించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌మాట్లాడుతూ శాసనసభ వ్యవహారాలపై గౌరవ సభ్యులకు పూర్తి అవగాహన ఉండాల్సిన అవసరం తరువాయి 2లో

## నాపై వ్యాఖ్యలు తొలగించండి

స్పీకర్ ఓమ్‌బిర్లాను కోరిన రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బిజెపి ఎంపిలు తనపై చేసిన అవమానకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కోరారు. ఓం బిర్లాతో బుధవారంనాడు సమావేశమైన అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు. ‘నేను స్పీకర్‌తో సమావేశమయ్యాను. నాపై చేసిన అవమానకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేసాను. ఆ విషయాన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పారు. సభ సజావుగా జరగాలన్నదే మా లక్ష్యం. చర్చ జరగాలి. బిజెపి నాయకులు నాకు వ్యతిరేకంగా ఏమైనా చెప్పనీయండి...డిసెంబర్ 13న రాజ్యాంగ చర్చ జరగాలని మేము కోరుకుంటున్నాం. వాళ్లు అదానీపై చర్చను కోరకోవడం లేదు.. ఆ విషయాన్ని మేము విడిచిపెట్టం. వాళ్లు మాపై ఆరోపణలు చేసుకోనీయండి, కానీ సభ మాత్రం జరగాలి’ అని రాహుల్ అన్నారు. బిజెపి లోక్‌సభ ఎంపిలు నిషికాంత్ దుబే, సంబిత్ పాత్ర డిసెంబర్ 5న సభలో మాట్లాడుతూ రాహుల్‌గాంధీకి, హంగేరియన్‌కు మధ్య సంబంధాలున్నాయని ఆరోపించారు. ఆ మరుసటి రోజు, సోరోస్, గ్లోబల్ ఇన్వెస్టిగేటివ్ న్యూస్ నెట్ వర్క్ ఒసిసిఆర్‌పి అంశాన్ని దుబే లేవనెత్తారు. ఒసిసిఆర్‌పితో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయని, రాహుల్ గాంధీ ‘భారత్ జోడో యాత్ర’ కోసం జార్జి సోరస్ నుంచి నిధులు తీసుకున్నారా అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపిలు తరువాయి 12లో

## రైతుల చూపు ఉద్యానపంటల వైపు

ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ‘వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్’ సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులను ఉద్యానవన పంటల వైపు మళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ అధికారులను సూచించింది.రాష్ట్రంలో పసుపు పంట తగ్గకుండా ఉద్యానవణ శాఖ అధికారు చర్యలు తీసుకోవాలని, పసుపు రైతులను తరువాయి 2లో



జర్నలిస్టులపై దాడి సంఘటనపై

## విచారణ జరిపిస్తాం

సంబంధితులపై చర్యలు తీసుకుంటాం

మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

సినినటుడు మోహన్ బాబు ఆయన కుమారుడు వ్యక్తిగత పంచాయతీలో జర్నలిస్టులపై దాడి సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జర్నలిస్టులకు ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రిపోర్టర్ రంజిత్ ఆరోగ్య పరిస్థితిపై జిల్లా కలెక్టర్, వైద్య శాఖ అధికారులకు చెప్పడం జరిగిందన్నారు. దాడి సంఘటనపై విచారణ చేసి సంబంధితులపై చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు.

## జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలి

ఐజెయు నేత దేవులపల్లి అమర్

ప్రజాపక్షం/హైదరాబాద్



రోజు రోజుకు జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావడానికి సిఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ఐజెయు స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవుల పల్లి అమర్ సూచించారు. జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడిని ఖండిస్తూ టియుడబ్ల్యుజెతో పాటు పాలు జర్నలిస్టు సంఘాలు, రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం ఫిలింనగర్‌లోని ఫిల్మ్ంఛాంబర్ ముందు టివి9 ఆధ్వర్యంలో 200 మంది జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ.. దాడిలో గాయపడిన జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె డిప్యూటీ జనరల్ సెక్రటరీ రాములు, టివి9 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ రజనీకాంత్, అసోసియేట్ ఎడిటర్ మురళీకృష్ణ, మాజీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు కె.రాములు, సిగ శంకర్‌గౌడ్, షౌకత్ అలీ, బాలకృష్ణ, మారుతీ సాగర్, రమణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మోహన్‌బాబు ఇంటి వద్ద మళ్లీ ఉద్రిక్తత

మీడియాపై దాడి చేసిన సీనియర్ నటుడిపై కేసు నమోదు

కూర్చుని మాట్లాడుకోవడానికి నేను సిద్ధం : మంచు మనోజ్

ప్రజాపక్షం/హైదరాబాద్



జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి వద్ద బుధవారం మళ్లీ టెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రైవేటు వ్యక్తులు బయటకు వెళ్లిపోవాలని మనోజ్ వార్నింగ్ ఇచ్చారు. వెంటనే విష్ణు జోక్యం చేసుకుని ఇక్కడ ప్రైవేట్ వ్యక్తులు ఎవరూ లేరని బదులిచ్చారు. మనోజ్‌కు సంబంధించిన ప్రైవేట్ వ్యక్తులు కూడా బయటకు వెళ్లాలని విష్ణు కూడా వార్నింగ్ ఇవ్వడంతో మళ్లీ ఇక్కడ ఏం జరుగుతుందనే ఉత్కంఠ నెలకొంది. మరోపక్క మీడియాపై దాడికి పాల్పడిన సినీ నటుడు మోహన్‌బాబుపై పహాడీషరీఫ్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఇప్పటికే అతని చిన్న కుమారుడు మనోజ్ ఫిర్యాదుపై మోహన్‌బాబుపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో సినీ నటుడు మోహన్ బాబుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. మోహన్ బాబుకు పోలీసులు జారీ చేసిన నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చింది. కాగా మంచు విష్ణు స్పందిస్తూ మీడియాతో మాట్లాడారు.ఇంట్లో జరిగిన దాడిలో మోహన్‌బాబుకు గాయాలయ్యాయన్నారు. రెండు మూడు రోజులు తాను ఇంట్లో లేకపోవడం వల్లనే సమస్యలు వచ్చాయన్నారు. ప్రతి కుటుంబంలో తరువాయి 12లో

కూల్చివేతలకు ముందు

## నోటీసులు ఇవ్వాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ నార్కుడ గ్రామం మంగర్షికుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్స్‌లో నిర్మాణాలు చేపట్టేందుకు ముందుగా అనుమతులు ఇచ్చిన అధికారులు కొన్నేళ్ల తర్వాత అవి బఫర్ జోన్ లేదా ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని నోటీసులు ఎలా ఇస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఇలాంటి నిర్మాణలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వుంటుందని హెచ్చరించింది. కూల్చివేత చర్యలు తీసుకుంటే బాధితులకు పరిహారం ప్రభుత్వ ఖాజానా నుంచి కాకుండా అనుమతులు ఇచ్చిన అధికారుల నుంచి ఇప్పిస్తామని హెచ్చరించింది. పర్మిషన్లు ఇచ్చిన ఆఫీసర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇప్పటికే తరువాయి 2లో

## చర్చించి.. సమస్యలు పరిష్కరించుకోండి

భారత్, బంగ్లాదేశ్‌లకు అమెరికా హితవు



**వాషింగ్టన్:** భారత్, బంగ్లాదేశ్ పరస్పర చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని అమెరికా హితవు పలికింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై దాడులు జరగడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. అదే విధంగా దేశంలో ఎన్నో కేసులు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షురాలు షేక్ హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ కోరుతున్నప్పటికీ భారత్ స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య తలెత్తుతున్న ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని అమెరికా కోరింది. ఇలావుంటే, తమ దేశంలోని మైనారిటీలైన హిందువులపై దాడులు జరుగుతున్న మాట వాస్తవమేనని బంగ్లాదేశ్ అంగీకరించినట్టు సమాచారం. అంతర్జాతీయ నివేదికలు ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించినప్పటికీ స్పందించని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఎట్టకేలకు దాడులు నిజమేనని అంగీకరించింది. ఆగస్టు 5న షేక్ హసీనా భారత్‌కు పరారైనప్పటి నుంచి అక్టోబర్ 22 వరకూ మైనారిటీలపై 88 మతపరమైన హింసాత్మక ఘటనలు జరిగినట్టు పేర్కొంది. వివిధ ఘటనలతో సంబంధం ఉందని అనుమానిస్తున్న 70 మందిని అరెస్టు చేసినట్టు బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ మీడియా ప్రతినిధి షఫీకుల్ ఆలమ్ ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. త్వరలోనే అన్ని వివరాలను అందిస్తామని పేర్కొన్నారు. కాగా, బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లిన భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ ఈ అంశాన్ని బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్‌తో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే అమెరికా ఇరు దేశాల సంబంధాలపై స్పందించింది.

## జన్మతః పౌరసత్వం హక్కు రద్దు!

అమెరికా అధ్యక్షుడిగా అధికారం చేపట్టిన తర్వాత ట్రంప్ అమలుపరిచే అవకాశం



**వాషింగ్టన్:** అమెరికాలో జన్మించిన వారందరికీ అక్కడి పౌరసత్వం లభిస్తుందని సుమారు 150 ఏళ్ల నుంచి ఉన్న రాజ్యాంగ హక్కును రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వలసదారులను అడ్డుకోవడానికి అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తన హయాంలో ఎన్నో ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా దేశంలో ఉంటున్న విదేశీయులను వెనక్కు పంపేందుకు పలు నిబంధనలను అమలు చేశారు. తాజా ఎన్నికల్లో ఇదే విషయాన్ని ప్రచారాస్త్రంగా ఉపయోగించుకున్నారు. తాను అధికరంలోకి వస్తే అక్రమవలసదారులను బహిష్కరిస్తానని, సిసలైన అమెరికా పౌరులకే ఉద్యోగ, ఉపాధి వంటి అవకాశాలు దక్కేలా చూస్తానని హామీ ఇచ్చిరు. ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌ను ట్రంప్ ఓడించడంతో, ఆయన నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ తీసుకోబోయే నిర్ణయాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. విదేశీయులకు దేశంలో ఎలాంటి ప్రధాన్యం లేకుండా చేయాలనే ఆలోచనలో ఉన్న ట్రంప్, మొట్టమొదట చర్యగా జన్మతఃగా సంక్రమించే పౌరసత్వ హక్కును రద్దు చేస్తారని సమాచారం. ఈ నిర్ణయం అమలైతే, ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల నుంచి అమెరికాలో స్థిరపడిన వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. ప్రత్యేకించి భారతీయులకు ఈ నిర్ణయం శరాఘతమవుతుంది. ఈ హక్కును రద్దు చేసిన తర్వాత, విదేశీయులకు పౌరసత్వ నిబంధనలను ఏ విధంగా సవరిస్తారన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఏదిఏమైనా అమెరికాలో ఉంటున్న విదేశీయులపై ట్రంప్ దృష్టి సారిస్తారన్నది మాత్రం వాస్తవం. ఆయన నిర్ణయాల ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది ప్రశ్న.

# అల్టూనా కోర్టు వద్ద హైడ్రామా

### బీమా కంపెనీ సిఇఒ హత్య కేసులో నిందితుడు హల్‌చల్

### న్యూయార్క్ తీసుకెళ్లే ప్రయత్నాలు మానుకోవాలని స్పష్టీకరణ







**అల్టూనా (పెన్సిల్వేనియా/ అమెరికా):** అమెరికాలోని అతిపెద్ద ఆరోగ్య బీమా కంపెనీల్లో ఒకటైన యునైటెడ్ హెల్త్‌కేర్ ఇసిఒ బ్రియాన్ థాంప్సన్ (50) హత్య కేసులో నిందితుడు నికోలస మాన్గియోన్ అల్టూనా కోర్టు వద్ద హైడ్రామా సృష్టించాడు. తనను కోర్టు హాల్‌కు తీసుకొస్తున్న పోలీస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. పోలీస్ వ్యాన్ నుంచి దిగిన తర్వాత కోర్టు హాల్‌లోకి వెళ్లేందుకు నిరాకరించాడు. 'ఈ చర్య అమెరికా ప్రజల మేధాశక్తిని అవమానించడమే' అంటూ నినాదాలు చేశాడు. కోర్టు హాల్‌లో ప్రాసిక్యూషన్ ఆరోపణలు వినిపిస్తున్నప్పుడు, తాను కూర్చున్న కుర్చీపై చెత్తో పెద్దగా కొడుతూ, చాలా అసహనంగా కనిపించాడు. ఇలాంటి విపరీతమైన విధ్వంసకర వ్యక్తిత్వం ఉన్నవారు బయట ఉంటే ప్రమాదమని, అందుకే, బెయిల్ ఇవ్వరాదని ప్రాసిక్యూషన్ కోరింది. నిందితుడి తరఫు లాయర్ థామస్ డికీ తన వాదన వినిపిస్తూ, తన క్లయింట్ నిరపరాధని పేర్కొన్నాడు. అతనిని న్యూయార్క్‌కు తరలించే ప్రయత్నాలు చేయవద్దని కోరాడు. ఇరు వర్గాల వాదన విన్న తర్వాత న్యాయమూర్తి కేసును వాయిదా వేశారు. ఇలావుంటే, న్యూయార్క్‌లోని మన్‌హాటన్ ప్రాంతంలో ఒక హోటల్‌లో, ఈనెల 4వ తేదీన ఒక వ్యాపార సంబంధమైన సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన థాంప్సన్ హత్యకు గురయ్యాడు. అతనిని తుపాకీతో కాల్చిన వెంటనే హంతకుడు పరారయ్యాడు. కేసును దర్యాప్తు చేసిన పోలీస్ అధికారులు, ఆ హంతకుడు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో హోటల్ ఆవరణలోకి ప్రవేశించాడని గుర్తించారు. అదే విధంగా అతను వాడిన తుపాకీకి సంబంధించిన వివరాలు కూడా సేకరించారు. ఐదు రోజుల గాలింపు చర్య అనంతరం, పెన్సిల్వేనియా రాష్ట్రం, అల్టూనాలోని మెక్‌డొనాల్డ్స్‌లో 26 ఏళ్ల మాన్గియోన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. థాంప్సన్‌ను అతను ఎందుకు హత్య చేశాడనే విషయంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. పోలీసులు అరెస్టు చేసినప్పుడు అతని వద్ద తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, హత్యకు ఉపయోగించిన మోడల్ తుపాకీని కనుగొన్నారు. అసోసియేటెడ్ ప్రెస్ కథనం ప్రకారం, అరెస్టయిన సమయంలో నిందితుడి వద్ద ఓ లేఖ లభించింది. అందులో అమెరికా ఆరోగ్య బీమా కంపెనీలు ప్రజలను దోచుకుంటున్నారని రాసి ఉంది. 'ప్రపంచంలోనే అమెరికాలో ఆరోగ్య బీమా, వైద్యం అత్యంత ఖరీదైనవి. బీమా కంపెనీలు కోట్లకు కోట్లు వెనకేసుకుంటుంటే, సామాన్యుల బతుకులు రోజు రోజుకూ దిగజారిపోతున్నాయి' అనే విమర్శ కూడా అందులో ఉంది. అమెరికాలోని అతిపెద్ద బీమా కంపెనీకి సిఇఒ కాబట్టే థాంప్సన్‌ను మాన్గియోన్ హత్యచేసి ఉంటాడని, అంతకు మించిన ఇతరత్రా కారణాలు లేకపోవచ్చనీ అధికారులు ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం.




## భారత్‌కు అప్పగింత ఉత్తర్వులపై యుకె హైకోర్టులో భండారీ అప్పీల్



**లండన్:** పన్ను ఎగవేత, మనీలాండరింగ్ వంటి అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న రక్షణ రంగ కన్సల్టెంట్ సంజయ్ భండారీ, తనను భారత్‌కు అప్పగించాలన్న ఉత్తర్వులపై యుకె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. 62 ఏళ్ల భండారీ భారీ మోసాలకు పాల్పడి, యుకెకు పరారయ్యాడు. కోర్టు విచారణ నిమిత్తం అతనిని వెంటనే అప్పగించాల్సిందిగా భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై 2022లో వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్స్ కోర్టు సానుకూలంగా స్పందించింది. అతనిని భారత్‌కు అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, వివిధ కారణాల వల్ల ఆ ఉత్తర్వులను అధికారులు అమలు చేయలేదు. కాగా, నాటి ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ భండారీ హైకోర్టులో అప్పీల్ చేశాడు. న్యాయమూర్తులు తిమోతీ హోర్లోడ్, కరెన్ స్టైన్ విచారణ జరుపుతారు. ఇప్పటికే ఆర్థిక నేరస్థులు లలిత్ మోదీ, విజయ్ మాల్య యుకెలో ఆశ్రయం పొందారు. వారిని కూడా రప్పించడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. అప్పగింతకు కోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, చట్టంలోని అనేకానేక లొసుగులను ఉపయోగించుకుంటూ, వారు ఇప్పటి వరకూ భారత్‌కు రాలేదు. భండారీ కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నాడు.

## సిరియా నుంచి క్షేమంగా స్వదేశానికి



**న్యూఢిల్లీ:** సిరియాలో బషర్ అసద్ ప్రభుత్వం కుప్పకూలడం, హయాత్ తహరీర్ అల్‌షామ్ (హెచ్‌టిఎస్) తిరుగుబాటుదారులు రాజధాని దమాస్కస్‌ను స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో తలెత్తిన రాజకీయ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని భారత్ స్పందించింది. అక్కడి నుంచి 75 మంది భారతీయులను క్షేమంగా స్వదేశానికి చేర్చింది. అబు మహమ్మద్ అల్ జొలానీ అధికార పగ్గాలు చేపట్టినట్టుగానీ, పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నట్టుగానీ సమాచారం లేదు. ఈ కారణంగానే సిరియాలో ఉన్న భారతీయులను తిరిగి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ క్రమంలో భాగంగా తొలి విడతగా సిరియా నుంచి భారత్ చేరుకున్న వారిలో 44 మంది జమ్మూకశ్మీర్‌కు చెందిన వారు. అందుబాటులో ఉన్న వాణిజ్య విమానాల ద్వారా భారతీయులను స్వదేశానికి క్షేమంగా చేర్చే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతున్నది.

## దక్షిణ కొరియా 'మార్షల్ లా' కేసులో ఇద్దరు పోలీస్ అధికారుల అరెస్టు



కిమ్ యాంగ్ హ్యున్

ఆత్మహత్యాయత్నం చేసిన రక్షణ మంత్రి?



చో జి హో



కిమ్ బాంగ్-సిక్

**సియోల్:** దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో మార్షల్ లా విధించిన కేసులో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఇద్దరు పోలీస్ అధికారులను అరెస్టు చేశారు. ఇప్పటికే అరెస్టయిన దేశ మాజీ రక్షణ మంత్రి కిమ్ యాంగ్ హ్యున్ ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలుస్తోంది. దేశంలో తక్షణమే అమల్లోకి వచ్చేలా మార్షల్ లాను విధించిన దేశాధ్యక్షుడు యూన్ సుక్‌పై ప్రధాన ప్రతిపక్షం డెమోక్రాటిక్ పార్టీ అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈనెల 7న జరిగిన ఓటింగ్‌కు, ముగ్గురు మినహా అధికార పార్టీ సభ్యులు గైర్హాజరు కావడంతో, మూడింట రెండు వంతుల మంది లేని కారణంగా తీర్మానం వీగిపోయిందని స్పీకర్ ప్రకటించారు. కాగా, ప్రతిపక్ష పార్టీలో యూన్ సుక్‌పై మరోసారి అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఈనెల 14న ఆ తీర్మానంపై ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. మార్షల్ లా విధింపుపై సర్వత్రా తీవ్రస్థాయిలో ఆందోళనలు వెల్లువెత్తడంతో, విదేశాంగ మంత్రి కిమ్ యాంగ్‌ను పదవి నుంచి యూన్ సుక్ తొలగించారు. ఆ తర్వాత మార్షల్ లా విధింపు విచారణ చేపట్టిన అధికారులు, కిమ్ యాంగ్‌ను అరెస్టు చేశారు. ఆ సమయంలో అతను ఆత్మహత్యకు చేసిన ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకున్నారని స్థానిక వార్తాకథనాలను ఉటంకిస్తూ పిటిఐ తెలిపింది. ఇలావుంటే, మార్షల్ లా విధించినప్పుడు, దక్షిణ కొరియా పార్లమెంటు భవనంలోకి సభ్యులు ఎవరూ ప్రవేశించకుండా భద్రతా సిబ్బందిని మోహరింప చేశారనే అభియోగంపై నేషనల్ పోలీస్ ఏజెన్సీ కమిషనర్ జనరల్ చో జి హో, సియోల్ మెట్రో పాలిటన పోలీస్ ఏజెన్సీ చీఫ్ కిమ్ బాంగ్–సిక్‌లను విచారణ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మార్షల్ లా విధింపు తర్వాత దానిని అమలు చేసేందుకు వీరు ప్రయత్నించారని విచారణ అధికారులు ఆరోపిస్తున్నారు.

## ప్రేక్షక పాత్ర పోషిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

రాజీవ్ పేర్లు, ఇందిరాగాంధీ విగ్రహాలు ఉంటాయా?, ఈ నీచ సంస్కృతికి సిఎం ఫుల్‌స్టాప్ పెట్టకపోతే జరగబోయేది ఇదేనని అన్నారు. ఈమేరకు కెటిఆర్ కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీకి బుధవారం లేఖ రాశారు. కాంగ్రెస్ గ్యారంటీలకు దిక్కులేదని, 420 హామీలకు పత్తాలేదని, డిక్లరేషన్లకు అడ్రస్ లేదని ఆరోపించారు. సిఎం ఢిల్లీకి పంపే మూటలపై ఉన్న శ్రద్ధ, ప్రజలకు ఇచ్చిన మాటలపై లేకపోవడం నయవంచన, ద్రోహమని పేర్కొన్నారు. 'మీరు '(రాహుల్ గాంధీ) ప్రేక్షకపాత్రకే పరిమితమైన వ్యవహారంపై ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ ప్రజాగ్రహం వెల్లువెత్తోందన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, కేవలం 12,527 మాత్రమే భర్తీ చే శారని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణం తప్ప మహిళలకు ఒరిగిన ప్రయోజనం ఏ ఒక్కటీ లేదన్నారు. ఉద్యమంలో కోట్లాది మందిలో స్ఫూర్తి నింపిన తెలంగాణ తల్లి దివ్య, భవ్య స్వరూపాన్ని అవమానించి, ప్రజలపై కాంగ్రెస్ తల్లిని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ బతుకు ఛిత్రమవుతుంటే రాహుల్ గాంధీ ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు.

## ఒక సర్వేయర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ అని, ఈ ఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించనున్నట్లు కలెక్టర్‌లకు మంత్రి వివరించారు. కలెక్టర్లు తరచూ హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థులకు అందించే సరుకుల నాణ్యత, క్వాంటిటీపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ఈనెల 14వ తేదీన మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు సభ్యులు స్థానికంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను సందర్శించి అక్కడే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తామని, ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొనాలని మంత్రి కోరారు. ఈనెల 15, 16 తేదీలలో జరిగే గ్రూప్2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**సామాజిక సర్వే**

రాష్ట్రంలో 1.16 కోట్ల కుటుంబాలకు గాను 1.12 కోట్ల కుటుంబాల సామాజిక సర్వే (99.09 శాతం) పూర్తిచేసినట్లు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఇందుకు కృషి చేసిన అధికారులకు ముఖ్యమంత్రి తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈనెల 13వ తేదీ సామాజిక సర్వేకు తుదిగడువు అని, ఆ తర్వాత ప్రజాపాలన సేవా కేంద్రాలలో కూడా కుటుంబ సర్వే వివరాలను నమోదు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు.

## నోటీసులు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు ఇచ్చామని గుర్తు చేసింది. చీన్ జైశ్వాల్ ఇతరులు వేసిన కేసును జస్టిస్ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారించారు. నార్సుడ గ్రామం మంగర్సికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు ఉన్నాయని, వారంలోగా వాటిని తొలగించాలని ఇరిగేషన్ ఆఫీసర్లు తమ ఇళ్ల గోడలపై నోటీసులు అతికించారని పిటిషనర్లు చెప్పారు. ఆ నోటీసుల మేరకు పిటిషనర్ల ఆస్తుల విషయంలో కఠిన చర్యలు తీసుకోరాదని న్యాయమూర్తి ఆదేశించారు. పిటిషనర్లు పొందిన అనుమతి పత్రాలను అధికారులకు అందజేయాలని, ఆ తర్వాత అధికారుల చర్యలు చట్ట ప్రకారం ఉండాలన్నారు. నోటీసులపై పిటిషనర్లు 15 రోజుల్లో అన్ని ఆధారాలు, పత్రాలతో సమాధానం ఇవ్వాలన్నారు. పిటిషన్లపై విచారణ పూర్తయినట్లుగా చెప్పారు.

## ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్

వేసేందుకు సులభతరంగా ఉండేందుకు సచివాలయంలోని ప్రతి అంతస్థులో, ప్రతి శాఖ కార్యాలయానికి ఒక ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ మిషన్ చొప్పున మొత్తం 60 మిషిన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఔట్ సోర్సింగ్, సచివాలయం హెడ్ నుంచి వేతనాలు పొందే ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా ఫేషియల్ అటెండెన్స్ అమల్లో ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## రాష్ట్రంలోనూ ఉత్తమ లెజిస్లేటర్ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నదని, అప్పుడే సభ్యులు సభలో అర్థవంతంగా మాట్లాడుతారన్నారు. నూతన సభ్యులతో పాటుగా సభ్యులందరికి ఈ అవగాహన కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గతంలో సీనియర్ సభ్యులు శాసనసభలో మాట్లాడుతున్నప్పుడు నూతన సభ్యులకు ఇన్సిపిరేషన్‌గా ఉండేదని, రోశయ్య, రజీబ్ అలీ, బోడెపూడి వెంకటేశ్వరరావు, చెన్నమనేని రాజేశ్వరరావు, ఓంకార్, వైయస్.రాజశేఖర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, నర్రా రాఘవరెడ్డి వంటి వారు గొప్ప వక్తలుగా పేరు తెచ్చుకున్నారన్నారు. సభలో మాట్లాడడానికి సమాచారం, వాగ్ధాటితో పాటుగా సభా వ్యవహారాలు, నిబంధనలపై అవగాహన ఉండాలి. ముఖ్యంగా జీరో అవర్, క్వశ్చన్ అవర్, రిజల్యూషన్స్, అడ్జర్నమెంట్ మోషన్స్, పాసింగ్ ఆఫ్ బిల్స్, పాసింగ్ ఆఫ్ బడ్జెట్, సభ్యుల గౌరవ, మర్యాదలు, ప్రోటోకాల్, వ్యవహారాలు వంటి ముఖ్యమైన కార్యకలాపాలపై సభ్యులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు గెలిచిన తరువాత చట్టసభల నియమనిబంధనల పుస్తకాలు ఇస్తామని, కానీ వాటిని ఎవరు కూడా చదవడంలేదన్నారు. ఇప్పుడు ఉన్న 119 ఎంఎల్‌ఎలలో 57 మంది నూతనంగా ఎన్నికైన వారేనని, వారందరూ కచ్చితంగా లేజిస్లేచర్‌కు సంబంధించిన పుస్తకాలు తప్పకుండా చదవాలన్నారు. ఎంబిబిఎస్ చదివితే డాక్టరు అవుతారని, ఇంజనీరింగ్ చదివితే ఇంజనీర్ అవుతారని, అలాగే ప్రజల మనస్సు చదివితేనే ప్రజా ప్రతినిధులమవుతామని అన్నారు. ఈ ఐదేళ్లు ప్రజలతో మమేకమై ఉంటేనే భవిష్యత్‌లో గెలుస్తారన్నారు. ప్రస్తుతం ఎన్నికల ఖర్చు కూడా విపరీతంగా పెరిగిందని, ఇది సమాజానికి మంచిది కాదని, అతి సామాన్యుడు కూడా పోటీ చేసే విధంగా ఉండాలన్నారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు విమర్శలు రావడం సహజం కానీ ఆ విమర్శలకు భయపడకుండా ప్రతివిమర్శతో ముందుకు వెళ్ళాలన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గత పదేళ్లలో ఎప్పుడు కూడా చట్టసభల సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదన్నారు. లేజిస్లేచర్ సమావేశాలకు, పార్టీలకు ఎలాంటి సంబంధంలేదన్నారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు రాకపోవడం శోచనీయమన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలకు రావాలని బిఆర్‌ఎస్ పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఉత్తమ ఎంఎల్‌ఎ, ఉత్తమ ఎంఎల్‌సి అవార్డులు ఇక నుండి ప్రతి ఏటా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని ఎక్కువ రోజులు నడిపితే అంత మంచిదన్నారు. 2014 నుండి కేవలం 4 నుండి 5 రోజులు మాత్రమే సమావేశాలు నిర్వహించారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం కచ్చితంగా వీలైనన్ని ఎక్కువ రోజులు సభను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు 65 మంది పాల్గొన్నారు.

## రైతుల చూపు ఉద్యానపంటల వైపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించేలా పథకాలను రూపొందించాలని అధికారులకు కమిషన్ ఆదేశించింది. హైదరాబాద్,బిఆర్‌కె భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అధ్యక్షతన బుధవారం కమిషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు భవానీరెడ్డి, భూమి సునీల్ ఉద్యాన వన శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను అధికారులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ యార్డుల్లో ఉద్యానవన పంటలకు ప్రత్యేక షెడ్లను కేటాయించాలని, గిట్టుబాటు ధర వచ్చే వరకు ఆ పంటలను నిల్వ చేసుకునేందుకు వీలువుతుందని ఉద్యానవన శాఖ అధికారులు కమిషన్‌కు వివరించారు. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలో రియల్ ఎస్టేట్ ద్వారా హార్టికల్చర్ పంటల సాగు తగ్గుముఖం పట్టిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు కమిషన్‌ను కోరారు. ఉద్యానవన శాఖకు సంబంధించి సమగ్ర వివరాలతో డిపిఆర్‌తో రూపొందించాలని కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్‌పై చాలా మంది రైతులు ఆధారపడి ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నారని, ఆ పథకం అందుబాటులో లేదని, ఈ పథకం అందేలా చూడాలన్నారు రైతులకు రెగ్యూలర్ గా వచ్చే కేంద్ర నిధులు, రైతులకు సంబందించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు తీసుకొచ్చేలా ఎంపిలు కేంద్రం పై ఒత్తిడి తీసుకురావాలని కోదండరెడ్డి తెలిపారు. మామిడి సాగుచేసే రైతులు అకాలవర్షాలతో నష్టపోతున్నారని, మిర్చి, పసుపు పంట సాగుచేసే రైతులు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వచేయడం వల్ల ఆర్థికభారం అవుతుందని, నిల్వ చేసిన పంటను విక్రయించే సమయానికి పసుపు, మిర్చి నాణ్యత తగ్గుతుందని అధికారులు కమిషన్‌కు తెలిపారు. నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటుపై ఎలాంటి కదలికలు లేవని అధికారులు కమిషన్ దృష్టికి తీసుకురాగా, ఈ విషయమై కేంద్రంతో మాట్లాడే ప్రయత్నం చేస్తామని కమిషన్ తెలిపింది. క్లస్టర్ విధానం అమలు చేయాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్స్ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతవరకు ఉపయోగంలో ఉన్నాయో కూడా నివేదికను ఇవ్వాలని కోదండరెడ్డి అధికారులకు సూచించారు.రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని ఇది వరకే తాము సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

## శ్రవణ్‌కుమార్ ముందస్తు బెయిలు కేసులో ముగిసిన వాదనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ పాలనలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో 6వ నిందితుడైన ఒక టీవీ ఛానల్‌కు ఎండి. శ్రవణ్ కుమార్ రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును తర్వాత చెబుతామని జస్టిస్ రాధారాణి ప్రకటించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రి హరీష్‌రావు ఆదేశాలతో శ్రవణ్ ఫోన్ ట్యాపింగ్ చేయించారని పోలీసుల వాదన. ప్రణీత్‌రావును అరెస్ట్ అవ్వగానే శ్రవణ్ పారిపోయారన్నారు. ఈకేసుతో తనకు సంబంధం లేదని, జర్నలిస్ట్‌గా విశ్వేషణలు చేయడమే తన విధి అని శ్రవణ్ లాయర్ వాదన.

**14న జాతీయ లోక్‌అదాల్**

వివిధ కేసులను వాదప్రతివాదులు రాజీ మార్గం విధనంలో పరిష్కరించునేందుకు వీలుగా ఈ నెల 14న శనివారం జాతీయ లోక్అదాలత్ జరుగుతుందని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ సీహెచ్.పంచాక్షరి బుధవారం తెలియజేశారు. హైకోర్టు నుంచి కింది స్థాయి కోర్టుల వరకు లోక్‌అదాలత్‌లు జరుగుతాయన్నారు. ఆసక్తిగల కక్షిదారులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలన్నారు.

**జస్టిస్ పర్వతరావు మృతి**

ఉమ్మడి ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్. పర్వతరావు (89) హైదరాబాద్‌లో బుధవారం కన్నుమూశారు. జుబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలను పూర్తి అయ్యాయి. భారత ఉప రాష్ట్రపతి (మాజీ) ఎం.వెంకయ్యానాయుడు పలువురు జస్టిస్ పర్వతరావును కడసారి దర్శించుకుని నివాళి అర్పించారు

## 'పక్షపాత ప్రవర్తన'

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంగా చేసుకొని , తరచూ ప్రభుత్వాన్ని పొగుడుతుంటాడని అన్నారు. రాజ్యసభలో నిబంధనల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఉందని, చైర్మన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. 1952 నుంచి రాజ్యాంగంలోని 67వ అధికరణ ప్రకారం ఇంత వరకు ఎన్నడూ ఉపరాష్ట్రపతికి వ్యతిరేకంగా తీర్మానం తీసుకురాలేదని, గతంలో ఆ పదవిలో ఉన్నవారు ఎన్నడూ రాజకీయాలలో తలమునకలు కాలేదని, నిష్పాక్షికంగా వ్యవహరించారని ఖర్గే గుర్తు చేశారు. ఉపరాష్ట్రపతిని తొలగించాలనే నోటీసు ఇవ్వడానికి వ్యక్తిగత తగాదాలు, రాజకీయ తగాదాలు లేవన్నారు. కేవలం ఆయన ప్రవర్తన, పక్షపాత వైఖరితో విసిగిపోయే తొలగింపు నోటీసు ఇచ్చామని వివరించారు. ఇది కేవలం ప్రోటోకాల్ ఉల్లంఘనే కాదని, రాజ్యాంగం, భారతదేశ ప్రజలకు చేసిన విశ్వాసఘాతుకమని మండిపడ్డారు. ధన్‌ఖడ్‌పై ప్రతిపక్ష పార్టీలకు ఎలాంటి వ్యతిరేకత లేదని, ఆయనను తొలగించడం మినహా ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రత్యామ్నాయం లేని పరిస్థితి కల్పించారని అన్నారు. రాజ్యసభ చైర్మన్ సభలోవ్యవహరించిన తీరు దేశ గౌరవానికి భంగం కలిగించిందని ఖర్గే విమర్శించారు. 'రాజ్యాంగ పరిరక్షణ, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సమగ్రతను కాపాడడం అనే ఏకైక మా ఉద్దేశ్యంతో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, చర్చించిన తరువాతే నోటీసు ఇచ్చామన్నారు. దేశప్రజాస్వామ్యంపై అధికార బిజెపి దాడి చేస్తోందని డిఎంకె నాయకుడు తిరుచ్చి శివ అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి నదీముల్ హఖ్ మాట్లాడుతూ రాజ్యసభలో తమ భావాలను వ్యక్తీకరించడానికి అనుమతించడం లేదన్నారు. చైర్మన్ పార్లమెంటును నడుపుతున్నట్లుగా లేదని, సర్కస్‌ను నడుపుతున్నట్లుగా ఉందని, ఆయన స్వయంగా మాట్లాడుతూ సమయమంతా తినేస్తాడని శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ అన్నారు. పార్లమెంటులో అధికార పార్టీ తీవ్రమైన దాడి చేస్తోందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సభా నాయకుడు, ప్రతిపక్ష నాయకుడు రెండు స్థంభాలు లాంటి వారని, ప్రతిపక్ష నేత లేవగానే మాట్లాడేందుకు అనుమతించాలని, మిగతవారికి అవకాశం ఇవ్వద్దని శివ అన్నారు. మీడియా సమావేశంలో టిఎంసి ఎంపి సాగరికా ఘోష్, ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా, ఎస్‌పి ఎంపి జావేద్ అలీఖాన్, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి ఫౌజియా ఖాన్, జెఎంఎం ఎంపి సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## అభిశంసనకు నోటీసు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభలో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు నోటీసుపై 36 మంది ప్రతిపక్ష పార్టీ సభ్యులు ఇప్పటికే సంతకాలు చేసినట్లు తెలిసింది. స్వతంత్ర్య రాజ్యసభ సభ్యుడు, న్యాయవాది కపిల్ సిబ్బల్ చొరవతో ఈ పిటిషన్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రతిపాదనను గురువారం రాజ్యసభలో ప్రతిపాదించాలని భావిస్తున్నారు. ఇండియా కూటమికి రాజ్యసభలో 85 మంది ఎంపిలు ఉన్నారు. అభిశంసనా తీర్మానం నోటీసుపై ఇప్పటికే సంతకం చేసిన వారిలో దిగ్విజయ్‌సింగ్, జైరామ్ రమేశ్, వివేక్ టంకా (కాంగ్రెస్), పి.సందోష్ కుమార్, పి.పి.సునీర్ (సిపిఐ), జాన్ బ్రిట్టాస్ (సిపిఐ(ఎం)), సంజయ్ సింగ్ (ఆప్), సాకేత్ గోఖలే, సాగరికా ఘోష్ (టిఎంసి), మనోజ్ ఝా(ఆర్‌జెడి), జావేద్ అలీ ఖాన్ (ఎస్‌పి) తదితరులు ఉన్నారు.

జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై అభిశంసనా ప్రక్రియను ప్రారంభించేందుకు న్యాయమూర్తు (విచారణ) చట్టంలోని సెక్షన్ 3(1)(బి), రాజ్యాంగంలోని 124(4), 124(5) అధికరణల కింద విపక్షాలు నోటీసు ఇచ్చారు. న్యాయమూర్తుల విచారణ చట్టం 1968 కింద ఎవరైనా న్యాయమూర్తికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయాలంటే కనీసం లోక్‌సభలో 100 మంది సభ్యులు, రాజ్యసభలో 50 మంది సభ్యుల సంతకాలతో నోటీసుతో తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఆ తీర్మానం ఆమోదం పొందితే తరుపరి చర్యలు ఉంటాయి.

## చర్చల్లేవ్

(మొదటి పేజీ తరువాయి)

జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నోటీసు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్, సోరోస్ సంబంధాల నుంచి దృష్టి మళ్ళించేందుకే కాంగ్రెస్ నోటీసు ఇచ్చిందని ఆరోపించారు. సభ ప్రారంభం కాగానే అధికార పక్ష సభ్యులంతా తమ స్థానాలలో నిలబడి నిరసన వ్యక్తం చేయడంతో , సభాపతి స్థానంలోని డిప్యూటీ స్పీకర్ వెంటనే సభా నాయకుడు జె.పి.నడ్డాను మాట్లాడేందుకు అనుమతించారు. నడ్డా మాట్లాడుతూ సోరోస్‌తో కాంగ్రెస్ నాయకత్వానికి ఉన్న సంబంధం గురించి రెండు రోజులగా ప్రజలు లేవనెత్తుతున్నారని, ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకువస్తున్నానని అన్నారు. సోరోస్‌కు సోనియాగాంధీకి మధ్య ఉన్న సంబంధం ఏమిటని, ఇది దేశ సార్వభౌమత్వానికి, అంతర్గత, బాహ్య భద్రతకు సంబంధించిన విషయమన్నారు. ఈ అంశంపై చర్చ జరగాలన్నారు. ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను పదవి నుంచి తొలగించాలని నోటీసు ఇవ్వడం ద్వారా అసలు సమస్య నుంచి దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చైర్‌పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు ఖండనార్హమైనవని, దీనిని అందరూ ఖండించాలని నడ్డా విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ పదవులలో ఉన్న వారికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన తీరు సమంజసం కాదన్నారు. ప్రతిపక్షాలు నడ్డా వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం చెబుతుండగానే, ఆయన వారిని ఉద్దేశించి దేశం మొత్తం ఆందోళన చెందుతుందని, వారిని దేశం ఎప్పటికీ క్షమించదని వ్యాఖ్యానించారు. చివరకు రాజ్యసభ గురువారానికి వాయిదా పడింది.



# వరంగల్ అభివృద్ధిపై దృష్టి

గడువులోగా పూర్తి చేయాలి

వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనలో అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వరంగల్ నగర అభివృద్ధి, ఐఆర్ఆర్, ఒఆర్ఆర్, భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన డిసిఆర్‌లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు అనుసంధానం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు ఎయిర్‌పోర్టు భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. భద్రకాళి చెరువు శుద్ధీకరణ పనులను వచ్చే వేసవిలోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం. దాన కిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ఎంఎయుడి డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్‌లు డాక్టర్ సత్య శారదా, పి. ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

# పక్కా రహదారులు నిర్మిస్తాం

రూ.1.60కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన



**ప్రజాపక్షం/సుజాతనగర్:** తండాలు, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పక్కా రహదారులు, డ్రైన్లు, గ్రామాల మధ్య అనుసంధాన రహదారులు అనతికాలంలోనే పూర్తిచేసి రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని సర్వారం, నర్సింహసాగర్, కొత్త అంజనాపురం, బేతంపూడి, సింగభూపాలెం పంచాయతీ పరిధిలో రూ. 1.60కోట్ల అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన శంకుస్థాపన సభల్లో కూనంనేని మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలకు కావాల్సిన రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, త్రాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులపై సర్వే నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, నాణ్యతతో నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, లోపాలను గుర్తిస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మండల టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, జిల్లా సమితి సభ్యులు కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు తహశీల్దార్ శిరీష, ఎంపిడివో భారతి, ఎఇ నర్మద, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నిలోఫర్, పిఆర్‌డిఈ సత్యనారాయణ, ఎఇ శివలాల్, విద్యుత్ ఎఇ కిషన్, సిపిఐ నాయకులు పాదిల శ్రీను, వీర్ల మల్లేష్, బొడ్డు కేశవరావు, దుర్గ, కుమారి కృష్ణ, మేకల వెంకటేష్, తేజ, ఎట్టి వెంకటేష్, మాన్యా నాయక్, భాగం కృష్ణ, హత్తిరాం, రఫి, కాంగ్రెస్, సిపిఐ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, అధికారులు, రైతులు తదితరు లు పాల్గొన్నారు.

## యుపిపిఎస్‌సి మెయిన్స్‌లో సత్తా చాటిన తెలంగాణ అభ్యర్థులు

20 మంది 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' పొందిన వారే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యుపిపిఎస్‌సి మెయిన్స్ 2024 ఫలితాల్లో తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులు సత్తా చాటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' సాయం అందుకున్న అభ్యర్థుల్లో 20 మంది యుపిపిఎస్‌సి మెయిన్స్ ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఒక రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం' పథకాన్ని ప్రారంభించింది. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో తొలిసారి ఈ ఏడాది 135మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఆగస్ట్ 26న సిఎం ఎ.రేవంత్ రెడ్డి వారికి చెక్కులను పంపిణీ చేశారు.

**విజేతలు:** వరంగల్ అర్బన్ జిల్లాఇ.సాయి శివాని, రాహుల్ శంకేషి,పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి. ఖమ్మం జిల్లా నల్లమల సాయికుమార్, బానోతు నాగ రాజా నాయక్. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కదారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి. మెదక్ జిల్లా కుమ్మరి శ్రవణ్ కుమార్. రంగారెడ్డి జిల్లా మొహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ. మహబూబాబాద్ జిల్లా బెస్త ప్రియాంజలి. సిద్ధిపేట జిల్లా నరిగె స్వామి. నాగర్ కర్నూల్ జిల్లా గోకమల్ల అంజనేయులు. ఆదిలాబాద్ జిల్లా ఆర్. ప్రమోద్ కుమార్. వికారాబాద్ జిల్లా బి.ప్రహ్లాద్. జగిత్యాల జిల్లా బురుగుపెల్లి నీరజ్ కుమార్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జస్వంత్ కుమార్. అసిఫాబాద్‌కుమ్రంభీం జిల్లా రామ్టెంకి సుధాకర్.

### ఒక చిరుదీపం కొండంత వెలుగును ఇస్తుంది

'ఒక చిరు దీపం కొండంత వెలుగును ఇస్తుంది. ప్రభుత్వం అందించిన ఒక చిరు సాయం. బుధవారం యుపిఎస్‌సి పరీక్షలో గొప్ప ఫలితాలను ఇచ్చింది. తెలంగాణ సర్కార్ సారథిగా ఇది నాకు గొప్ప ఆనందాన్ని కలిగించింది'' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పేరుతో సింగరేణి సహకారంతో ప్రజాప్రభుత్వం చేసిన ఆర్థిక సాయాన్ని అందిపుచ్చుకుని ఒకే దఫా 20 మంది తెలంగాణ పేద బిడ్డలు ఈ దేశ భవిష్యత్‌ను నిర్మించే అవకాశం ఉన్న అఖిల భారత సర్వీసు ప్రధాన పరీక్షలో రాణించడం తెలంగాణ సమాజానికి గర్వకారణమని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి బుధవారం 'ఎక్స్' వేదికగా ఒక ట్విట్ చేశారు.

# పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేసిన బిఆర్ఎస్

తెలంగాణను వ్యతిరేకించిన వ్యక్తిని 'మీరు' మంత్రిని చేశారు

కోదండ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమ రాజకీయ ఉద్యోగాలు,కుటుంబ సంక్షేమం కోసమే బిఆర్ఎస్ తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకుంటుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డి దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో రెవెన్యూశాఖ మంత్రిగా సిఎం కెసిఆర్, ఐటి శాఖ మంత్రిగా కెటిఆర్ ఇద్దరూ కలిసి దివాళ తీసిన విదేశీ సంస్థకు ధరణి వ్యవహారాలు చూసుకునే బాధ్యతను అప్పగించారని విమర్శించారు. అప్పుడు అధికార పక్షంలో, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వం పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేసిందన్నారు. హైదరాబాద్, బిఆర్‌కె భవన్‌లోని వ్యవసాయ కమిషన్, రైతు సంక్షేమ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో కమిషన్ సభ్యులు జి.గంగాధర్ తో కలిసి కోదండరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభలో తెలంగాణకు చెందిన అంశంపైన చర్చ జరిగిందని, అప్పటి స్పీకర్ తెలంగాణ పదాన్ని వాడొద్దని చెబితే, ఆ సమయంలో మంత్రిగా ఉన్న కెసిఆర్ నోరు విప్పలేదని, కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు గా తాము సభ నుంచి బయటికి వచ్చామని ఆయన గుర్తుచేశారు. ముందు కెసిఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని, ఆ తర్వాత టిడిపిలో పని చేశారని, మంత్రి పదవి ఇవ్వకపోవడంతోనే కెసిఆర్ బయటికి వచ్చారని వివరించారు. తెలంగాణ సెంటిమెంట్‌పై మాట్లాడుతున్న బిఆర్ఎస్, గతంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకించిన వ్యక్తికి టిఆర్ఎస్ మంత్రి వర్గంలో ఎలా చోటు కల్పించిందని కోదండరెడ్డి నిలదీశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలోని అన్ని రంగాలను, వ్యవస్థలను ద్వంసం చేసిందని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటులో కూడా రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. టి ఆర్ఎస్‌లో 'తెలంగాణ' పదాన్ని తీసి, 'భారత'బి అనే పేరు తో బిఆర్ఎస్‌గా మార్చుకున్న ఆ పార్టీకి, తెలంగాణ పదాన్ని ఉచ్చరించే నైతిక హక్కు కూడా లేదన్నారు. ఆ ప్రభుత్వంలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందని, భూ ములను విక్రయించుకున్నారని ఆయన ఆరోపించారు.

**ఆదేశాలు పాటించని అధికారులపై కఠిన చర్యలు :** రైతు, వ్యవసాయ సంక్షేమ విషయంలో ప్రభుత్వం, కమిషన్ ఆదేశాలను పాటించకపోతే సంబంధిత అధికారులపైన కఠిన చర్యలు తప్పవని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి హెచ్చరించారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని, ఈ విషయమై కమిషన్ తరపున తాము ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. స్థానికులకే చెరువుల నిర్వహణ బాధ్యత ఇచ్చే అంశాన్ని నీటిపారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని కోదండరెడ్డి వివరించారు. ఆధార్ కార్డ్ తరహా రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలనే విషయాన్ని ఇది వరకే తాము సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు.



## ప్రజల మనోభావాలు కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే

ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం ఘటన బాధాకరమని సనత్‌నగర్ ఎంఎల్‌ఎ, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడలో బుధవారం ముత్యాలమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. సమాజంలో ఎవరి మనోభావాలు వారికి ఉంటాయని అందరి మనోభావాలను గౌరవించాలని కోరారు. ప్రజల మనోభావాలను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని వెల్లడించారు. ప్రభుత్వం దోషుల పట్ల కఠినంగా వ్యవహరించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. భక్తుల అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకొని నూతన విగ్రహ ప్రతిష్ఠ కోసం తాను చర్యలు చేపట్టగా, అదే సమయంలో ప్రభుత్వం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో విగ్రహప్రతిష్ఠ కోసం ముందుకొచ్చిందని చెప్పా రు.

## టిడిపి నేత గుంటి యాదగిరి రావు మృతి

సంతాపం తెలిపిన టిడిపి నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగుదేశం సీనియర్ నాయకులు, ఎన్‌టిఆర్ అభిమాన సంఘం నాయకులు, రాష్ట్ర ఎస్‌సి సెల్ కమిటీ సభ్యులు జి.యాదగిరిరావు బుధవారం ఉదయం కన్నుమూశారు. యాదగిరి రావు మృతి పట్ల పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్, పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా, నల్లెల్ల కిషోర్, పి.బాలరాజుగౌడ్, ఎస్.ప్రకాష్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం




**ప్రజాపక్షం/ నల్లగొండ :** షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై స్వీకరించిన దరఖాస్తులన్నింటిని క్రోడీకరించి దానిపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని రాష్ట్ర ఎస్ సి ఏక సభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ తెలిపారు. బుధవారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి నల్గొండ జిల్లా ఎస్ సి కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో బహిరంగ విచారణ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు షెడ్యూల్ కులాల సంఘాలు వ్యక్తులు షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై దరఖాస్తులను సమర్పించారు అనంతరం చైర్మన్ మాట్లాడుతూ బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు, అభిప్రాయాలు అన్నింటిని శా)యంగా అధ్యయనం చేసి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. దరఖాస్తు సమర్పించే వారందరూ ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా సమర్పించాలని కోరారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తామని అన్నారు. ఇదివరకు రంగారెడ్డి, తదితర జిల్లాలలో బహిరంగ విచారణ నిర్వహించడం జరిగిందని, జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తు సమర్పించలేకపోయిన వారు హైదరాబాద్ లో నేరుగా కమిషన్‌కు వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చని అన్నా రు. కాగా షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ పై నిర్వహించిన బహిరంగ విచారణలో 245 మంది వ్యక్తిగతంగా,కుల సంఘాల పరంగా దరఖాస్తులు సమర్పించారు.

అనంతరం చైర్మన్ నల్లగొండ మండలం చర్లపల్లి బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను సందర్శించి అక్కడ విద్యార్థినిలతో ముఖాముఖి మాట్లాడారు. చదువే లక్ష్యం గా విద్యార్థులు ముందుకు సాగాలని, ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ సంస్థలు, అన్ని విద్యా సంస్థల్లో ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నదని, తాము చదువుకునే రోజుల్లో ఇలాంటి వసతులు లేవని, అందువల్ల బాగా చదువుకొని ఉన్నత స్థానంలోకి రావాలని ఆయన కోరారు. కాగా ఎస్ సి వర్గీకరణ పై బహిరంగ విచారణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ఎస్ సి ఏక సభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్అక్తర్ కు ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్ సి కార్పొరేషన్ ఈడీ, జిఎం కోటేశ్వరరావు, డిఆర్ఓ అమరెందర్, ఆర్డీవో అశోక్ రెడ్డి లు స్వాగతం పలికారు .వీరి వెంట రాష్ట్ర ఎస్ సి కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, డిఎస్పి శివరాం రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యాలయం సుపరింటిండెంట్ సజ్జన్ కుమార్ తదితరులు ఉన్నారు.

## 'శిష్ట్లా ఉమామహేశ్వర రావు సర్వలభ్య సాహిత్యం' గ్రంథావిష్కరణ నేడు ..అందరూ ఆహ్వానితులే




**హైదరాబాద్:** తెలుగు సాహిత్యంలో వచన కవిత్వానికి శ్రీకారం చుట్టిన శిష్ట్లా ఉమామహేశ్వరరావు రచనలను ఏర్చికూర్చి ముద్రించిన 'శిష్ట్లా ఉమామహేశ్వర రావు సర్వలభ్య సాహిత్యం' గ్రంథావిష్కరణ ఈనెల 12వ తేదీ, గురువారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ బొగ్గులకుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో జరుగుతుంది. తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా అరసం తెలంగాణ విభాగం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరాస్వామి వ్యవహరిస్తారు. ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ పూర్వ కన్వీనర్ డాక్టర్ కె. శివారెడ్డి ఈ గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. ప్రముఖ కవి, దిగంబర కవుల్లో ఒకరైన నిఖిల్వేర్, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టన్ నందిని సిధారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు మందలపర్తి కిశోర్ విశిష్ట అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ప్రముఖ కవి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకుబ్, అక్షరయాన్ వ్యవస్థాపకురాలు అయినంపూడి శ్రీలక్ష్మి, బాలసాహితీవేత్త, మెజీషియన్ చొక్కాపు వెంకటరమణ ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు. ప్రముఖ సాహితీవేత్త డా. ఏల్చూరి మురళి, నవచేతన పబ్లికేషన్స్ జనరల్ మేనేజర్ ఎన్. మధుకర్ సౌహార్ద సందేశం అందిస్తారు. ఎన్నో వ్యయప్రయాలకోర్చి, శిష్ట్లా రచనలను సేకరించి, పుస్తకరూపంలో తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన ప్రముఖ రచయిత డాక్టర్ ఏటుకూరి ప్రసాద్, సాహిత్య పరిశోధకుడు యామిజాల ఆనంద్ సంపాదకులుగా ఈ గ్రంథంపై స్పందన తెలియచేస్తారు. సోమశిల తిరుపాల్ సభా సమన్వయాన్ని నిర్వహిస్తారు. డాక్టర్ వి. జయప్రకాశ్ వందన సమర్పణతో ముగిసే ఈ సభా కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలంగాణ అభ్యుదయ రచయిత సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

## హైకోర్టులో అల్లు అర్జున్ పిటిషన్



**హైదరాబాద్ :** పుష్ప–2 సినిమా రిలీజ్ నేపథ్యంలో హీరో అల్లు అర్జున్ హైదరాబాద్, సంధ్య థియేటర్‌కు వెళ్లినప్పుడు జరిగిన తొక్కిసలాట ఘటనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ హీరో అల్లు అర్జున్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. తొక్కిసలాటకు తాను బాధ్యుడ్ని కాదన్నారు. తొక్కిసలాటలో రేవతి అనే వివాహిత మరణించింది. ఆమె కొడుకు, కూతురు గాయపడ్డారు. దీంతో తన భార్య మృతికి అల్లు అర్జున్ రాక కారణమంటూ ఎం.భాస్కర్ ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పీఎస్‌లో ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అల్లు అర్జున్ తనపై నమోదైన కేసును కొట్టేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. తాను థియేటర్‌కు వెళ్లే ముందు థియేటర్ మేనేజిమెంట్‌కు, ఏసీపీకి సమా చారం ఇచ్చానన్నారు. ఘటన బాధాకరమన్నారు.

## పోలీసు అకాడమీలో ట్రైనీలకు 'లివర్ ఫైబ్రో' పరీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణా పోలీస్ అకాడమీ లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు లివర్ ఫైబ్రో పరీక్షలు నిర్వహించినట్లు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఒక ప్రకటనలో తెలిపారు. జైడస్ ఫార్మా సహకారంతో యూనిట్ ఆసుపత్రి రమాదేవి ఆధ్వర్యంలో ఈ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ లివర్ ఫైబ్రో స్కాన్ లో డయాబెటిక్,హై బిపి,ఓవర్ వెయిట్, జాండిస్ లాంటి వాటితో బాధపడే అభ్యర్థులకు ఫ్రీ చెకప్ చేసి ,గ్రేడింగ్ గుర్తించి తగిన మెడిసిన్స్ ఇచ్చారు. ఈ మెడికల్ క్యాంప్ లో దాదాపు 360 ప్రి ప్రమోషనల్ ట్రెయినీస్, అధికారులు,సిబ్బంది టెస్ట్ చేయించి డాక్టర్ రమాదేవి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని అందరికి సూచించారు.ట్రెయినేస్ కూడా లివర్ టెస్ట్ వల్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇంత మంచి ఉచిత మెడికల్ క్యాంప్ అకాడమీ లో నిర్వహించినందుకు జైడస్ ఫార్మా ప్రతినిధులను , డాక్టర్ రమాదేవి నీ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ ఐ పి ఎస్ అభినందించారు.ఫార్మా ప్రతినిధులకు అకాడమీ జ్ఞాపికలను అందజేశారు.

# స్థానిక సమరానికి రె'ఢీ'

## ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతుంది. ఇప్పటికే దాదాపు 11 మసాలుగా గ్రామ పంచాయతీలకు పాలక వర్గాలు లేవు. ఎంపిటిసి, జెడ్పిటిసిలు కూడా పదవీకాలం ముగియడంతో మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. జనవరి మాసంలో ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది. తొలి దశలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. 2019 జనవరి మాసంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి.

ఖమ్మంజిల్లాలో 589 గ్రామ పంచాయతీలు ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 479 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్‌కు సంబంధించి 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకు వచ్చింది. ఈ చట్టంలో ఒక రిజర్వేషన్‌ను రెండు దఫాలుగా కొనసాగేవిధంగా నిబంధన రూపొందించారు. ఆ చట్టం ప్రకారమైతే రిజర్వేషన్లలో ఎటువంటి మార్పు లు ఉండబోవు. కానీ బిసి జనాభా ప్రాతిపదికన బిసిలకు రిజర్వేషన్లు కేటాయించాలని బిసి సంఘాల నుంచి డిమాండ్ రావడం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బిసిలకు సానుకూలంగా స్పందించడంతో ఇప్పుడు బిసి వర్గీకరణ మొదలైంది. వర్గీకరణలో భాగంగా జనాభా ప్రాతిపదికన బిసిలకు కేటాయించే స్థానాలను పెంచాలన్న డిమాండ్ అమలులోకి వస్తే ఖచ్చితం గా రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది.

2018 పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించక తప్పని పరిస్థితి. రెండు మూడు నెలల క్రితం వరకు పాత రిజర్వేషన్ల ప్రకారమే పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని భావించినప్పటికీ ఇప్పుడు ప్రభుత్వ వైఖరి బిసి సంఘాల డిమాండ్‌ను చూస్తే ఖచ్చితంగా రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా అధికార యంత్రాంగం గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేస్తుంది. ఇప్పటికే ఎన్నికల తుది జాబితాలను ప్రకటించడమే కాకుండా ఆయా గ్రామ పంచాయతీలలో ప్రదర్శించి జాబితాపై సవరణలు, విజ్ఞప్తులను స్వీకరించారు. రాజకీయ పక్షాలతో సమావేశం కూడా ఏర్పాటు చేయనున్నారు. రాజకీయ పక్షాలు స్థానిక సమరానికి తమ క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్నాయి. అధికార కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఆశించిన స్థానాలకు గెలవకపోయినా అధికారం అండగా ఈసారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అత్యధిక గ్రామ పంచాయతీలను గెలుచుకోవాలని ప్రయత్నిస్తుంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో పాటు కాంగ్రెస్ శాస న సభ్యులు స్థానిక సంస్థ ల్లో బలం నిరూపించుకుని పట్టు సడలలేదని చూపాలన్న ఆలోచనలో ఉన్నారు. ప్రధాన విపక్షమైన బిఆర్ఎస్ సభలు, సమావేశాలతో పాటు ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజలను ఆకర్షించే పనిలో ఉంది.

సిపిఐ ఇప్పటికే సిపిఐ మండల స్థాయి సమావేశాలు నిర్వహించి బలమైన గ్రామాల్లో బరిలోకి దిగేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆ పార్టీ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిసారించారు. సిపిఎం మహాసభల నిర్వహణలో ఉంది. ఇప్పటికే గ్రామ, మండల సభలను పూర్తి చేసుకున్న సిపిఎం డివిజన్ మహాసభలను నిర్వహిస్తుంది. ఈనెలలోనే జిల్లా మహాసభలను నిర్వహించబోతుంది.




ఈ క్రమంలోనే క్యాడర్‌ను స్థానిక ఎన్నికలకు సమాయత్తం చేస్తుంది. సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ తదితర పార్టీలు తమకున్న బలమున్న చోట పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి.

మొత్తంగా స్థానిక ఎన్నికల వేడి కనపడుతుంది. పోటీ చేయాలనుకునే వారు రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్నారు. రిజర్వేషన్ సానుకూలంగా వస్తే ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలనుకున్న ఆలోచనలో ఉన్నారు.

ఫోకస్

# కళారంగం

## కశ్మీర్ హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపు

ఒకప్పుడు తివాచీలు, హస్తకళలు అంటే ముందుగా కశ్మీరే గుర్తుకొచ్చేది. కానీ, క్రమంగా అక్కడి రాజకీయ అస్థిరత్వం, మత ఘర్షణలు వంటి అనేకానేక కారణాలవల్ల కశ్మీర్ తన ప్రాభవాన్ని కోల్పోయింది. ఇప్పుడు తిరిగి క్రమంగా అంతర్జాతీయ గుర్తింపును పొందుతున్నది. కశ్మీర్, మధ్య ఆసియాకు చెందిన కళాకారుల సదస్సు చాలాకాలం తర్వాత శ్రీనగర్‌లో ఇటీవల జరిగింది. వివిధ కళాకృతులు, రూపాల సాంకేతికతక, నైపుణ్యత పరస్పర మార్పిడికి అవగాహన కుదిరింది. శ్రీనగర్‌ను 'వరల్డ్ క్రాఫ్ట్ సిటీ'గా గుర్తిస్తూ వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్ (డబ్ల్యుసిసి) ఒక ప్రకటన విడుదల చేసింది. క్రీస్తుశకం 15వ శతాబ్దంలో, కశ్మీర్ 9వ సుల్తాన్ జైన్ ఉల్ అబిదిన్ ఇలాంటి సదస్సును నిర్వహించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అప్పట్లో సమర్కంఢ్, బుఖారా, పర్షియా నుంచి వచ్చిన కళాకారుల సహాయంతో కశ్మీర్‌లో క్రాఫ్ట్ టెక్నిక్‌ను పరిచయడం చేశాడు. ఆ తర్వాత శ్రీనగర్ సాంస్కృతిక, కళావికాసం కొనసాగింది. అయితే, ఆ తర్వాత క్రమంగా క్షీణదశ మొదలైంది. 1947 తర్వాత కశ్మీర్‌లో పరిస్థితులు మారాయి. హస్తకళలు ధ్వంసమయ్యాయి. తాజా సదస్సు, ఒప్పందాలతో కశ్మీర్ హస్తకళలకు మళ్లీ అంతర్జాతీయ గుర్తింపు రావడం ఖాయంగా కనిపిస్తున్నది. కశ్మీర్‌కు మాత్రమే పరిమితమైన వారసత్వ హస్తకళల నైపుణ్యాలను మధ్య ఆసియా కళాకారులు అధ్యయనం చేస్తారు. అదే విధంగా, చెక్కపై అద్భుతంగా బొమ్మలు చెక్కే విధానాన్ని వారి నుంచి కశ్మీర్ కళాకారులు నేర్చుకుంటారు. కార్పెట్లు నేయడంలో కశ్మీర్ కళాకారులతో ఎవరూ పోటీపడలేరు. అనాదిగా వస్తున్న ఈ కళలోనూ కశ్మీర్ కళాకారులు మరోసారి అంతర్జాతీయ మార్కెట్‌వైపు దృష్టి సారిస్తున్నారు. కశ్మీర్‌లో దాదాపు 92 శాతం మంది కళాకారులు తమ ప్రాథమిక ఆదాయ వనరుగా చేతివృత్తులపై ఆధారపడతారు. అయితే వచ్చే ఆదాయం తరచుగా సరిపోదు, చాలా మంది వ్యవసాయం లేదా రోజువారీ కార్మికులు వంటి ద్వితీయ జీవనోపాధి ఎంపికలను చేపట్టవలసి వస్తుంది. అంతేగాక, 63 శాతం మంది మహిళా కళాకారులకు సోజ్ని వంటి చేతి వృత్తుల్లో నైపుణ్యం ఉంది.



కానీ, వేతన లేదా ఆదాయంలో అక్కడ పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువ. సరైన ఆదాయం లేకపోవడంతో ఎంతో మంది కళాకారులు ఇప్పటికే జీవనోపాధి కోసం ఇతరత్రా రంగాలకు వెళ్లిపోయారు. చాలా మంది కళాకారులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

## మౌర్యుల కాలం నాటి 80- స్తంభాల అసెంబ్లీ హాల్

పాట్నాలోని కుమ్రార్‌లోని మౌర్య పురావస్తు ప్రదేశంలో 80 స్తంభాల అసెంబ్లీ హాలు యొక్క అవశేషాలను వెలికితీసే ప్రయత్నాలను ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) ప్రారంభించడంతో, అలనాటి చరిత్రకు సంబంధించి మరింత సమాచారం లభించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మౌర్య సామ్రాజ్యంలో విస్తరించిన కళలు, శిల్పరీతులను ప్రపంచానికి తెలియచేయడానికి ఈ ప్రయత్నం ఉపయోగపడనుంది. కమ్రార్‌లోని అసెంబ్లీ హాల్ నిర్మాణ శైలి క్రీస్తుపూర్వం 321–185 మధ్యకాలంలో విరాజిల్లిన మౌర్య సామ్రాజ్య వికాసానికి, వైభవానికి నిదర్శనం. అశోక చక్రవర్తి (క్రీస్తు పూర్వం 268–232) ఈ హాలులో 3 వ బౌద్ధ మండలిని ఏర్పాటు చేసినట్టు చరిత్ర పరిశోధకుల విశ్వాసం. విచ్ఛిన్నమైన బౌద్ధ సంఘాన్ని ఏకం చేయడం, బౌద్ధ ధర్మాన్ని, బుద్ధుని బోధనలను ప్రచారం చేయడమే మండలి లక్ష్యం. బౌద్ధమతాన్ని ప్రపంచ మతంగా తీర్చిదిద్దడంలో బౌద్ధ మండళ్లు అత్యంత కీలకమైన పాత్ర పోషించాయి. మౌర్య సామ్రాజ్య రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా పాటలీపుత్రం (నేటి పాట్నా) ప్రధాన భూమిక పోషించిన వైనాన్ని కుమ్రార్‌లోని అసెంబ్లీ హాల్ నిర్మాణం స్పష్టం చేస్తున్నది. ఈ హాలు పైకప్పును చెక్కతో నిర్మించారు. దానికి ఊతంగా 80 ఇసుక రాయి స్తంభాలు ఉన్నాయి. ఇసుక రాయి, కలప తదితర నిర్మాణ సామాగ్రిని సోన్ గంగా నది మార్గం ద్వారా నిర్మాణ ప్రాంతానికి తీసుకొచ్చారు. మౌర్యుల కాలంలో అధునాతన ప్రణాళికా విధానాలు, వనరుల అద్భుత నిర్వహణకు ఇవి చారిత్రక ఆధారాలు. ఈ ప్రాంతంలో మొట్టమొదటి పురావస్తు తవ్వకాలు 1912–1915 మధ్యకాలంలో జరిగాయి. చెక్కు చెదరకుండా ఉన్న ఒక స్తంభం, ఇతర స్తంభాల స్థానానికి గుర్తుగా 80 గుంటలు, రాతి శకలాలను అప్పట్లో కనుగొన్నారు. ఇండో–గ్రీక్ దండయాత్ర లేదా ఆ తర్వాత జరిగిన హునా దండయాత్రల సమయంలో, ఇక్కడి కట్టడాలు అగ్నికి ఆహుతయ్యాయని చెప్పేందుకు నిదర్శనంగా మంద పాటి బూడిద పొరలను కూడా గుర్తించారు. రెండవ తవ్వకాలు 1961–1965 మధ్యకాలంలో జరిగియి. అప్పుడు నాలుగు అదనపు స్తంభాలను వెలికితీశారు. అయితే, పెరుగుతున్న నీటి మట్టాలు ఈ ప్రాంతంలో తవ్వకాలకు ఆటంకం కలిగించాయి. పాక్షికంగా నీటిలో మునిగిపోవడంతో, సైట్‌ను పరిరక్షించాలనే ఉద్దేశంతో, 2004, 2005 సంవత్సరాల్లో ఎఎస్ఐ మట్టితో కప్పేసింది. కాగా, తాజాగా మళ్లీ ఇప్పుడు తవ్వకాలను ఆరంభించింది. భూమి పొరల్లో ఉన్న తేమను, అక్కడ భూగర్భజల ప్రభావాలను అధ్యయనం చేయడానికి వీలుగా తొలుత 67 స్తంభాలను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర భూగర్భజల సంఘం మద్దతుతో, నిపుణుల కమిటీ మొత్తం 80 స్తంభాలను తిరిగి తెరవడంపై నిర్ణయం తీసుకుంటుంది. ఈ ప్రాంత సంరక్షణ బాధ్యతను ప్రజలతో పంచుకుంటుంది.






## పదవిన్యాసాల సమ్మేళనం ఖోరియా...

గ్రామీణ జీవితంలోని అందాన్ని, సుఖాన్ని, అక్కడి కల్మషం లేని మనుసులను పరిచయం చేసే నృత్యంగా ఖోరియాను పేర్కోవచ్చు. ఈ నృత్య రీతిలో స్త్రీ, పురుషులు ఇద్దరు పాల్గొంటారు. నృత్యంలో క్లిష్టమైన పాద కదలికలు, పాద విన్యాసాలను మనోరంజకంగా ప్రదర్శిస్తారు. ఈ నృత్యాన్ని ఎక్కువగా పంట చేతికొచ్చే శుభసమయంలోతమ సంతోషాన్ని ఆనందాన్ని ఈ నృత్య రూపంలో వెల్లడిస్తారు. ఇది వ్యవసాయంలో వారి విజయాన్ని, సంతోషాన్ని ప్రతిబింబిస్తుంది. హర్యానాలోని ఖోరియా నృత్యం వాస్తవ ప్రదర్శనలో, మహిళలు, బాలికలు నృత్య ప్రదేశంలోకి ప్రవేశించి జానపద పాట పాడుతూ వృత్తాకారంలో నిలబడతారు. ఈ నృత్యం కోసం, ప్రదర్శకులు పూర్తి బంగారుజరీ స్కర్టులు (పొడవాటి మోకాళ్ల వరకు ఉండే దుస్తులు), రంగురంగుల చున్నీలు మరియు భారీ మోటైన ఆభరణాలను ధరిస్తారు. మొదట నెమ్మదిగా సాధారణ పాదకదలికలు ఉంటాయి. దుస్తులను,అలల్లా వూపడంతో మొదలై క్రమంగా వేగాన్ని సంతరించుకుంటాయి. చూస్తున్న వారిలో ఉత్సుకతను పెంచుతాయి. రెండు లేదా మూడు జతల అమ్మాయిలు వృత్తాకారం నుండి మధ్యలోకి తమ చేతులు జోడించి, ఒకదానితో ఒకటి కలుపుతూ, వారి పాదాల అక్షం మీద తిరుగుతూ ఉంటారు, అయితే, వలయంలో ఉన్న అమ్మాయిలు డోలు వాద్యానికి అనుగుణంగా చప్పట్లు కొడతారు. చివరి దశలో,నృత్యం ప్రధానంగా వలయం చుట్టూతిరుగుతూ ప్రదర్శించబడుతుంది. ఈ నృత్యం కొన్ని సార్లు సాధారణంగా వరుడు తన కొత్త వధువును ఇంటికి తీసుకురావడానికి చాలా కాలం వేచి ఉన్న సమయంలోనూ ప్రదర్శిస్తారు. అలాంటి సమయంలో, మహిళలు తమ ప్రదర్శనలో మొత్తం వివాహ వేడుకను అనుకరిస్తారు. కొత్తగా పెళ్లయిన జంటతో పాటు వివాహ కుటుంబం సురక్షితంగా తిరిగి రావాలని మహిళలు కోరుకుంటారు.



## బయల్పడిన 13వ శతాబ్దపు రాతి శాసనం

కర్నాటకలోని దావంగెరె జిల్లాలో 13వ శతాబ్దానికి చెందిన ఓ రాతి శాసనం బయల్పడింది. ఈ ప్రాంతంలోని పురాతన దేవాలయాల శ్రేణులకు చెందినదిగా దీనిని భావిస్తున్నారు. శాసనం బయటపడిన ఆలయ నిర్మాణం రెండు కన్నడ రాజవంశాల పాలనలకు విస్తరించింది. 10వ శతాబ్దం మధ్యకాలంలో రాష్ట్రకూట రాజవంశం, పశ్చిమ చాళుక్య వంశం ఈ ఆలయాలను నిర్మించి ఉంటారని చరిత్రకారులు చెప్తున్నారు. క్రీస్తుశకం 987 ప్రాంతంలో తైలప II రాజు సింహాసనన్నా అధిష్టించినప్పుడు ప్రతిష్ఠించిన శాసనం ఇప్పుడు బయటపడింది. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) ఈ ప్రాంతంలో విస్తారంగా తవ్వకాలు జరుపుతున్నది. ఇక్కడ తాజాగా బయటపడిన ఆలయం పక్కనేద ఒక పద్ద పంటపాన్ని గుర్తించారు. తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయంలో గర్భగుడి, ఒక పూర్వ గది లేదా వసారా లేదా అంతరాలయం ఉన్నాయి. దీని గోపురాన్ని సుఖనాసి అని పిలుస్తారు. గర్భగుడిని సామేశ మందరి లేదా సభామంటపంతో కలుస్తుంది. దీని ముందే ప్రధాన హాలు ఉంటుంది. ఈ ఆలయంలోని షికారా ప్రారంభ చోళుల వాస్తశిల్పానికి ప్రతీకలగా నిలుస్తున్నది. ఈ ఆలయంలోని పెద్ద శివలింగం కనీసం 1000 సంత్సరాల క్రితం నాటిదని అంటారు. ఆలయాన్ని భారత పురావస్తు శాఖ అత్యంత ప్రాముఖ్యతగల స్మారక చిహ్నంగా ప్రకటించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో భూగర్భంలో కలిసిపోయిన నాగరికతలను, చరిత్ర ఆనవాళ్లను వెలికితీసి, సంరక్షించి, వారసత్వ సంపదను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ)ని 1861లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ అలెగ్జాండర్ కన్నింహామ్ నెలకొల్పాడు. స్వాతంత్ర్యం అనంతరం ఇది పురాతన స్మారక చిహ్నే, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం 1955 ప్రకారం అధికారిక సంస్థగా రూపుదిద్దుకుంది. ఎఎస్ఐ దేశంలోని పురావస్తు పరిశోధన, సాంస్కృతిక స్మారక చిహ్నాల పరిరక్షణ.. నిర్వహణ... బాధ్యతలను నిర్వరిస్తుంది. వివిధ రకాల సర్వేలు, పురావస్తు ప్రదేశాల అన్వేషణ, తవ్వకాలు, రక్షిత స్మారక చిహ్నాల సంరక్షణ, నిర్వహణ తదితర కార్యకలాపాలు నిర్వహిస్తుంది.



## ప్రతిపల్లెలో ఎర్రజెండా ఎగరాలే

సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



**ప్రజాపక్షం/చెన్నూరు :** కమ్యూనిస్టుల పోరాటాలను చాటి చెప్తూ ప్రతీ పల్లెలో ఎర్రజెండా ఎగరవేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం చెన్నూరు మండలం నాగపూర్ గ్రామ మాజీ సర్పంచ్ సుత్రం నారాయణ, గ్రామానికి చెందిన సంతోష్, పోశంతో పాటు పలువురు మహిళలు సిపిఐలో చేరగా వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు ఆకర్షితులై నాగపూర్ గ్రామమాజీ సర్పంచ్ ఆయన అనుచర వర్గంతో పార్టీలోకి వచ్చారని, ప్రజా సమస్యలపై పోరాడాలనే సంకల్పం కలిగిన ప్రతీ ఒక్కరూ పార్టీలోకి వచ్చి కమ్యూనిజానికి మరింత బలాన్ని చేకూర్చి, ప్రజా సమస్యలపై సిపిఐ చేస్తున్న పోరాటల్లో భాగస్వాములు కావాలని పిలునిచ్చారు. పార్టీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎర్రజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు రేగుంట చంద్రశేఖర్, చెన్నూరు మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌలు, డిహెచ్‌ఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నాయకులు సిరికొండ రాజమల్లు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన ఆవిర్భావ ఉత్సవాలు

సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సిపిఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామగ్రామాన ఉత్సవాలు నిర్వహిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటం లో అనేక మంది త్యాగాలు చేసిన వీరచరిత్ర కమ్యూనిస్ట్ పార్టీదేనన్నారు. తెలంగాణ ప్రాంతంలో వీరోచిత రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి నైజాం నవాబు మెడలు వంచి పది లక్షల ఎకరాల భూమి పంచి 4 వేల గ్రామాలను వెట్టిచాకిరి నుండి విముక్తి చేసిన ఘనచరిత్ర సిపిఐ పార్టీదన్నారు. మలిదశ పోరాటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 263 జిల్లాల్లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకై ఒకే మాట మాట్లాడిన పార్టీ సిపిఐ పార్టీదేనన్నారు. ఆనాటి నుండి నేటి వరకు ప్రజా, కార్మిక సమస్యలపై రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. జిల్లాలో డిసెంబర్ 26న గ్రామగ్రామాన పార్టీ జెండాలను ఆవిష్కరించి 100 సంవత్సరాల ఉత్సవాలను నిర్వహించాల్సిందిగా పార్టీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామగ్రామాన ఎర్రజెండా ఆవిష్కరించాలని పార్టీ శ్రేణులను కోరారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను జిల్లా కౌన్సిల్ పక్షాన కోరుతున్నామన్నారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు సఖి, సురేష్, ఇమ్రాన్ అలీ, భాను, సత్యం, లింగం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌పరం చేయొద్దు

మంత్రి సీతక్కకు ఎఐటియుసి వినతి

మిడ్ డే మీల్స్ కార్మికుల ధర్నా






**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌పరం చేసే విధానాన్ని విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి సీతక్కకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాష్టవ్యాప్త పిలుపులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో బస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు వంట కార్మికులు ర్యాలీగా బయలుదేరి మజీద్ సెంటర్ లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జంపాల రవీందర్ మాట్లాడుతూ మెనూ చార్జీలు పెంచకుండా విద్యార్థులకు రెండు కూరలు, మూడు కోడిగుడ్లు ఎలా అందిస్తారని, ప్రస్తుతం విద్యార్థులకు ఇస్తున్న మెనూ చార్జీలు చిన్న పిల్లలకు రూ.6 నుండి 19, పెద్ద పిల్లలకు రూ.9నుండి 29 ఈనెల నుండి ఇస్తున్నారు. కోడిగుడ్డుకు ప్రభుత్వం రూ.5లు చెల్లిస్తుంటే మార్కెట్‌లో రూ.7 నుండి రూ.8కి లభిస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మెనూ చార్జీలు పెంచకుండా రెండు కూరలు, మూడు కోడిగుడ్లు ఎలా అందిస్తారో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఈ సాకుతో అధికారులు వంట కార్మికులను తొలగించడానికి యత్నాలు చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, నాయకులు ముత్యాల రాజు, కొక్కుల రాజేందర్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు, సామల రమ, గున్నాల రాజకుమారి, జనగాం శోభ, పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, కుడుముల సమ్మక్క, భాగ్య, స్వరూప, రవీంద్ర, నవలోక తదితరులు పాల్గొన్నారు.

**ములవాడ టౌన్:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుండి ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వరకు కార్మికుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు 10,000 వేతనం ఇస్తా అని చెప్పి, అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం గడుస్తున్న నేటి వరకు హామీ నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రంలో 54,200 మంది మధ్యాహ్న భోజన కార్మికులు మధ్యన భోజన పథకంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు గత 23 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ప్రతినెల 5వ తారీఖు లోపు బిల్లులు చెల్లించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు లక్ష రూపాయల లోపు రుణాలు ఇవ్వాలని, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మణ్, కడారి రాములు, బిరెడ్డి లక్ష్మి రాజమణి, కెవి అనసూర్య, వెంకట నరసవ, జ్యోతి, మానస, రోజా, లత, నరసయ్యా, విజయ, మానస, లక్ష్మి నరసవ, లింబవ, రాజవ్వ, సుజాత, తదితరులు ఉన్నారు.

**ఖమ్మం :** మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తుందని ఆరోపించారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు కనీస వేతనం కింద రూ.26 వేలు చెల్లించడంతోపాటు ఏడు నెలలుగా పెండింగ్‌లో వేతనం, పెండింగ్‌లో ఉన్న మెనూఛార్జీలు, కోడిగుడ్లు, అల్పాహార బిల్లులు చెల్లించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, మధ్యాహ్న భోజన కార్మికులు నిమ్మటూరి రామకృష్ణ, ఇజ్జగాని వెంకటమ్మ, జక్కంపూడి వెంకట లక్ష్మి, రాజ్యలక్ష్మి, శిరోమణి, సీత, పార్వతమ్మ, వెంకట్రామ్మ, శిరోమణి, భారతి, వరలక్ష్మి, రంగమ్మ, కనకమ్మ, తిరపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



## దళిత హక్కుల రక్షణకు పోరాటాలు

డిఎచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మనోహర్



**ప్రజాపక్షం/ధర్మసాగర్:** దళిత హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని డిహెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్ పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మండల కేంద్రములోని అంబేద్కర్‌చౌరస్తాలో బుధవారం డిఎచ్‌పిఎస్ జాతీయ రెండవ మహాసభల కరత్రాలను ధర్మసాగర్ డిఎచ్‌పిఎస్ మండల కార్యధర్శి మునిగాల రత్నం అధ్యక్షత విడుదల చేవారు. కార్యక్రమానికి నిమ్మల మనోహర్ హాజరై మాట్లాడారు. కాం గ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దళితులకు అంబేద్కర్ అభయహస్తం పేరుతో 12లక్షల రూపాయలు ఇస్తామన్నా వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. దేశంలో మత విద్వేషా లు గ్రామాల్లో కుల ఘర్షణలు మినహా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దళితుల చేసింది ఏమి లేదన్నారు దేశ ప్రజల గుండెకాయ లాంటి భారత రాజ్యాంగాన్ని రద్దుచేయడానికి ప్రయత్రాలు జరుగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా దళితులకు ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణ సామాజిక న్యాయం కొరకు, కుల వివక్షత కులనిర్మూలనకు ఎస్‌సి సబ్ ప్లాన్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఆందోళన కార్యచరణ రూపకల్పనకు జనవరి 5,6,7 తేదిలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్, ఖైరతాబాద్ హైదరాబాద్‌లో డిహెచ్ పిఎస్ సభలు జరుగుతాయని, దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరవుతున్నారన్నారు. మహాసభల విజయవంతానికి దాతలు ఆర్థిక సహాయ సహకారాలు అందించలని కోరారు.కార్యక్రమములో సిపిఐ సీనియర్ నాయకులు బట్టు మల్లయ్య, కోట్టే ప్రభాకర్, చిలుక బాబు, రాజాపు దేవన్న, హసన్‌పర్తి మండల ఉపాధ్యక్షులు బోడిగ కమలాకర్, జేమ్స్, సారయ్య, సంజీవతో మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గన్నారు.

## తిరుపతి మరణం ఉద్యమానికి తీరనిలోటు

నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన ఎఐఎస్‌ఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు, సిపిఐ హనుమకొండ జిల్లా కౌన్సిల్ సభ్యులు మంచాల తిరుపతి అకాల మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. అనారోగ్య కారణంగా మృతిచెందిన తిరుపతి మృతదేహంపై మర్రి వెంకటస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. తిరుపతి భార్య హనుమకొండ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవిని ఓదార్చారు. ఆనంతరం వెంకటస్వామి మాట్లాడుతూ వంగర గ్రామంలో పుట్టిన తిరుపతి చదువుకుంటున్న సమయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య చేరి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్మించారన్నారు. ఎఐఎస్‌ఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు అధ్యక్షుడిగా పనిచేసి ఉద్యమ బలోపేతానికి కృషి చేశారన్నారు. జిల్లాల విభజన అనంతరం హనుమకొండ జిల్లాలో సిపిఐలో పని చేస్తూ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారని, పార్టీ కార్యక్రమాల్లో భూ పోరాటాల్లో చురుకుగా పనిచేసిన తిరుపతి అకాల మరణం సిపిఐకి తీరని లోటని, ఆయన మృతి పట్ల సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి పక్షాన తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ , సిపిఐ వారి కుటుంబానికి అండగా ఉంటుందని వెంకటస్వామి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, బత్తుల బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లవ్వ, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, కంది రవీందర్‌రెడ్డి, అఖిల భారత శాంతి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగం శంకర్, సైదాపూర్ మండల సిపిఐ మాజీ కార్యదర్శి వొడ్నాల వెంకటేష్, నాయకులు రాజేశం శ్రీనివాస్, రాములు తదితరులున్నారు.

## తృణముల్ ఎంపి వ్యాఖ్యలపై
# లోక్‌సభలో దుమారం



న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాపై తృణమూల్ కాంగ్రెస్‌ఎంపి కళ్యాణ్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో బుధవారం నాడు లోక్‌సభ పలుమార్లు వాయిదాపడింది. టిఎంసి ఎంపి క్షమాపణ చెప్పినప్పటికీ సద్దుమణగకపోవడంతో సభ గురువారానికి వాయిదాపడింది. విపత్తు నిర్వహణ చట్ట సవరణపై చర్చ సందర్భంగా కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించలేదని ఆరోపించారు. దీనికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ జోక్యం చేసుకొని ప్రధాని నరేంద్ర మోదీ అనిన రాష్ట్రాలకు సహాయం చేయడం ద్వారా సంక్షోభాన్ని విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం తన భూభాగం ద్వారా కొవిడ్ వ్యాక్సిన్‌లను రవాణా చేయడంలో ఆటంకాలు సృష్టించిందని అన్నారు. కేంద్ర మంత్రి సింధియా లేచి నిలబడి నిత్యానంద్ రాయ్‌కు మద్దతుగా నిలిచారు. దీంతో ఆయనకు వ్యతిరేకంగా కళ్యాణ్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలను స్పీకర్ ఓంబిర్లా రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవహారం అధికార , ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారి తీయడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తరువాత బెనర్జీ తన వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పినప్పటికీ సింధి యా అంగీకరించ లేదు. ఇది ఆత్మగౌరవ సమస్య అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలను తనపై, దేశ మహిళలపై వ్యక్తిగత దాడి అని, అందుకే క్షమాపణ అంగీకరించబోనని సింధియా భీషించారు. కళ్యాణ్ బెనర్జీ మరోసారి క్షమాపణ చె ప్పినప్పటికీ అధికార పక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న ఎ.రాజా సభను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తరువాత బిల్లు పై ఎస్‌పి సభ్యుడు మాట్లాడుతుండగా పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగాయి. దీంతో సభాపతి సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించా రు. అంతకుముందు రైల్వే సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. మధ్యాహ్నం స భలో జీరో అవర్ ప్రారంభమవగానే జార్జ్ సోరొస్ వ్యవహారంపై కాంగ్రెస్, బిజెపిల మధ్య వాగ్వాదం జరిగి సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. కాగా అనేక రోజుల అంతరాయం తరువాత లోక్‌సభ మొత్తం ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టింది. ఆ తరువాత జీరో అవర్‌లో పలువురు సభ్యులు తమ నియోజకవర్గాల సమస్యలు లేవనెత్తారు. కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగొయ్ జీరో అవర్‌లో మణిపూర్‌లో హింసాకాండలో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే బిజెపి సోరొస్ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చిందని ఆరోపించారు. దీనికి కేందర మంత్రి పీయూష్ గోయల్ స్పందిస్తూ సోరొస్ మద్దతు ఇస్తున్న సంస్థతో కాంగ్రెస్ అగ్ర నేతలకు సంబంధాలు ఉన్నాయని, ఆ సంస్థలు దేశాన్ని అస్థిర పరిచేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

# సభను సజావుగా నడపండి

ఒక చేతిలో త్రివర్ణ పతాకం, మరో చేతిలో ఎర్రగులాబీతో విపక్ష ఎంపిలు వినూత్న నిరసన



న్యూఢిల్లీ : పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతూనే ఉంది. రోజుకో వినూత్న పద్ధతిలో సాగిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా పలువురు ప్రతిపక్ష ఎంపిలు బుధవారం పార్లమెంటు ఆవరణలో ఒక చేతిలో త్రివర్ణ పతాకం, మరో చేతిలో ఎర్ర గులాబీతో అధికార పార్టీకి చెందిన బిజెపి సభ్యులను పలకరించారు, సభా కార్యకలాపాలు, అదానీ వివాదం సహా అన్ని అంశాంలపై చర్చ జరిగేలా చూడాలని కోరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రధాన పార్లమెంటు భవనంలోకి ప్రవేశిస్తున్నప్పుడు త్రివర్ణ పతాకాన్ని కార్డు రూపంలో అందించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్, డిఎంకె, జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) వామపక్ష పార్టీలకు చెందిన అనేక మంది ఎంపిలు మకర ద్వారం మెట్ల ముందు చిన్న త్రివర్ణ కార్డు, ఎర్ర గులాబీని పట్టుకుని నిలబడి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. 'దేశాన్ని అమ్ముకోనివ్వొద్దు' అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను పలువురు ఎంపిలు చేబూని నినదించారు. దీనిపై కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాగూర్ మాట్లాడుతూ ఇతర విషయాల కంటే దేశం చాలా ముఖ్యమైనది అనే విషయాన్ని బిజెపి నేతలకు తెలియజేయాలనే ఉద్దేశంతో వారికి జాతీయ జెండాలు ఇచ్చామన్నారు. కాగా, మంగళవారం ఎంపిలు ముదురు నీలిరంగు 'ఝోలా'పై ప్రధాని నరేంద్ర మోదీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ వ్యంగ్య చిత్రాలను ఒకవైపు ముద్రించి, మరోవైపు 'మోదీఅదానీ భాయ్‌భాయ్' అని వ్రాసిన బ్యాగ్‌లతో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. మోదీ, అదానీల మధ్య జరిగిన కుమ్మక్కు వ్యవహారానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. ఈ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణకు డిమాండ్ చేశారు. సోమవారం కూడా ఇండియా కూటమి పార్టీలకు చెందిన నాయకులు అదానీ వివాదంపై పార్లమెంటు కాంప్లెక్స్‌లో నిరసన వ్యక్తం చేశారు, రాహుల్ గాంధీ ఈ అంశంపై మోడీ, అదానీల ముసుగులు ధరించి మాక్ 'ఇంటర్వ్యూ' నిర్వహించారు. శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ అంశంపై విపక్షాల నిరసనలు పార్లమెంట్ ఆవరణలో కొనసాగుతున్నాయి.

## రోడ్డు ప్రమాదబాధిత మహిళ
# పరిహారాన్ని పెంచిన 'సుప్రీం'

ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ 'అపెక్స్ కోర్టు'కు అప్పీల్

రూ.50.87లక్షలకు పరిహారం పెంచుతూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు



న్యూఢిల్లీ : వివాహం లేదా సాంగత్యం అనేది ఒక వ్యక్తి సహజ జీవితంలో అంతర్భాగమని బుధవారం సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది. రోడ్డు ప్రమాదం కారణంగా 75శా తం మేధో వైకల్యం ఉన్న మహిళకు సర్వోన్నత న్యాయస్థానం పరిహారం పెంచింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయి, జస్టిస్ కెవి.విశ్వనాథన్‌లతో కూడిన ద్విస భ్య ధర్మాసనం విచారణ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 2009లో ప్రమాదం జరిగినప్పుడు బాధిత మహిళకు 7సంవత్సరాలని, మెడికల్ సర్టిఫికెట్ ప్రకారం గా ఆమె ఒక మోస్తరు మితమైన మేధో వైకల్యంతో బాధపడుతోందని పేర్కొంది. 'సమర్థవంతంగా ఆమె శరీరం పెరుగుతున్నప్పుడు ఆమె చిన్న శిశువుగా ఉంటుంది' అని ధర్మాసనం వెల్లడించింది. అత్యున్నత న్యాయస్థానం ఇంకా ఇలా చెప్పి ంది. అప్పిలెంట్ (మహిళ), అందువల్ల ఆమె తన బాల్యా న్ని మాత్రమే కాకుండా వయోజన జీవితాన్ని సైతం కోల్పోయింది.వివాహం/ సహచర్యం అనేది మానవ సహజ జీవితంలో ఒక అంతర్భాగం. ఆ మహిళ పిల్లలను భరించగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ వారిని పెంచడం, వైవాహిక జీవితం, సాంగత్యం, సరళమైన ఆనందాలను ఆస్వాదించడం అసాధ్యం అని ధర్మాసనం గమనించింది. దీంతో ధర్మాసనం పరిహారాన్ని రూ.50.8లక్షలకు పెంచింది. ఆ మహిళకు రూ.11లక్షల పరిహారం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు 2017న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఆమె చేసుకున్న అప్పీల్‌పై సుప్రీం కోర్టు పరిహారం పెంచుతూ తీర్పును ఇచ్చింది. బాధిత మహిళ జీవితాంతం ఒక వ్యక్తిపై ఆధారపడిఉంటుందని, వయసు పెరిగినా మానసికంగా 2వ తరగతి చదువుతోన్న చిన్నారిగానే ఉంటారని ధర్మాసనం పేర్కొంది. జూన్ 2009లో అప్పీల్‌దారు తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వెళుతున్నారని, రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన కారు ఆమెను ఢీకొట్టిందని బెంచ్ తెలిపింది. మోటారు వాహనాల చట్టం , 1988ప్రకారం పరిహారం మంజూరు చేయాలనే క్లెయిమ్ పిటిషన్‌ను మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో దాఖలు చేయగా రూ.5.90లక్షల నష్టపరిహారాన్ని అందించింది. ప్రమాదంలో గాయపడిన వారికి ఇచ్చే పరిహారాన్ని పెంచాలని కోరుతూ అప్పీల్‌దారు హైకోర్టును ఆశ్రయించారు.హైకోర్టు రూ.11.51లక్షలకు నష్టపరిహారాన్ని పెంచడాన్ని సవాల్ చేస్తూ బాధిత మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. డాక్టరు సాక్ష్యం ప్రకారం మహిళ 75శాతం మితమైన మేధోవైకల్యం కలిగి ఉన్నదని తేలిందని మహిళా న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. మితమైన మేధోవైకల్యం ఉన్న పిల్లలు సాధారణంగా పిల్లల తరగతి 2 స్థాయి వరకు నైపుణ్యాలను మాత్రమే నేర్చుకోగలరని , దగ్గరి పర్యవేక్షణలో మాత్రమే పనిచేయగలరని మహిళ తరపు న్యాయవాది వాదించారు. ఆదాయ నష్టం లే దా సంపాదనా సామర్థ్యం, నొప్పి, బాధ, నష్టాల కింద పరిహారం మొత్తాన్ని సుప్రీంకోర్టు పెంచింది. వివాహ అవకాశాలు, అటెండర్ చార్జీలు, భవిష్యత్ వైద్య చికిత్స, మహిళకు పార్ట్ టైమ్ అటెండర్ మాత్రమే అవసరం అవుతుందని హైకోర్టు కలిగి ఉన్న దృక్పథాన్ని 'బెంచ్' తప్పు అని పేర్కొంది. దీనికి విరుద్ధంగా అప్పీలుదారు జీవితాంతం పూర్తిస్థాయి అటెండర్‌పై ఆధారపడతారని ధర్మాసనం అభిప్రాయపడుతున్నట్లు వెల్లడించింది. మహిళకు అందజేసిన నష్టపరిహారాన్ని రద్దు చేయాలని బీమా కంపెనీని ఆదేశించిన ధర్మాసనం, ఏదైనా ఉంటే సంస్థ ఇప్పటికే చెల్లించిన మొత్తాన్ని సర్దుబాటు చేయాలని పేర్కొంది.

## చర్చ జరపకుండా పారిపోవద్దు

న్యూఢిల్లీ :పార్లమెంటులో ఉభయసభలను నడిచేలా చర్యలు తీసుకోవాలని, అదానీ అంశంపై చర్చ జరపకుండా పారిపోవద్దని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ కోరింది. ''ప్రియమైన మోదీ, మన దేశాన్ని ఇంకా అమ్ముకోవద్దని, పార్లమెంటు నడిచేందుకు చర్యలు తీసుకోవాలని, చర్చ నుంచి పారిపోకండి అని భారతదేశ ప్రజల తరుపున తాను వినమ్రంగా కోరుతున్నానని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణు గోపాల్ తన ఎక్స్ ఖాతాలో బుధవారం పోస్ట్ చేశారు. మరో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ పార్లమెంటు కార్యకలాపాలు యథావిధిగా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్‌కు కాంగ్రెస్ లోక్‌సభ డిప్యూటీ లీడర్ గౌరవ్ గొగొయ్ లేఖరాసారని, ఉభయ సభలు సాధారణ కార్యకలాపాలు చేపడతాయని ఆశిస్తున్నామని అన్నారు. కానీ మోదీ ప్రభుత్వానికి సభ జరగాలని ఉందా? అని ప్రశ్నించారు. రాజ్యసభ ప్రారంభమైన తొలిరోజు 1952 మే నెల 16వ తేదీన ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎంపిలను ఉద్దేశించి ప్రసంగిస్తూ తాను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, అంటే తాను సభలోని అన్ని పార్టీలకు చెందిన వాడినని అన్నట్లు గుర్తు చేశారు. తాను ని ష్పాక్షి కంగా వ్యవహరిస్తానని ఆ వ్యాఖ్యల అర్థమన్నారు. అంతే కా కుండ ప్రధానమంత్రిని సైతం మదలించేందుకు , ఆయన వ్యా ఖ్యలు రికార్డుల నుంచి తొలగించేందుకు వెనుకాడబోనని సర్వేపల్లి అన్నారని, అవి భిన్నమైన రోజులు అని జైరామ్ రమేశ్ అన్నారు.

## అవసరాలకు అనుగుణంగానే 'వాణిజ్య' నిర్ణయాలు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : వాణిజ్యపరమైన అనుమతుల సమయంలో ఆర్థికవ్యవస్థ, దేశం ప్రాధాన్యతలు, వ్యూహాత్మక అవసరాలను మిళితం చేస్తూ భారత్ నిర్ణయాలు తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం నొక్కిచెప్పారు. గత దశాబ్దంలో నేర్చుకున్న పాఠాల ఆధారంగా పరిశ్రమను పున: స్థితికి తీసుకురావాలని, విశ్రాంతిని కోరుతూయ భౌగోళిక, రాజకీయ ప్రమాదాలు అంతరామం కలిగేలా కాకుండా సరఫరాగొలుసులు విస్తృతంగా ఉండాలని మంత్రి నిర్మలాసీతారామన్ ఆకాంక్షించారు. బుధవారం నాడు ఇక్కడ జరిగిన సిఐఐ గ్లోబల్ ఎకనామిక్ పాలసీ ఫోరమ్ 2024 సమావేశంలో ఆమె ప్రసంగించారు. 'నేడు ఆర్థిక, వాణిజ్యపరమైన అంశాలు ఆర్థిక వ్యవస్థ, దాని ప్రాధాన్యతలను రాజకీయాలు, వ్యూహాత్మక అవసరాలతో మిళితం చేశాయి' అని మంత్రి సీతారామన్ చెప్పారు. రాబోయే దశాబ్దకాలంలో వ్యవస్థ ప్రాధాన్యతలను వివరిస్తూ చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో కలిసిపెద్ద యూనిట్‌లకు ఎలా మద్దతు ఇవ్వగలదో అన్వేషించడానికి అదేవిధంగా ఉద్యోగకల్పనకూ సమానస్థాయిలో ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్థికమంత్రి సీతారామన్ చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆర్థిక సఫలీకృత ఫలాలు అంతటికీ విస్తరింపజేసినప్పుడే భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ), ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఒఎన్‌డిసి), సాంకేతిక ప్రగతి వ్యవసాయనిల్వ ప్రజాస్వామ్య సౌలభ్యతను కలిగిఉంటుందని చెప్పారు. రైతులు పపంచమార్కెట్‌లతో అనుసంధానం కాగలుగుతున్నారని, అందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానమే కారణమన్నారు.ముమ్ముందు మరిన్ని సమృద్ధికర వ్యవసాయిక నిల్వలు భారతదేశం నుంచి వస్తున్నాయన్న వా ర్తను మీరంతా వినబోతున్నారని నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

# కాంగ్రెస్‌తో పొత్తుకు 'నోచాన్స్'

మరోసారి స్పష్టం చేసిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే అవకాశాలను ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ బుధవారం మరోసారి తోసిపుచ్చారు. దేశ రాజధానిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు చేతులు కలపవచ్చని వస్తున్న వార్తల నేపథ్యంలో కేజ్రీవాల్ పొత్తులపై స్పష్టత ఇచ్చారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తన సొంత బలంతో ఎన్నికల్లో పోటీ చేస్తుందని కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే అవకాశం లేదని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. 70 మంది సభ్యులు ఉన్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలలో రెండు పార్టీలు పొత్తు పెట్టుకునే అవకాశం ఉందని మీడియాలో వచ్చిన కథనాల మధ్య ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నెల ప్రారంభంలో కూడా తమ పార్టీ, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు అవకాశం లేదని కేజ్రీవాల్ తోసిపుచ్చారు. ఇటీవలి సంచలన వ్యాఖ్యల నేపథ్యంలో షెడ్యూల్ ప్రకారం బుధవారం జరగాల్సిన కాంగ్రెస్ 'న్యాయ్ చౌపాల్' ఈవెంట్‌ను రద్దయింది. దీంతో రెండు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) భాగస్వాముల మధ్య పొత్తుపై మంరింత ఆజ్యం పోసినట్లయింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ చేపట్టిన 'న్యాయ్ యాత్ర' ముగింపు సందర్భంగా కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలోని కూటమికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని అధిపతిగా నియమించాలని ఇండియా కూటమిలో డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కేజ్రీవాల్ మంగళవారం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధినేత శరద్ పవార్‌ను కలిశారు. అయితే పవార్‌తో జరిగిన సమావేశంలో జరిగిన చర్చలపై కేజ్రీవాల్ కానీ, ఆప్ కానీ ఇప్పటి వరకు స్పందించలేదు. రానున్న ఢిల్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్, ఆప్ తమ ఎత్తుగడలతో జాగ్రత్తగా మందడుకు వేస్తున్నారని, అయితే భవిష్యత్తులో రెండు పార్టీల పొత్తులకు అవకాశం లేకపోలేదని వర్గాలు పేర్కొన్నాయి. తమ పార్టీ, కాంగ్రెస్ మధ్య పొత్తు ఉండవచ్చనే వార్తలు పూర్తిగా నిరాధారమైనవని ఆప్ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా అన్నారు. 'ఢిల్లీలో ఎలాంటి పొత్తుకు అవకాశం లేదు. ఇలాంటి నిరాధారమైన పుకార్లను ప్రచారం చేయవద్దని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసేందుకు ఆప్ పూర్తిగా సిద్ధంగా ఉంది' అని చద్దా చెప్పారు. ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే అవకాశం లేదని ఆ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ స్పష్టం చేశారని ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్ అన్నారు. ఆప్ స్వతంత్రంగా ఎన్నికల్లో పోటీ చేసి బిజెపిని మళ్లీ ఓడిస్తుందని, 2015లో 67 2020లో 62 సీట్లు గెలుపొందినట్లు సింగ్ గుర్తుచేశారు. ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేసినా బిజెపి చేతిలో మొత్తం ఏడు స్థానాల్లో ఓడిపోయాయి. అయితే, అక్టోబర్‌లో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలు దఫాలుగా చర్చలు జరిగినా సీట్ల పంపకాల్లో విఫలమయ్యాయి. కాగా, ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి 31 మంది అభ్యర్థుల పేర్లతో ఆప్ ఇప్పటి వరకు రెండు జాబితాలను విడుదల చేసింది. మిగిలిన అభ్యర్థుల పేర్లను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. 1998 నుంచి ఢిల్లీలో అధికారంలో లేకపోయినా, రాజధాని నుంచి ఆప్‌ని గద్దె దించాలని బిజెపి విశ్వప్రయత్నాలు చేస్తోంది.

## ఛత్తీస్‌గఢ్‌లోఎన్‌కౌంటర్ : మావోయిస్టు మృతి

- మందుపాతర పేల్చిన మావోయిస్టులు, ఇద్దరు జవాన్లకు గాయాలు
- ఇన్‌ఫార్మర్ నెపంతో బిజెపి నేతను కిరాతకంగా చంపిన మావోయిస్టులు

ప్రజాపక్షం/భద్రాచలం : ఛత్తీస్‌గఢ్ అడువుల్లో బుధవారం పోలీసులు మావోయిస్టుల నడుమ ఎదురు కాల్పులు జరిగాయి. ఆ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గంగలూరు అటవీ ప్రాంతంలో ఆపరేషన్ కగార్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలకు మావోయిస్టుల దళం తారసపడింది. లొంగిపోవాలంటూ హెచ్చరించినప్పటికీ మావోయిస్టులు ఎదురు కాల్పులకు దిగడంతో ఇరు వర్గాల మధ్య సుమారు రెండు గంటల పాటు ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందగా, మందుగుండు సామాగ్రి, తుపాకులను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా అదే రాష్ట్రంలో పెద్దకొర్మ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు వేర్వేరు చోట్ల రెండు మందుపాత్రలు పేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లకు తీవ్రగాయాలు కాగా, వారిని బీజాపూర్ ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు.

**బిజెపి నేత హత్య:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు బిజెపి నేతను అతి కిరాతకంగా హత్య చేశారు. బీజాపూర్ జిల్లా సోమర పల్లి గ్రామానికి చెందిన బిజెపి నేత మండోరామ్ గత కొంత కాలంగా పోలీస్ ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నారని భావించిన మావోయిస్టులు ఆయనను అతి దారుణంగా హతమార్చి భయానక వాతావరణాన్ని కృష్టించారు. ఈ ఘటనలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో యుద్ధ వాతావరణం నెలకొంది. వరుస ఘటనలో ఆ ప్రాంతం అట్టుడికిపోతోంది. ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్ అడవుల్లోని నుండి తలదాచుకునేందుకు మావోయిస్టుల తెలంగాణలోనికి ప్రవేశించే అవకాశం ఉన్నదని ఇంటిలిజెన్సి నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో ఇరు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమై నిఘా పెంచారు.

# మనీష్ సిసోడియాకు సుప్రీంకోర్టు ఊరట



న్యూఢిల్లీ : లిక్కర్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో 'ఆప్' నేత మనీష్ సిసోడియాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. బెయిలు షరతులను అత్యున్నత న్యా యస్థానం బుధవారంనాడు సడలించింది. బెయిలు షరతుల ప్రకారం, వారంలో రెండు సార్లు విచారణ కార్యాలయంలో ఆయన రిపోర్ట్ చేయాల్సి ఉండగా, ఇక నుంచి ఆ అవసరం లేదని న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం సడలింపు ఇచ్చింది. 'వారానికి రెండుసార్లు రిపోర్ట్ చేయాలనే బెయిలు షరతును తొలగిస్తున్నాం. అయితే అప్లికెంట్ (సిసోడియా) రెగ్యులర్‌గా విచారణకు హాజరు కావాలి' అని కోర్టు స్పష్టం చేసింది. మనీలాండరింగ్ కేసులో సిసోడియాకు గత ఆగస్టు 9న కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ జరపకుండా 17 నెలల పాటు నిర్బంధంలో ఉంచడాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయనకు బెయిలు మంజూరు చేసింది. అయితే ప్రతి సోమ, గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య విచారణ అధికారికి రిపోర్ట్ చేయాలని షరతు విధించింది. సిసోడియా బెయిల్ అభ్యర్థనపై నవంబర్ 22న విచారణకు అంగీకరించిన అత్యున్నత న్యాయస్థానం సిబిఐ, ఇడిలను స్పందించాల్సిందిగా నోటీసులు ఇచ్చింది. 22వ తేదీ విచారణలో సిసోడియా తరఫు న్యాయవాది తమ వాదన వినిపిస్తూ, దర్యాప్తు అధికారుల ముందు సిసోడియా 60 సార్లు హాజరయినట్టు కోర్టు దృష్టికి తెచ్చారు. 2021–22 ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలులో అవకతవకలు జరిగాయంటూ 2023 ఫిబ్రవరి 26న సిసోడియను సిబిఐ అరెస్టు చేసింది. అనంతరం మార్చి 9న మనీలాండరింగ్ కింద ఇడి ఆయనను అరెస్టు చేసింది. 2023 ఫిబ్రవరి 28న ఢిల్లీ క్యాబినెట్‌కు సిసోడియా రాజీనామా చేసారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన కొట్టివేశారు.

## బోరుబావిలో ఐదేళ్ల బాలుడు





దౌసా : రాజస్థాన్ దౌసాలోని బోరుబావిలో పడిన ఐదేళ్ల బాలుడిని కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. 50 గంటలకు పైగా బోరుబావిలో ఉన్న చిన్నారిని సజీవంగా బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం బోరుబావికి కొద్ది దూరంలో పైలింగ్ మిషన్‌తో 150 అడుగుల వరకు గొయ్యిను తవ్వుతున్నారు. జిల్లాలోని కలిఖ్‌డ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆర్యన్ తన తల్లితో ఆడుకుంటుండగా ఘటన జరిగింది. అనుకోకుండా ఇంటి పక్కనే ఉన్న 175 అడుగుల లోతున్న బోరుబావిలో ఆర్యన్ ఒక్కసారిగా పడిపోయాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్‌ను అధికారులు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ దేవేంద్ర యాదవ్ అక్కడికి చేరుకుని మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. తొలుత ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు అల్యూమినియంతో తయారు చేసిన హుక్ ద్వారా ఆర్యన్‌ను బయటకు తీయడానికి చాలాసార్లు ప్రయత్నించాయి. కానీ విజయం సాధించలేకపోయాయి. ఆ తర్వాత పలు విధాలుగా ప్రయత్నించినా లాభం లేకుండా అయిపోయింది. ఇప్పుడు పైలింగ్ మిషన్‌తో బోరుబావికి 4 నుంచి 5 అడుగుల దూరంలో 4 అడుగుల వెడల్పుతో గొయ్యి తీస్తున్నారు అధికారులు. 150 అడుగుల తవ్వకం పూర్తయిన తర్వాత, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది అందులో దిగి సొరంగం తవ్వి బాలుడి వద్దకు చేరుకోనున్నారు. అలా ఆర్యన్‌ను కాపాడేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

# 16వ రోజుకు చేరిన దల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష

అరణ్యరోదనే అవుతోన్న అన్నదాతల ఆందోళన

13న కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మలు దగ్ధం చేయాలని విజ్ఞప్తి



న్యూఢిల్లీ : రైతులు తమ డిమాండ్లను పరిష్కరించాలని దేశరాజధాని ఢిల్లీ సమీపంలో సమరశీల పోరాటాలు చేస్తున్నప్పటికీ 'చెవిటోడి ముందు శంఖం ఊదిన' చందంగా వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. పట్టువదలని విక్రమార్కుల్లా రైతునేతలు మడమతిప్పని పోరాటం చేస్తున్నా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం వారి సమస్యను పరిష్కరించే విషయంలో సవతితల్లిప్రేమను ప్రదర్శిస్తోంది. రైతుల పంటకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) ప్రకటించాలని సహా కేంద్రం రైతుల డిమాండ్లను అంగీకరించాలని శంభుఖనౌరీ సరిహద్దు వద్ద పంజాబ్‌కు చెందిన మాజీ నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ చేస్తున్న నిరాహారదీక్ష బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. తమ వివిధ డిమాడ్లకు మద్దతుగా పంజాబ్ హర్యానా రాష్ట్రాల మధ్యనున్న శంభుఖనౌరీ పాయింట్ల వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న దలేవాల్ ఆరోగ్యం మెరుగుపడాలని బుధవారం రైతులు ప్రార్థనలు నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం)బ్యానర్ల కింద ఫిబ్రవరి 13నుంచి శంభుకనౌరీ సరిహద్దు వద్ద ఏర్పాటు చేసుకున్న శిబిరాలలో రైతులు ఆందోళన చేపట్టారు. అయితే ఢిల్లీకి వారు నిర్వహిస్తున్న మార్చిని భద్రతా బలగాలు నిలిపివేశాయి. కనౌరీ వద్ద ఒక రైతు నాయకుడు ఈ విషయమై మాట్లాడుతూ దలేవాల్ 11కిలోల కంటే ఎక్కువగానే బరువు తగ్గారని, అంతేకాకుండా ఆయన బ్లడ్‌లో షుగర్ స్థాయిలే మార్పులకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యుల బృందం అతని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది అని ఆయన చెప్పారు. దలేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ప్రాంతంలో తమ నిరసన తెలియజేస్తున్న రైతులు దల్లేవాల్‌ను నిరసన స్థలం నుంచి దలేవాల్‌ను తొలగించకుండా ఒక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. నవంబరు 26న ఆమరణ నిరాహారదీక్షను ప్రారంభించడానికి కొన్ని గంటల ముందు పంజాబ్ పోలీసులు దలేవాల్‌ను ఖనౌరీ నుండి బలవంతంగా తరలించారు. 70సంవత్సరాలు నిండిన దలేవాల్‌కు మద్దతుగా రైతులు గురువారం రాత్రిపూట భోజనాన్ని మానివేయాలని రైతు నాయకుడు అభిమన్యు కోహర్ ప్రజలకు పిలుపునిచ్చారు. డిసెంబరు 13న బిజెపి నేతృత్వంలోని కేంద్రం దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని అభిమన్యు కోహర్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు రైతుల నిరసనపై కేంద్ర మంత్రి రణ్‌వీత్‌సింగ్ బిట్టు మాట్లాడుతూ 'నిరసనకారులతో చర్చలు జరిపేందుకు సముఖత వ్యక్తం చేశారు. 'సంభాషణ ఒక్కటే మన ముందున్న మార్గం. చర్చలకు ముందుకు రావాలని రైతులకు ముకుళిత హస్తాలతో విజ్ఞప్తిచేస్తున్నాను. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పంజాబ్ రైతుల పట్ల ఎల్లప్పుడూ తగిన ప్రాధాన్యత ఇస్తారు. ఇప్పటికే కనీస మద్దతు ధర పెంపును అమలుచేశారు' అని ఆయన పాటియాలాలో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా చెప్పారు. అంతేకాకుండా బిట్లు దలైలామా ఆరోగ్యం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పంజాబ్ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)రాష్ట్ర విభాగం చీఫ్‌అమన్ అరోరా మాట్లాడుతూ రైతుల ఉద్యమ తీవ్రతను అర్థం చేసుకోవాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరసనకారులతో చర్చలు జరపాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. చర్చలపై కేంద్రం నుంచి ఎలాంటి సందేశం రాలేదని, డిసెంబరు 14న రైతులు ఢిల్లీకి పాదయాత్రను పున: ప్రారంభిస్తారని రైతు నాయకుడు సర్వన్‌సింగ్ శుక్రవారం నాడు తెలిపారు. ఎస్‌కెఎం, కెఎంఎం బ్యానర్ల కింద 101మందితో కూడిన రైతుల జాతా డిసెంబరు 6, డిసెంబరు 8న కాలినడకన దేశ రాజధాని ఢిల్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. అయితే హర్యానాలో భద్రతా సిబ్బంది రైతులను ముందుకు వెళ్లనీయలేదు. రైతులు ఇంతకు ముందు ఫిబ్రవరి 13, ఫిబ్రవరి 21న ఢిల్లీ వైపు కవాతు చేయడానికి ప్రయత్నించారు. అయితే రాజధాని సరిహద్దు పాయింట్ల వద్ద మోహరించిన భద్రతాబలగాలు వారిని అడ్డుకున్న విషయం తెలిసిందే.

Balaji Institute of Elementary Teacher Education
Approved by NCTE & Affiliated to SCERT, Hyd
Laknepally, NARSAMPET, Wgl-506331: 9866050044
ADMISSION NOTIFICATION - 2024-25
D.El.Ed. - "B" CATEGORY SEATS
Applications are invited from eligible candidates for admission into the D.El.Ed. Course under category - B Seats as follows:
Course: D.El.Ed. Intake: 50 'B'Category Seats: 10
Application form can be obtained from the College Office or download from the college website www.mcedn.org. Filled in applications along with relevant certificates shall be submitted in the college office on or before 16.12.2024 by 4pm. Regn. Fee is Rs 1000/- Eligibility and admissions will be as per the guidelines of Convenor DEECET 2024.
Chairman-Dr. A. Rajendra Prasad Reddy

ప్రజాపక్షం
గురువారం, డిసెంబరు 12

# చైర్మన్‌పై ప్రతిపక్షం అభిశంసన

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో లెజిస్లేచర్‌కున్న ప్రాధాన్యత అపారం. కార్యనిర్వాహక వర్గంలో భాగమైన ప్రభుత్వ నిరంకుశ, ప్రజావ్యతిరేక, ఒంటెత్తు పోకడలను వ్రేలెత్తిచూపటం, ప్రజాసమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి వాటి పరిష్కారంకోసం కృషిచేయటం ప్రతిపక్షం పాత్ర. ప్రభుత్వ–ప్రతిపక్ష సభ్యులకు సమానావకాశాలిస్తూ చట్టసభలను హుందాగా నిర్వహించటంలో, తమ వ్యక్తిగత అభిమానాలు, అభిప్రాయాలేవైనప్పటికీ తమ తటస్థతకు భంగం వాటిల్లకుండా సభలను నిర్వహించటం సభాధ్యక్షుల విధి. అయితే రాజకీయ పార్టీల్లో విలువలు తరుగుతున్నట్లే పాలకపార్టీ ఏకపక్షంగా ఎంపికచేసే సభాధ్యక్షుల్లో ఆ హుందాతనం కొరవడుతున్నది. ఒక విధంగాచూస్తే ప్రభుత్వం తమకున్న బండ మెజారిటీతో ప్రతిపక్షాన్ని అగౌరవపరుస్తూ, అవమానిస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరించే సందర్భాల్లో సభాధ్యక్షులు ప్రతిపక్షాలకు అండగా రావటం ధర్మం. కాని ఆ పాత్ర నిర్వహణలో వారు విఫలమైనప్పుడు, పాలకపక్షానికి అండదండ ఇస్తున్నప్పుడు ప్రతిపక్షాలు ఏమి చేయాలి, వాటికున్న ఏకైకమార్గం అధ్యక్షుని పట్ల తమ అసంతృప్తి, నిరసన, అసమ్మతి తెలియ జేయటం. ఈ ప్రయత్నాలేవీ తమ హక్కులను కాపాడేవిధంగా సభాధ్యక్షుణ్ణి ఒప్పించలేనపుడు తగిన సంఖ్యాబలం ఉన్న ప్రతిపక్షం లేదా ప్రతిపక్షాలకు మిగిలిన ఏకైక మార్గం అట్టి సభాధ్యక్షునిపై అవిశ్వాస వ్యక్తీకరణకు నోటీసు ఇవ్వటం. ఇప్పుడు రాజ్యసభ చైర్మన్ జగదీష్ ధంకర్‌పై ప్రతిపక్ష పార్టీలు కలసికట్టుగా చేసింది అదేపని. ఇది కనీవినీ ఎరుగనిది. 'రాష్ట్రాల సభ' అయిన 'రాజ్యసభ'కు మరోపేరు 'పెద్దలసభ'. పేరుకు తగ్గ హుందాతనం ఆ సభలో రానురానూ తగ్గుతున్నది. జగదీష్ ధంకర్ ముందుగా ఉపరాష్ట్రపతి–రాజ్యాంగ ఉన్నత అధికార దొంతరలో రెండవ స్థానం అది. రాజ్యసభ చైర్మన్ ఉపరాష్ట్రపతికి రాజ్యాంగం ఇచ్చిన అదనపు పదవి, బాధ్యత. రాజ్యసభ చైర్మన్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాసం లేదా అభిశంసన నోటీసు ఇవ్వటమంటే తీవ్ర పర్యవసానాలతో కూడిన వ్యవహారం. సభా నిర్వహణలో ఆయన పక్షపాతం చూపుతున్నారన్నది ప్రతిపక్షాల అభియోగం. ప్రతిపక్షంపై ప్రభుత్వపక్షం నిందలు, ఆరోపణలు, అపవాదులకు దిగినప్పుడల్లా, జవాబు చెప్పుకునేందుకు ప్రతిపక్ష నాయకునికి సైతం అవకాశమివ్వకుండా ప్రభుత్వం కొమ్ముకాస్తుంటాడు; ఒక్కొక్కసారి ఆయనే పరుష వ్యాఖ్యలు చేస్తుంటారు లేదా ప్రభుత్వపక్షాన్ని రెచ్చగొడుతుంటారనేది ప్రతిపక్షాల ఆరోపణ. 60 మంది ప్రతిపక్ష సభ్యుల సంతకాలతో కాంగ్రెస్ నాయకులు జైరాం రమేశ్, నశీర్ హుస్సేన్ మంగళవారం రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి.మోదీకి అందజేసిన అభిశంసన తీర్మాన నోటీసులో చైర్మన్ పక్షపాతవైఖరిని ఎత్తిచూసే అనేక సందర్భాలు ఉదహరించటం జరిగింది. చైర్మన్ అన్యాయంగా ప్రతిపక్షాల సభ్యులను విమర్శిస్తూ బయటచేసిన ప్రసంగాలు, రాసిన వ్యాసాలను ఆ నోటీసుకు గుదిగుచ్చారు. ఆర్‌జెడి, టిఎంసి, సిపిఐ, సిపిఐ(ఎం), జెఎంఎం, ఆప్, డిఎంకె, సమాజ్‌వాది పార్టీ సభ్యులు సంతకాలు చేశారు. ఇండియా కూటమిలో అంతర్గత తగాయిదాలని, అది విచ్ఛిన్నం కాబోతోందని బిజెపి అనుకూలురు విషప్రచారం చేస్తున్న సందర్భంలో కూటమి భాగస్వాములు ఈ నోటీసుతో ఐక్యతను ప్రదర్శించారు. ఈ నోటీసు ఇస్తున్నందుకు బాధపడుతున్నామని, అయితే చైర్మన్ అన్ని పరిమితులు దాటినందున తప్పలేదని జైరాం రమేశ్ అన్నారు.

హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తదుపరి నోరు పెద్దది చేసుకున్న బిజెపి సభ్యులు పలువురు కాంగ్రెస్ అగ్రనాయకులపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నా నియంత్రించకుండా అనుమతిస్తున్న ధంకర్ వైఖరిని వారు నిరసించారు. ఈ నోటీసు పర్యవసానం తెలిసిందే. సభలో చర్చకు రాదు, వచ్చినా వీగిపోతుంది. 10రోజుల్లో రాజ్యసభ వాయిదా పడుతున్నందున అది మురిగిపోతుంది. అయినా ప్రతిపక్షం నోటీసు ఇచ్చిందంటే చైర్మన్ పక్షపాత వైఖరిని సమష్టిగా దేశ ప్రజలు ముందు ఉంచింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా మమత ప్రభుత్వానికి ప్రతిపక్షంగా వ్యవహరించిన ధంకర్, ఉన్నత పదవిలోకి వచ్చాక కూడా, తానే చెప్పినట్లు, ఆర్‌ఎస్‌ఎస్‌పట్ల తన విధేయతకు అతీతంగా 'తటస్థం'గా రాజ్యసభను నిర్వహించలేక పోవటమే ప్రస్తుత పరిస్థితికి కారణం. ప్రతిపక్ష అభిశంసన నోటీసు దేశంలోనేగాక, విదేశాల్లో సైతం ఉపరాష్ట్రపతి ప్రతిష్టను దెబ్బతీస్తుంది.

# బక్కచిక్కుతున్న రూపాయి : మౌనం వీడని మోదీ



ఎం. కోటేశ్వరరావు

మన జనానికి నిజంగానే మతిమరపు ఎక్కువా లేదా పట్టించుకోవట్లేదా? కోరి చేసుకున్నోడు గనుక ఎగిరెగిరి తన్నినా కిమ్మనటం లేదనే సామెతను నిజం చేస్తున్నారా? మనది కర్మభూమి అనుకుంటున్నాం గనుక తప్పదు! పదేండ్ల క్రితం డాలరుతో మారకంలో రూపాయి విలువ పతనం గురించి నరేంద్రమోదీ మొదలు బిజెపి నేతలందరూ ఎన్ని మాట్లాడారు! ఇప్పుడు అంతకంటే ఎక్కువగా పతనమైనా పల్లెత్తు మాటల్లేవేమి? రూపాయి పతనం, జిడిపి వృద్ధిరేటు పతనం, ఎగుమతుల్లో ఎదుగుదల పతనం ఇలా పదేండ్ల పాలనలో అవే ఎక్కువ. మరక మంచిదే అని ఒక వాణిజ్య ప్రకటనలో చెప్పినట్లుగా రూపాయి విలువ తగ్గటం మనకు మంచిదే అని కొంతమంది సమర్థిస్తారు. కొన్ని అంశాలలో వాస్తవమే, ఎగుమతిదార్లకు, విదేశాల నుంచి డబ్బు పంపేవారికి లబ్ధి, దిగుమతి దార్లకు, తద్వారా జనాలందరికీ భారం. కానీ వ్రతం చెడ్డా ఫలం దక్కలేదు అన్న లోకోక్తి తెలిసిందే. మన దేశంలో అదే జరుగుతోంది. మన కరెన్సీ పతనం కొంతమందికి కాసుల వర్షం కురిపిస్తుండగా అత్యధికుల జేబులు గుల్లవుతున్నాయి. ఏటా వేల కోట్ల డాలర్లను విదేశాలకు సమర్పించుకుంటున్నాము. ఉదాహరణకు 2022–23లో రు.21,45,690, 2023–24లో రు.19,54,060 కోట్లు విదేశాలకు సమర్పించుకున్నాము. దీనిలో ఎక్కువ చైనాకే రు.6,73,00; 6,97,000కోట్లు చొప్పున వెళ్లింది. దీన్ని మరోవిధంగా చెప్పాలంటే ఈ భారం మొత్తాన్ని మన జనంమీద మోపారు. కార్పొరేట్లు లేదా ప్రభుత్వ కంపెనీలు లాభాలతో సహా దిగుమతి చేసుకున్న వస్తువుల ధరలను వినియోగదారులనుంచే కదా వసూలు చేసేది.

కొందరు వర్ణిస్తున్నట్లుగా ముచ్చటగానో లేదా మరికొందరంటున్నట్లుగా దేశానికి మూడిగానీ మోదీ పాలన పదకొండో ఏడులో ఉంది. 2014లో ఒక వస్తువు ధర రు.106 ఉంటే ద్రవ్యోల్బణం పెరిగిన కారణంగా అదే ఇప్పుడు రు.156 పెట్టి కొనాల్సి వస్తోంది. ద్రవ్యోల్బణం సగటున 5.12 శాతం పెరిగిన ఫలితమే. ఈ నిర్వాకం సంగతేమిటి? ఈ మేరకు జనానికి రాబడి పెరుగుతోందా? 2024 అక్టోబరులో పద్నాలుగు నెలల గరిష్టం 6.21శాతంగా నమోదైంది. ఆహార ద్రవ్యోల్బణం అంతకు మించి 15నెలల గరిష్టం 10.87శాతానికి చేరింది. ఏడాది క్రితం అక్టోబరు నెలలో 6.61శాతమే ఉంది. వినియోగదారులు కొనేటట్లు లేదు కడుపు నిండాతినేట్లు లేదు. అన్నదాతల పరిస్థితి ఏమిటి? ప్రస్తుతం రబీ సీజన్ నడుస్తున్నది, దేశమంతటా ఈ పంటలకు ముఖ్యమైన డిఏపి ఎరువుల కొరత, దాన్ని ఆసరా చేసుకొని అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. యూరియాయేతర ఎరువుల కోసం రబీ తరుణంలో ఎరువుల సబ్సిడీ నిమిత్తం రు.24,474 కోట్ల సబ్సిడీ ఇవ్వనున్నట్లు, అది గత ఏడాదికంటే పదిశాతం ఎక్కువ అని గొప్పగా కేంద్ర పెద్దలు చెప్పారు. డిఏపి మే నెలలో టన్ను దిగుమతి ధర 510డాలర్లు ఉండగా నవంబరు మొదటి వారంలో 645కు పెరిగింది. అది రు.54,000కు సమానం. ఈ స్థితిలో కేంద్రం గరిష్ట ధరగా రు.27వేలు నిర్ణయించి సబ్సిడీగా రు.21.911గా ప్రకటించింది. కొరత ఏర్పడిన స్థితిలో మరో మూడున్నరవేలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. అయినప్పటికీ ఏ వ్యాపారి 54వేలు చెల్లించి దిగుమతి చేసుకుంటాడు? ఒకవేళ దిగుమతి చేస్తే అంత ధరలో రైతులు కొనుగోలు చేయగలరా ?

గతేడాది అక్టోబరు ఒకటి నాటికి 30లక్షల టన్నుల మేర నిల్వలుండగా ఈ ఏడాది 16లక్షలకు తగ్గింది. పోనీ దేశీయంగా ఉత్పత్తి పెరిగిందా అంటే ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో ఏడు శాతం తగ్గింది. దిగుమతులను చూస్తే గతేడాది ఏప్రిల్–సెప్టెంబరు మధ్య 34.5లక్షల టన్నులు దిగుమతి చేసుకుంటే ఈ ఏడాది అది 19.6లక్షలకు పడిపోయింది. ఏడాదికి 100 నుంచి 110లక్షల టన్నులు అవసరం కాగా దీనిలో 60శాతం దిగుమతి చేసుకుంటున్నాము. ఈ ఏడాది ఇప్పటివరకు దిగుమతులు సగం తగ్గటానికి కేంద్రం ఎరువుల మీద సబ్సిడీలో భారీ కోత విధించటమే అసలు కారణం. 2022–23లో రు.2.51లక్షల కోట్లు కేటాయించిన మోదీ సర్కార్, 2023–24లో రు.1.88, 2024–25లో ఆ మొత్తాన్ని రు.1.64లక్షల కోట్లకు కోత పెట్టింది. యుపిఎ సర్కార్ 2010లో అమల్లోకి తెచ్చిన విధానం ప్రకారం నిర్ణీత మొత్తాన్ని మాత్రమే సబ్సిడీగా ఇస్తారు, దాన్ని విమర్శించిన నరేంద్ర మోదీ తనదాకా వచ్చేసరికి దాన్నే అమలు జరిపారు. అయితే మధ్యలో అంతర్జాతీయంగా ధరలు విపరీతంగా పెరగటం, రైతాంగం ఏడాదిపాటు ఢిల్లీ శివార్లలో ఉద్యమించిన నేపథ్యంలో సబ్సిడీ మొత్తాన్ని పెంచారు. తిరిగి పైన పేర్కొన్న విధంగా కోత మొదలు పెట్టారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండాలంటే సబ్సిడీలకు కోతపెట్టి ప్రభుత్వ ఖర్చు తగ్గించటానికి పూనుకున్నారు. ఎరువుల సబ్సిడీ తగ్గటానికి దిగుమతి చేసుకొనే ఎరువులు, గ్యాస్ ధర తగ్గటమే అని కొందరు చెబుతున్నారు. అదే ప్రాతిపదిక అయితే అవసరాలకు అనుగుణంగా డిఏపి దిగుమతి చేసుకొని పంటలు పండేందుకు తోడ్పడాల్సిందిపోయి, ధరలు పెరిగాయనే పేరుతో దిగుమతులు ఎందుకు తగ్గించినట్లు?

రూపాయి పతనం అన్నది ఆర్థిక స్థిరత్వం మీద పెద్దప్రభావం చూపుతుంది. అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. యుపిఏ పాలన మీద ధ్వజమెత్తటానికి బిజెపి ప్రచార కమిటీ నేతగా 2014 ఎన్నికలకు ముందు దీన్ని ఒక ఆయుధంగా వాడుకున్నారు. రూపాయి విలువ పతనమౌతుంటే గతంలో ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ ఏమన్నారో తెలుసా! ''ఆర్థికం లేదా రూపాయి విలువ పతనం గురించి ప్రభుత్వానికి ఎలాంటి చింతలేదు, తన కుర్చీని ఎలా కాపాడుకోవాలన్నదే దాని ఏకైక ఆందోళన. ఈ కారణంగా దేశం ఈ రోజు ఆశాభంగం చెందింది. గత మూడు నెలలుగా పతనం అవుతున్న రూపాయిని నిలబెట్టేందుకు ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు. ఇలా పతనం అవుతుంటే ఇతర దేశాలు దాన్ని అవకాశంగా తీసుకుంటాయి. గడచిన ఐదు సంవత్సరాలుగా ధరలు తగ్గుతాయని, ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుందని ప్రతి మూడు నెలలకు ఒకసారి చెబుతున్నారు తప్ప జరిగిందేమీ లేదు'' (2013 ఆగస్టు 20, బిజినెస్ స్టాండర్డ్ పత్రికలో పిటిఐ వార్త). మోదీ ఈ ఆరోపణలు చేసిన రోజు డాలరుకు రూపాయి విలువ 64.11గా ఉంది. పదేండ్ల తరువాత ఇప్పుడు 84.73కు దిగజారింది. అడిగేవారు లేక గానీ పైన చెప్పిన అంశాలన్నీ మోదీకి వర్తించవా? ఈ దిగువ ఆయా సంవత్సరాలలో రూపాయి సగటు విలువ ఎలా ఉందో చూడవచ్చు. 2024 విలువను రాసిన సమయానికి ఉన్నదిగా పరిగణించాలి.

| సంవత్సరం – డాలరుకు రూ.విలువ | |
|---|---|
| | 2018 – 70.09 |
| | 2019 – 70.39 |
| | 2020 – 76.38 |
| 2014 – 62.33 | 2021 – 74.57 |
| 2015 – 62.97 | 2022 – 81.35 |
| 2016 – 66.46 | 2023 – 81.94 |
| 2017 – 67.79 | 2024 – 83.47 |

ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పుకుంటున్నారు. యుపిఏ చివరి సంవత్సరాలలో ముడిచమురు ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా దేశంలో ద్రవ్యోల్బణం, ధరలు కూడా పెరిగాయి. మోదీ పదవిలోకి వచ్చే సమయానికి ముడి చమురు ధర బాగాపడిపోయి దిగుమతి బిల్లు గణనీయంగా తగ్గింది, ఆ సమయంలో వినియోగదారులకు ఆ మేరకు లబ్ది చేకూరకుండా వివిధ సెస్సులను భారీగా విధించి, పెద్ద మొత్తంలో కేంద్రం రాబడిని పొందింది. రూపాయి విలువ తగ్గితే మన ఎగుమతులు పెరుగుతాయన్నది కూడా వాస్తవం కాదు. 2013లో మన ఎగుమతులు 472 బిలియన్ డాలర్లు కాగా 2023లో అవి 777బి.డాలర్లకు పెరిగాయి. దీన్నే జిడిపిలో చూస్తే ఎందుకంటే దాన్ని పెంచిన ఘనత తమదే అని బిజెపి చెప్పుకొంటోంది గనుక 25.43 నుంచి మధ్యలో 18.66శాతానికి పడిపోయినా 2023లో 21.89శాతంగా ఉంది. అంటే మొత్తంగా చూసినపుడు పతనం తప్ప పెరుగుదల లేదు. దిగుమతులు వినియోగదారులకు భారం కాకూడదు. వజ్రాలు, బంగారం వంటి వాటిని దిగుమతి చేసుకుంటే వాటిమీద పన్ను విధించవచ్చు, ఇబ్బంది లేదు, కానీ ముడిచమురు దిగుమతుల మీదకూడా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు లాభాలను పిండుకుంటున్నాయి. నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన తొలి ఏడాదికి ఇప్పటికీ తేడాను చూద్దాం. యుపిఏ పాలన చివరి ఏడాది నుంచి ఇప్పటి వరకు మన దేశం కొనుగోలు చేసిన ముడి చమురు పీపా సగటు ధర లు ఇలా ఉన్నాయి.

| ఏడాది – డాలర్లు | |
|---|---|
| 2013–14×105.52 | 2018–19 × 69.88 |
| 2014–15 × 84.16 | 2019–20 × 60.47 |
| 2015–16 × 46.17 | 2020–21 × 44.82 |
| 2016–17 × 47.56 | 2021–22 × 79.18 |
| 2017–18 × 56.43 | 2022–23 × 93.15 |
| | 2023–24 × 82.58 |

వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 81.95 డాలర్లు ఉంది. దీనికి అనుగుణంగా ధరలు తగ్గించకుండా గడచిన రెండున్నర సంవత్సరాలుగా వినియోగదారుల జేబులు కొల్లగొడుతున్నది కేంద్ర ప్రభుత్వం. ఆ ధరలను బట్టే రాష్ట్రాలు వ్యాట్ వసూలు చేస్తున్నాయి. కేంద్రం ధర తగ్గిస్తే ఆ మేరకు రాష్ట్రాలూ తగ్గిస్తాయి. నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన తరువాత డీజిలు, పెట్రోలు మీద సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేశారు, గ్యాస్ మీద ముష్టి మాదిరి విదుల్చుతున్నారు.

2014–15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం ప్లానింగ్ ఎనాలసిస్ సెల్ సమాచారం ప్రకారం ఎక్సైజ్ డ్యూటీ రు.99,068 కోట్లు, దాన్ని 2020–21 నాటికి రు.3,72,930 కోట్లకు పెంచారు. తరువాత ఎన్నికలు, తదితర కారణాలతో 2023–24 నాటికి రు.2,73,684 కోట్లకు తగ్గించారు. 2024 ఆగస్టు ఒకటవ తేదీన ప్రభుత్వం పార్లమెంటుకు ఇచ్చిన సమాచారం ప్రకారం 2019–20లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చమురు రంగంలో వచ్చిన పన్ను, తదితరాల రాబడి మొత్తం రు.5,55,370 కోట్లు కాగా దీనిలో కేంద్ర వాటా రు.3,34,315 కోట్లు, ఈ మొత్తాలు 2023–24 తాత్కాలిక అంచనాలో పెరిగిన మొత్తం రు.7,51,156 కోట్లు. కాగా కేంద్ర వాటా రు.4,32,394 కోట్లు ఉంది. ఇంత మొత్తం సంపాదిస్తున్న కేంద్రం ఉజ్వల గాస్ పథకం పేరుతో ఒక్కొక్క వినియోగదారుకు ఏడాదికి ఇస్తున్న సబ్సిడీ రు.1,114 కాగా ఇతర వినియోగదారులకు ఇస్తున్న మొత్తం రు.670 మాత్రమే. దేశంలో ముడిచమురు ఉత్పత్తి పెంచుతామంటూ కబుర్లు చెప్పే నరేంద్రమోదీ ఏలుబడి నిర్వాకం ఎలా ఉందో తెలుసా? 2014–15లో ప్రభుత్వ ప్రైవేటు ఉత్పత్తి 35.9 మిలియన్ టన్నులుంటే 2023–24నాటికి 27.2మి.టన్నులకు పడిపోయింది. ఇలాంటి పాలనతో 2047నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతామని కబుర్లు చెబుతున్నారు. అదుపులేని రూపాయి పతనం,ద్రవ్యోల్బణం కారణంగా ధరలు పెరుగుతూ నడ్డి విరుస్తున్నాయి. పదేండ్ల క్రితం మోదీ చెప్పిన అచ్చే దిన్ ( మంచి రోజులు ) బిజెపి మద్దతుదార్లకైనా వచ్చాయా ?

# రైతుకు 'మద్దతు' లభించేదెప్పుడు?

పదేండ్ల క్రితంవరకు ఎడ్లబండ్లతో దుక్కి దున్ని చదును చేసి పంటలు పండించేవారు. ఇప్పుడు పూర్తిగా యాంత్రీకరణతో పరిస్థితులు మారిపోయాయి. ఎరువుల ధరలు, పురుగు మందుల ధరలు పెరిగాయి. యాంత్రీకరణ పుణ్యమా అని వాటి ధరలు కూడా పెరగడంతో వ్యవసాయానికి పెట్టుబడిభారంగా మారింది. ఇది చాలదన్నట్లు మొన్నటి వరకు కూలీలు పొలాల్లో పనిచేస్తూ కనిపించేవారు. ఇప్పుడు పొలా ల్లో కూలిపనికి వచ్చేవారు తగ్గిపోయారు. దీనికి కారణం వ్యవసాయంలో గిట్టుబాటు కాకపోవడమే. అయినా రైతులు మొక్కవోని ధైర్యంతో దేశానికి అన్నం పెట్టడానికి పొలాన్ని నమ్ముకుంటున్నాడు. ఈ సమయంలో విత్తనం నాటిన దగ్గరనుండి చేతికొచ్చేవరకు చేసే కష్టానికి రైతే బాధ్యుడవుతున్నాడు. కానీ ఆయన పండించే పంటకు మాత్రం ధర నిర్ణయించుకునే దిక్కులేని పరిస్థితి. దీంతో రైతు బతుకు ఏటా అప్పుల సుడి గుండంలో చిక్కుకుపోతోంది. ప్రభుత్వాలు ఏటా మద్దతు ధర ప్రకటిస్తున్నా అది రైతులకు పూర్తిస్థాయిలో దక్కని పరిస్థితి. ఆసియాలోనే తెలంగాణలోని వరంగల్, ఆదిలాబాద్ పత్తి పంటకు భారీ ఆదరణ ఉంది.

**ప్రభుత్వం పత్తిరైతును వదిలేయడమే కారణమా?**

మనదేశం ప్రపంచంలోనే పత్తి సాగులో మూడో స్థానంలో ఉంది. ఇక తెలంగాణ రాష్ట్రం కూడా దేశంలో పత్తి సాగులో మూడో స్థానంలో ఉంది. మహారాష్ట్ర, గుజరాత్ తర్వాత తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. ఆసియాలోనే డిమాండ్ ఉన్న తెలంగాణ పత్తి గురించి అందరూ చెప్పుకుంటున్నా దాన్ని సాగు చేస్తున్న రైతుకు మాత్రం సాయం దక్కడం లేదు. ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవాల్సిన విషయమేంటంటే 100లో 60శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. దీంతో పత్తిపంట సాగు చేసేందుకు వీరికి కౌలు రూపంలో అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. మరోవైపు యాంత్రీకరణ వల్ల పనిముట్ల ధరలు, కూలీల రేట్లు అమాంతం పెరిగి రైతుకు పెట్టుబడి అమాంతం పెరుగుతోంది. దీనికితోడు బ్యాంకుల నుండి వచ్చే అప్పు సరిపోక వడ్డీకి తెచ్చి పంట సాగు చేస్తే చివరకు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నేలపాలవుతోంది. పత్తి ఏరిపించేందుకు కూలీలను పిలిస్తే వారు కిలో పది నుండి పదిహేను రూపాయలుగా ధర నిర్ణయిం చేస్తున్నారు. పంట పొలంలో వదిలేయలేక ఇంటికి తెచ్చి అమ్ముకుందామంటే మార్కెట్లో తేమ, గూడు, రంగు మారిందని సిసిఐ కొనుగోలుకు ఆదిలోనే నిరాకరించడం రైతుల కష్టాన్ని పరోక్షంగా దళారుల పాల్జేయడానికేనన్నట్లు తయారైంది. తేమ 8 నుండి 12 శాతం లోపు ఉంటేనే కొంటామామని చెప్పడం, అది కూడా మద్దతు ధర రూ.7,525గా నిర్ణయించడంతో రైతులు



వర్షానికి తడిసిన పత్తిని సిసిఐకి అమ్మలేక, ఇంటికి తీసుకెళ్లలేక చివరకు వ్యాపారులు నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఈ ఏడాది పత్తి రైతులకు మార్కెట్లో వ్యాపారులు ఇచ్చిన ధరెంతో తెలుసా.. అక్షరాలా.. రూ.6700 నుండి రూ.6900 మాత్ర మే. ఇక చివరలో సిసిఐ కొనుగోలు చేసినా, తేమ తక్కువైనా మద్దతుధరకు మించి ధర లభించని పరిస్థితి.

**ఎకరానికి అయిన ఖర్చుకూ..దక్కిన ధరకు లేని పొంతన**

ఈ ఏడాది రాష్ట్రంలోని నల్గొండ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్, ఖమ్మంతోపాటు ఇతర జిల్లాల్లో అధికంగా పత్తిపంట సాగు చేశారు. మిగతా జిల్లాల్లో కాస్త తక్కువగానే పత్తిపంట సాగైందని వ్యవసాయ శాఖ చెబుతున్న సమాచారం. మరి రాష్ట్రంలో సాగువుతున్న పత్తి పంటకు ఎకరానికి అవుతున్న ఖర్చెంత.. లభిస్తున్న ధర...ఎంత.. రైతుకు దక్కుతున్నదో తెలిస్తే.. అసలు వ్యవసాయం చేసే రైతుల పరిస్థితి ఇంత దయనీయం గా ఉంటుందా అని ఎవరైనా సందేహపడక్కర్లేదు. దీనికి కారణం ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు ఒకటైతే.. వ్యాపారులు రైతులను వడ్డీ రూపంలో నడ్డి విరిచేయడం మరో కారణం. ఈ ఏడాది పత్తిపంట ఆరంభంలోనే పత్తి విత్తనాల ధర పాకెట్స్ పై 50 రూపాయలు పెంచి అమ్మేయడంతో ఒక పాకె ట్ ధర 760రూపాయలు పలికింది. ఇక రాశి 659 వంటి పత్తి విత్తనాలను వ్యాపారులు మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడంతో 900రూపాయల పాకెట్ కూడా రైతులు కొనాల్సి వచ్చింది. మొత్తం ఎకరానికి లెక్కిస్తే... 65వేల నుండి 75వేల వరకు ఖర్చవుతుంది. వీటికి దళారుల వద్ద అప్పుతెస్తే నూటికి 25శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే 20వేల వరకు వడ్డీ చెల్లించాల్సిందే. అంటే ఎకరానికి 95వేల వరకు ఖర్చవుతుంది. మరి ఎకరానికి వచ్చే దిగుబడి ఎంత.. 8 నుండి సుమారు 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. శెలక అయితే 8 క్వింటాళ్లు, నల్లరేగడి అయితే 10 నుండి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. అంటే క్వింటాలు పత్తిని మార్కెట్లో సిసిఐ ద్వారా విక్రయిస్తే... 7,525 రూపాయలను కుంటే సుమారు 12క్వింటాల పత్తి అమ్మితే 90,300 రూపాయలు వస్తాయి. మరి అందులో రైతు 95వేలు ఖర్చు చేస్తే దక్కేదెంత. మిగతాది జేబులో నుండే అప్పు చెల్లించాలి. ఇక దిగుబడి తగ్గితే ఇంకా అప్పుల్లోనే కూరుకుపోవాలి. ఇది కేవలం సిసిఐకి విక్రయిస్తేనే.. అదే ప్రయివేటు వ్యాపారులకు తేమ అధికంగా ఉందని సిసిఐ నిరాకరించిందని అమ్మితే ప్రయివేటు వ్యాపారులు ధర 6,950గా నిర్ణయించినా తేమ పేరుతో 6,700 ధర మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ లెక్కన రూ.80,400లు మాత్రమే రైతుకు దక్కుతోంది.

**ధర నిర్ణయించుకునే అధికారమే కావాలి..**

ప్రభుత్వం కనీస మద్దతు ధర అంటూ ఆర్భాటం చేస్తున్నా.. అది కూడా రైతుకు దక్కడం లేదు. ఈ సమయంలో కార్పొరేట్ వ్యాపారులు ఎలా అయితే తమ ఉత్పత్తులకు తామే ధర నిర్ణయించి అమ్ముకోగలుగుతున్నారో అలాగే ప్రభుత్వం రైతుల పంటకు కూడా ధర నిర్ణయించి విక్రయించుకునే వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. బ్యాంకులు ఇచ్చే రుణాల పరిమితి పెంచగలగాలి. రైతుకు సాయం కాదు.. పెట్టుబడి ఖర్చులు పోగా తన కుటుంబాన్ని పోషించుకునేందుకు కాస్త మిగిలేలా చూడాలి. అప్పుడే ప త్తి రైతు నిలదొక్కుకోగలడు.

వామన్ మామిళ్ల, 9908556358

# ఆరోగ్య అభద్రతలో ప్రపంచ జనాభా

పౌర సమాజ శ్రేయస్సు, స్థిర జీవనం, ఉత్పాదకత, సంపాదన లాంటి అంశాలపై వ్యక్తిగత ఆరోగ్యాలు ఆధారపడి ఉన్నాయి. ఐరాస గుర్తించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–2030 సాధనకు ఆరోగ్యకర ప్రపంచ జనాభా అత్యవసరం. గత రెండు దశాబ్దాలుగా కుటుంబాల వైద్య ఆరోగ్య ఖర్చులు విపరీతంగా పెరగడం గమనించారు. ప్రపంచ జనాభాలో 2 బిలియన్లమంది ప్రజలు వైద్య ఖర్చులతో నలిగి పోతున్నారని, అనారోగ్య కారణాలతో 1.3 బిలియన్ల ప్రజలు ఆర్థికంగా చితికిపోయి నిరుపేదలుగా మారారని గణాంకాలు వివరిస్తున్నాయి. ముఖ్యంగా తల్లులు, పిల్లల ఆరోగ్య సమస్యలు కుటుంబాల ఆర్థిక స్థితిని దిగజార్చడం, రోగ నిర్ధారణతో పాటు వైద్య ఖర్చులు భరించలేక కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోవడం కనిపిస్తున్నది.

**ప్రజారోగ్యం ప్రభుత్వ కనీస బాధ్యత:** వైద్య ఆరోగ్య అభద్రత కారణంగా ప్రపంచ మానవాళి ఆర్థిక స్థితులు తీవ్రంగా ప్రభావితం కావడాన్ని గమనించిన ఐరాసతో కూడిన అంతర్జాతీయ సమాజం ఈ విషయం పట్ల అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 12 డిసెంబర్‌న సార్వత్రిక ఆరోగ్య భద్రత దినం (యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే) పాటించుట 2006 నుంచి ఆనవాయితీగా మారింది. సార్వత్రిక ఆరోగ్య భద్రత దినం–2024 థీమ్‌గా ఆరోగ్యం ప్రభుత్వ కనీస బాధ్యత అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది. సార్వత్రిక ఆరోగ్య భద్రతలో భాగంగా నాణ్యమైన అత్యవసర వైద్య సదుపాయాల కల్పన, దీర్ఘకాలిక ఆరోగ్య భద్రత కల్పన, ఔషధాల అందుబాటు, సకాలంలో టీకాలను వేయించడం ప్రపంచ జనాభా ముంగిట ఉచితంగా అందించాలి. పేదరికం, పోషకాహార లోపాలతో ఆరోగ్య సమస్యలు నేరుగా సంబంధాలను కలిగి ఉంటాయని, ఈ ప్రాథమిక సమస్యలకు సమాధానాలు వెతకడం మన కనీస ధర్మమని ప్రభుత్వాలు తెలుసుకోవాలి.

**సార్వత్రిక ఆరోగ్య భద్రత సవాళ్ళు, అధిగమించే మార్గాలు:** సార్వత్రిక ఆరోగ్య అభద్రతకు కారణాలుగా అరకొర వైద్య సిబ్బంది, వైద్య వసతుల లేమి, వైద్య ఆరోగ్య శాఖల్లో నిధుల కొరత, విపరీతంగా పెరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రభుత్వ పనితీరు నిరాశాజనకంగా ఉండడం లాంటివి పేర్కొనబడ్డాయి. 2015లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే వివరాల ప్రకారం 38శాతం ప్రపంచ జనాభాకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలతో పాటు సురక్షిత నీటి వనరులు అందుబాటులో లేవని, 35 శాతం జనాభా తమ చేతులను శుభ్రం గా కడుక్కోవడానికి అవసరమైన సబ్బు లాంటి పదార్థాలు లేవని తెలుస్తున్నది. ఇలాంటి దుస్థితిలో అంటువ్యాధులు కమ్ముకోవడం, అనారోగ్యాలు ముసురుకోవడం జరుగుతుంది. నేటి అభాగ్య పేదరిక ప్రపంచ జనాభాకు ఆరోగ్య భద్రత కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత.

వ్యక్తిగత, కుటుంబ వైద్య ఆరోగ్య ఖర్చులను తగ్గించినా సమాజంలో పేదరిక నిర్మూలన వేగం పుంజుకుంటుంది. ప్రపంచవ్యాప్తంగా నలుమూలల వైద్య సదుపాయాలు, అవసరమైన వైద్య సిబ్బంది నియామకాలు, ఔషధాల అందుబాటు, చవకైన ఆరోగ్య భీమా అవకాశాలు లాంటి సకారాత్మక చర్యలు తీసుకున్న సమాజంలో ప్రజారోగ్య భద్రత వర్థిల్లుతుందని గమనించాలి. ఆరోగ్యకర కుటుంబాల నెలవుగా ప్రపంచం మారాలి. ఆసుపత్రులు అందుబాటులో ఉండాలి. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉండడానికి ప్రతి ఒక్కరు కనీస పరిశుభ్రతను పాటించాలి.

(12 డిసెంబర్ సార్వత్రిక ఆరోగ్య భద్రత దినం సందర్భంగా)

లేఖ

# మితిమీరుతున్న సినిమా పిచ్చి

రోజురోజుకి యువత సినిమా మరియు వాటి మోజులోనే ఎక్కువగా అలవాటు అవుతున్నారు, ప్రాంతం అనే తేడా లేకుండా విచ్చలవిడిగా సినిమా పిచ్చోడిలా తయారు అవ్వడం మనం చూడొచ్చు, సొంత పైసలు సైతం పెట్టీ బ్యానర్లు పెట్ట డం, సంఘాలు పెట్టుకోవడం సర్వ సాధారణం అయిపోయింది, ఏదో కొంపలు మునిగిపోయినట్టు మొదటి రోజే సినిమా చూడాలని ఆరాటం ప్రజల్లో మనం చూడొచ్చు. నేడు ఉన్న సమాజం కానీ, యువత కానీ ఆలోచన చేయాల్సిన పెద్ద విషయం సినిమా ఒక వ్యాపారం అది కేవలం డబ్బులుకోసం మాత్రమే చేయడం జరుగుతుంది, వినోదం కోసం ముందుగా కొంత ట్రైలర్ విడుదలచేసి ప్రజల్లో బాగా ఎక్కించేసి కొద్దిరోజులు పాటలు విడుదలచేసి ఆకట్టుకుంటారు, నేడు ఉన్న సినిమాలు అన్నీ కమర్షియల్ విధానంలోనే ఉన్నాయి మొదటి రోజే షో చూడాలని ఎంతో డబ్బులు పెట్టీ మరో వెళ్తున్న నేటి సమాజం ఆలోచన చేయరా?

మనం చూడవచ్చు సినిమా వాళ్ళకి సమాజ సేవ చాలా తక్కువ ఉంటుంది, కొన్ని వందల కోట్ల అస్తిపరులు ఉంటారు, మనం గమనిస్తే కరోనా వచ్చినప్పుడు ఎంతమంది సహాయం చేశారు. నార్త్ నటుడు సోను సూద్ అనే నటుడు కొన్ని వందల మందికి హెల్ప్ చేసిన రియల్ హీరో అనిపించుకున్నాడు, ఎంతోమందికి అనాథలకు ఆశ్రయం ఇచ్చాడు, పేద రైతులకు ట్రాక్టర్లు ఇప్పించాడు, అది సేవ అంటే అనిపించుకున్న వ్యక్తి సోనుసూద్ అది జీర్ణించుకోలేక ఎక్కడ రాజకీయంగా ఎదుగుతాడో అని కొంతమంది సోను సూద్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం జరిగింది, మరి మన తెలుగు హీరోలు..అరకొరగా ఏదో పేపర్ కోసం ప్రకటన ఇచ్చుకోవడం జరిగింది? కాబట్టి ప్రతి ఒక్కరూ నేడు ఉన్న సమాజం యువత ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సినిమా కోసం అధిక పిచ్చి లేకుండా కుటుంబం కోసం పాటు పడే విధంగా ఉండాలి, యువతకు నిజమైన హీరోలు మీ అమ్మ నాన్ననే అని గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది, రెండు గంటలు ఏదో నటన చేస్తే హీరో అయిపోడు, కాబట్టి యువత ఇలాంటి మార్గంలో వెళ్లొద్దని కోరుకుందాం!

కిరణ్ ఫిషర్

# అశ్లీలత, అవినీతిపై ఉదాసీన వైఖరి

లడ్డు కల్తీ పై స్పందించిన సనాతన వాదులు మహిళలపై చిన్నారులపై జరుగుతున్న లైంగిక హింసలపై స్పందన కరువయ్యింది. ఒక వైపు విద్యార్థులలో మానవ విలువలు సంస్కృతి వారసత్వం, ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు చాగంటి లాంటి ఘనాపాటిని సలహాదారులుగా నియమించారు. మరో వైపు ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తున్న ఒక గజదొంగ కథ ప్రేరణగా తీసిన సినిమాకు 1300 టికెట్టు పెట్టి ప్రేక్షకుల నుంచి డబ్బు వసూలు చేసుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇస్తున్నారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారికి పారితోషకం ఇస్తున్నారు. అసలే బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్, జూదం, మోసం అమ్మాయిలపై అఘాయిత్యాలు, దొంగ రవాణా, గుడుంబా, గంజాయి, ఎర్ర చందనం స్మగ్లింగ్, వ్యభిచార రాకెట్, దందాలతో పోలీసులు సతమవుతుంటే విశృంఖలకత్వాన్ని, హింస, స్మగ్లింగ్, ధూమపానం, మద్యపానం దొంగ పనులు చేసేవారిని హీరోగా తెరకెక్కించి ఏ మాత్రం సెన్సార్ లేకుండా ఎక్కడ తగ్గకుండా 'తగ్గేదెలా' జుగుప్సాకరమైన, అశ్లీల సన్నివేశాలను యువత పెడదోవకు ప్రేరేపించే సినిమాలు సెన్సార్ బోర్డు కళ్ళు మూసుకొని సర్టిఫై చేస్తున్నారు, మరోవైపు హిందూ మనోభావాలు లవ్ జిహాద్ అని గగ్గోలు పెట్టే మతతత్వవాదులకు అశ్లీలత కనిపించకపోవడం సిగ్గుచేటు.

గత రెండు మూడు సంవత్సరాలుగా మతం పేరుతో, వర్గం పేరుతో మహిళలపై దాడులు హింస అత్యాచారాలు హత్యలు మితిమీరిపోయాయి. మార్పు ఇంటి నుంచి మొదలవ్వాలి. ద్వేషం అసూయ అజ్ఞానం అవిద్య అవివే కం మెండుగా ఉన్న వారు అధికారంలో ఉన్నప్పుడు సమస్యకు పరిష్కారం దొరకదు. నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఎన్ని చట్టాలు ఉన్నా, అనేక కారణాలతో తప్పించుకుంటున్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేశారు, బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్ చేసిన వారికి క్షమాభిక్ష ప్రకటించారు, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన రెసిలర్లపై లైంగిక వేధింపులకు గురిచేసిన వారిని అందలమెక్కించిన ఘనత మనది.

ఒకవైపు స్త్రీ దేవత అనే సంస్కృతికి పరిరక్షకులం అని చెప్పుకుంటూ, మరో వైపు స్త్రీని అవమానించడం విరుద్ధ విలువలను ప్రతిబింబిస్తుంది. ఏడాది వయసున్న చిన్నారి నుంచి ముసలి అవ్వ కూడా అత్యాచారం నుంచి తప్పించుకోలేని పరిస్థితి. సినిమాలల్లో సీరియళ్లలో పెడధోరణలు ఎక్కువైపోయాయి. బూతు కంటెంట్ ఉన్న సినిమాలు కాసుల వర్షం కురిపించడం ఎలా ఉన్నా సమాజంపై ప్రభావం చూపుతున్నాయి.

టెక్‌ఫాగ్ అనే యాప్ ద్వారా అధికారంలో ఉన్న పార్టీ కొంత మంది ప్రముఖులు, మహిళా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తోందని ఇటీవల వైర్ పత్రిక ప్రచురించిన కథనంలో పేర్కొంది. ముఖ్యంగా పాలక పక్షానికి అనుకూలంగాలేని మహిళా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటోందని, దీని ద్వారా వారిని అవమానపరిచి, వేధించడమే లక్ష్యమని వైర్ కథనం చెబుతోంది. ఈ దాడులను చాలావరకు ధ్రువీకరణ కాని అకౌంట్ల ద్వారా చేస్తున్నట్లు తేల్చింది. ఇలా లక్ష్యం చేసుకోవాలనుకునే వ్యక్తుల మతం, లింగం, లైంగిక ఆసక్తులు, భాష, వయసు, రాజకీయ అనుబంధం.

జనవరి 2021 నుంచి మే వరకు వైర్ నిర్వహించిన పరిశోధనలో మహిళా జర్నలిస్టులు చేసిన ట్వీట్లకు 4.6 మిలియన్ సమాధానాలు రాగా, అందులో 18% అంటే 8 లక్షలకు పైగా సమాధానాలు టెక్‌ఫాగ్ నిర్వహిస్తున్న అకౌంట్ల నుంచి వస్తున్నట్లు తేలింది. అందులో 67% సమాధానాలు అవమానకరంగా, వేధింపులతో కూడుకుని ఉన్నాయి. సోషల్ మీడియాలో కనిపిస్తున్న ధోరణి, సమాజం సాధించిన అభ్యుదయాన్ని నాలుగు దశాబ్దాల వెనక్కి లాక్కుని వెళ్లినట్లు అనిపిస్తోంది.

డాఎం సురేష్ బాబు



## తప్పులకు ఆస్కారం ఉండొద్దు

**ప్రజాపక్షం/ నల్లగొండ :** ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పరిశీలన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సర్వే బృందాలకు సూచించారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, నల్గొండ మండలం, చందనపల్లి, చిన్న సూరారం గ్రామపంచాయతీలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన సర్వే ను తనిఖీ చేశారు.సర్వే నిర్వహిస్తున్న ఇళ్లకు వెళ్లి సర్వే బృందాలతో మాట్లాడుతూ ఇంటి యజమానుల పూర్తి వివరాలను సేకరించాల,ని అలాగే ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా దరఖాస్తులు పరిశీలించాలని,పేరు, చిరునామా, ప్రస్తుతం ఉన్న ఇంటి వివరాలు, ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇల్లు నిర్మించే నూతన స్థలం, వివరాలు అన్నింటిని జాగ్రత్తగా పరిశీలించి ఆన్లైన్ అప్లికేషన్లు వివరాలను అప్లోడ్ చేయాలని చెప్పారు. ఈ నెలాఖరులోగా సర్వేను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, గృహ నిర్మాణ పిడి రాజకుమార్ తదితరులు ఉన్నారు.

## రజక సంఘం ఏర్పాటుకు కృషి

**ప్రజాపక్షం/చింతపల్లి :** రజకుల సామాజిక వర్గానికి సామాజిక, రాజకీయ రంగాలలో సముచిత స్థానం పొందటంతో పాటు, హక్కులు సాధించుకోవటం కోసం మండలంలో రజక సంఘం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు ఆ కుల సంఘం కార్యనిర్వహక సభ్యులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశరు. మండల పరిధిలోని అన్ని గ్రామాల రజకులు ఏకతాటిపైకి వచ్చి సంఘం ఏర్పాటుకు కృషి చేసి, సహకరించాలన్నారు. త్వరలోనే రజక ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి నూతన మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు వారు తెలిపారు. అతి త్వరలోనే ఓ తేదీని నిర్ణయించి అందరిక తెలియజేస్తామన్నారు. రజకుల హక్కులు వాటి సాధన కోసం జరిగే ఈ కార్యక్రమాన్ని రజకులు విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకసభ్యులు నాగిళ్ళ యాదగిరి, కానుగుల అభి, భూతరాజు యాదయ్య, బొడ్డుపల్లి యాదగిరి, సిరసనగండ్ల శ్రీను, గోవిందు రవి, బొడ్డు, పుప్పాల లక్ష్మీనారాయణ, సిరసనగండ్ల శ్రీరాములు, కొలుకులపల్లి గణేష్ తదితరులు ఉన్నారు.

## కూరగాయల వ్యాపారుల నిరసన



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్ బాలుర కళాశాల పక్కన గంతలో నిర్మించిన రైతు బజార్ కూరగాయల మార్కెట్ లో కూరగాయలు వర్తకం చేసుకునే వ్యాపారులు తమకు స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కూరగాయల వ్యాపారులు మాట్లాడుతూ తాము గత రెండు సంవత్సరాలుగా రైతు బజారు వద్ద కూరగాయల వ్యాపారం చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నామని ఈ మధ్యకాలంలో అందులో సాంకేతిక శిక్షణ సంస్థను నెలకొల్పారని అందువల్ల తాము వ్యాపారం చేసుకోవడానికి స్థలం లేకపోవడం వల్ల తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమం లో లక్ష్మమ్మ, రేష్మ, మేఖల శోభ, జానీ పాష, సుమతి, బాబా, బషీర్, పాలకూరి వెంకన్న, కాషమ్మ, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులందరినీ వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పాఠశాల విద్యశాఖలో విలీనం చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు రాంపంగు వెంకటేశ్వర్లులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, కెజిబివి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి రూ. 10లక్షల జీవిత బీమా, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. పదవీ విరమణ బెనిఫిట్ ద్వారా రూ. 25లక్షలు ఇవ్వాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి లక్ష్మీ నారాయణ, సయ్యద్, రాంబాబు, శ్రీనివాస్, విజయ కుమారి, హరిత, సరస్వతి, సూర్య పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి గణిత పోటీ పరీక్షలు



**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి ప్రతిభ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల నుండి 60 మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరయ్యారు. పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు మెమోంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఇంగ్లీష్ విభాగంలో సురేష్, మౌనిక, తెలుగు విభాగంలో పల్లవి, సమీరా, రెసిడెన్సియల్ విభాగంలో వరుణ్ తేజ, రోహిణిలు విజేతలుగా నిలిచారు. వీరు డిసెంబర్ 22న హైద్రాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్ రావు, మండల విద్యాధికారులు సలీం షరీఫ్, శ్రీనివాస రావు, గురువయ్య, వెంకటేశ్వర్లు, ఉపేందర్, ప్రసాద్ పాల్గొన్నారు.

## సిసి కెమెరాలతో నేరాలు కట్టడి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** నేరాల నియంత్రణలో సిసికెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, దీంతో నేరాలను కట్టడి చేయవచ్చని డిఎస్పి శివరాం రెడ్డిఅన్నారు. బుధవారం పట్టణం లోని 22 వ వార్డు లోని ప్రధాన వీధులు, చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన 29సిసి కెమెరాలను డిఎస్పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సిసి కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రతి కాలనీలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ అమీనాఫర్విన్ సయ్యద్ సమ్మద్ పాల్గొన్నారు.

# అక్రమాలపై ఉక్కుపాదం

సిసిఎస్ పోలీసుల అదుపులో
బియ్యం అక్రమ రవాణదారులు
మరింత లోతుగా విచారణ చేస్తాం..
ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు
మల్టీజోన్ 2 ఐజి సత్యనారాయణ



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** అక్రమ రవాణాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపింది. సిసిఎస్ పోలీసుల అదుపులో పేదలకు ప్రభు త్వం పంపిణీ చేస్తున్న ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నా అక్రమార్కులను అదుపులో తీసుకున్నారు. వారిని మరింత లోతుగా విచారణ చేసి అక్రమ రవాణాలో ప్రమేయం ఉన్న ఎంతటివారినైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మల్టీజోన్ 2 ఐజి సత్యనారాయణ వెల్లడించారు. బుధవారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయంలో నల్లగొండ జిల్లా ఎస్పి, సూర్యాపేట ఇన్‌చార్జ్ శరత్ చంద్రపవార్, అదనపు ఎస్పి నాగేశ్వర్ రావులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. నల్లగొండకు చెందిన అక్రమ రవాణదారులు నర్సింహ్మారావు, జగదీష్‌లను కోదాడ పోలీసులు అదుపులో తీసుకోని విచారిస్తున్నట్లు తెలిపారు. అలాగే సూర్యాపేటకు చెందిన సురుగు నాగశంకర్ గౌడ్, భిక్షపతి గౌడ్, కాసం రమేష్, సోమ శివకుమార్‌లను అదుపులో తీసుకోని విచారిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భిక్షపతి గౌడ్ బ్యాంకు ఖాతాల నుండి లావాదేవిలు నడుస్తున్నట్లు తాము గుర్తించామని చెప్పారు. వీరిని మరింత లోతుగా విచారించి పిడియాక్టు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సరిహద్దు చెక్ పోస్టుల వద్ద నిరంతరం నిఘా పెట్టడం జరిగిందన్నారు. గంజా యి, వరిధాన్యం అక్రమంగా రాష్ట్రంలో తరలి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని, ఇప్పటికే జిల్లాలో 80శాతం తగ్గిందని చెప్పారు. ఈ అక్రమ రవాణాదారులకు తమ శాఖ నుండి అధికారులు ఎవరైన సహకరిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించే గ్రూప్2 పరీక్షలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుండి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌ను ఎస్‌పి కార్యాలయం నుండి వీక్షించారు. సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేటలో 30, కోదాడలో 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అందుకు సంబంధించి పరీక్ష కేంద్రా ల వద్ద పోలీస్ బందోబస్తును పటిష్టంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డిఎస్‌పిలు జి రవి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులు విద్యా అభివృద్ధికి కృషి



**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్ :** సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజా సంఘాలు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలియజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ ,బొమ్మగాని రాజు మాట్లాడుతూ విద్యాశాఖలోని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులుగా రాష్ట్రవ్యాప్తంగా 19300 మంది జిల్లాలో దాదాపుగా 1100 మందిని వివిధ విభాగాలుగా పనిచేస్తున్నారని గత 20 సంవత్సరాలుగా విద్యాశాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. సరైన వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసి పే స్కేల్ ను అమలు చేయాలని అదేవిధంగా ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 10 లక్షలు, ఆరోగ్య బీమా 10 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులలో 61 సంవత్సరాల నుండి పదవి విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ కింద 25 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వ విద్యాశాఖ నియామకాలలో వెయిటేజ్ కల్పించి సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ రి ఎంగేజ్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియే ప్రెసిడెంట్ క్రాంతికుమార్ ,రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్ ,డి నీలాంబరి,కొండ చంద్రశేఖర్ కొండ చంద్రశేఖర్, గుమ్మల మంజులారెడ్డి,సావిత్రి వి. సావిత్రి,పుష్పలత , సాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## క్షుద్రపూజల అనుమానంతో మహిళపై హత్యాయత్నం



**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** మంత్రాలు చేస్తున్నారన్న నెపంతో మహిళపై హత్యాయత్నము కు ప్రయత్నించిన దారుణ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామస్తురాలైన ఏనుగుతల ఝాన్సీ ఆరోగ్య సమస్యలకు మంత్రాల ప్రభావమని తప్పుడు నమ్మకాలతో ఆమె భర్త ఏనుగుతల దయాకర్, అతని కుటుంబ సభ్యులు కలిసి అదే గ్రామానికి చెందిన బెక్కంటి పుల్లమ్మపై అనుమానంతో దాడి చేసి చంపటానికి ప్రయత్నించారన్నారు. వివరాలలోకి వెళితే అక్కెనపల్లి గ్రామంలో ఏనుగుతల దయాకర్ భార్య ఝాన్సీ గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుచుండగా దానికి కారణం ఆ గ్రామస్తురాలైన బెక్కంటి పుల్లమ్మ మంత్రాలు చేయడం వల్లనే ఝాన్సీ అనారోగ్యానికి గురి అయిందని ఆమెను చంపితేనే వారి కుటుంబం అనారోగ్యానికి గురికాకుండా ఉంటుందని భావించి దయాకర్, కుటుంబ సభ్యులు కలిసి పుల్లమ్మని ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో పథకం ప్రకారం 9 వ తారీకున పుల్లమ్మ కూలి పనికి పోయి తన ఇంటికి వచ్చే క్రమంలో అక్కనపల్లి గ్రామ సెంటర్లో దయాకర్పథకం ప్రకారం వేచి చూస్తూ ఆమె అక్కడికి రాగానే ముందుగా తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేసి కత్తితో గదమ, వీపుల, చేతులపై పొడిచి చంపటానికి ప్రయత్నించగా అంతలో పుల్లమ్మ భర్త యాదయ్య అక్కడికి రాగా అతనిని చూసి దయాకర్ పారిపోయినాడు. ఇట్టిఘటన పై పుల్లమ్మ ఫిర్యాదు మేరకుకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. దాడికి యత్నించిన దయాకర్ కుటుంబ సభ్యులను పట్టుబడి చేసిరిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపినట్లు వారు తెలిపారు.

**మంత్రాలను, బాణామతిని నమ్మవద్దు : ఎస్‌పి చరత్ చంద్ర పవర్**

మూఢనమ్మకాలైన మంత్రాలను, బాణామతిని ప్రజలు నమ్మవద్దని,ప్రజలకు ఎవరికైనా ఎవరిపైనా అనుమానాలు ఉంటే పోలీసుల తీసుకురావాలని జిల్లా ఎస్‌పి చరత్ చంద్ర పవర్ తెలిపారు. మూఢ నమ్మకాలపై ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపడతున్నామని, ప్రజలు ఎవరు కూడా మూఢ నమ్మకాలైన మంత్రాలనునమ్మవద్దని దీనికి అపనమ్మకమే బలమైన కారణం అని ఆరోగ్య సమస్యలు అనేవి వారు నివసించే పరిసరాలు, వాతావరణ మార్పు, జన్యు సంబంధమైన కారణాలు ఉంటాయని వాటి పరిష్కారానికి అత్యాదునిక వైద్య సదుపాయాలు ఉన్నాయన్నారు.అలాగే ఎవరైనా ఇక ముందు ఇలా చేస్తే వారి పైన కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

## క్రికెట్ పోటీలకు విశేష స్పందన

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** పట్టణంలోని ఎన్‌జి కళాశాలలో ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్5 పోటీలకు విశేష స్పందన లభిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బోని రమేష్ గౌడ్ అన్నారు. బుధవారం ఎన్‌జి కళాశాలలోని జరుగుతున్న క్రికెట్ లీగ్ దశ పోటీలను పరిశీలించి అనంతరం క్రీడాభిమానులతో కలిసి తిలకించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారని అన్నారు. ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడా పోటీల్లో



మొత్తం 64 జట్లు పాల్గొన్నాయని ఈనెల 20 వరకు క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. కౌన్సిలర్లు, ఆర్గనైజర్స్ కేసాని వేణుగోపాల్ రెడ్డి, ప్రదీప్ నాయక్, ఆలకుంట్ల మోహన్ బాబు, ఏర్పుల రవి, ముత్తినేని నాగేశ్వరరావు, బోనగిరి ప్రభాకర్, శ్రీధర్, ఏర్పుల శ్రవణ్ పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు జరుగకుండా చర్యలు

రాష్ట్ర మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల ట్రాన్స్ జెండర్స్ శాఖ : సెక్రటరీ అనిత రామచంద్రన్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** బాల్య వివాహాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళ శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ శాఖ సెక్రటరి అనిత రామచంద్రన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ అంగన్వాడీ కేంద్రంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, సఖీ కేంద్రాలు, బాలల పరిరక్షణ కేంద్రాలు వాటి పనితీరు, నిర్వహణ శాఖపరమైన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. 6 సంవత్సరాల పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు పోషక ఆహారాన్ని, బాలమృతాన్ని సమక్రమంగా అందించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని తెలిపారు. ప్రతి రోజు హాజరు రిజిస్టర్‌లో రాయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు సఖీ కేంద్రాలు వాటిలో అమలుపరిచే పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ, మహిళ శక్తి డిస్టిక్ కోఆర్డినేటర్, జిల్లా సంక్షేమ అధికారి కె నర్సింహ్మారావు, అర్బన్ డిసిపిఓ సుబ్బలక్ష్మి , శ్రీజ, వాణిశ్రీ, వెంకటలక్ష్మి , పారిజాత, డిసిపిఓ రవికుమార్, చైతన్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ ప్రమేయం వద్దు

**ప్రజాపక్షం/డిండి:** ఇందిరమ్మ ఇండ్లను ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల సమాచారం మేరకు ప్రతి గ్రామానికి సంబంధించిన అర్హుల లిస్ట్ ఆన్‌లైన్ దరఖాస్తుల మూలంగానే పరిగణలోకి తీసుకుంటున్న ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని అర్హులకు మళ్లీ ఇందిరమ్మ ఇండ్లకోసం అవకాశం కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో లేకుండా వలస వెళ్లిన వారు, గడువులోపు వీలు లేక దరఖాస్తు చేసుకోని వారి కోసం ప్రభుత్వం మరోసారి అర్హులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ ప్రమేయం లేకుండా పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు మంజూరు చేయాలని అధికారులకు తెలిపారు.

## లింగయ్య పోరాటాలు మరువలేనివి



**ప్రజాపక్షం/ మునుగోడు:** నమ్మిన సిద్ధాంతం కోసం ధర్మం బిక్షం అభిమానిగా 19 90 నుండి కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా కొనసాగుతూ జీవితకాలం గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసిన సురిగి లింగయ్య పోరాటా లు మరవలేనివని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని ఎలాగలాగూడం గ్రామానికి చెందిన సురికి లింగయ్య ఏడవ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం కృషి చేస్తూ నిజాయితీగల కమ్యూనిస్టు కార్యకర్తగా తమ జీవిత కాలం కొనసాగాడు అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బక్క నరసింహ,దాము వెం కన్న, కట్కూరు లింగస్వామి, సురిగి సత్తయ్య,మాజీ ఉపసర్పంచ్ సురిగి ఎల్లమ్మ, వెంకటమ్మ పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఎస్‌సిల స్థితిగతులపై శ్వేతపత్రం

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఎస్‌సి వర్గీకరణ అంశం పై జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది తల్లమల్ల హసేన్ తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల విచారణ కమిషనర్ జస్టిస్ శమీమ్ అక్తర్‌కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా హసేన్ మాట్లాడుతూ ఎస్‌సివర్గీకరణపై ఆగస్టు ఒకటవ తేదీన గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలను ఆర్టికల్ 341 సవరిస్తూ పార్లమెంటులో చట్టం చేసిన తర్వాత అన్ని రాష్ట్రాల్లో అమలు చేయుటకు సాధ్యమవుతుందన్నారు, 75 సంవత్సరాల స్వాతంత్ర కాలంలో ఎస్సీల స్థితిగతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్వేత పత్రం విడుదల చేయాలని, షెడ్యూల్ కులాలలో అత్యంత వెనుకబడిన కులాలను గుర్తించి వారికి ప్రత్యేక కార్యచరణ చేయాలని కోరారు. ఎస్‌సి శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, రాజ్యసభ సభ్యులు రాజకీయ కోణంతో వర్గీకరణ చేయవలసి వస్తే తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సిలలో అత్యంత వెనుకబడిన కులాలను ఒక గ్రూపుగా, కొంతమేరకు అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్న మాదిగ, మాల కులాలను ఒక గ్రూపుగా చేర్చాలని. అదేవిధంగా ఎస్‌సిసబ్ ప్లాన్ అమలు చేయుటకు అత్యంత వెనుకబడిన ఎస్‌సికులాలకు ఒక కార్పొరేషన్, మాల , మాదిగ కులాలకు వేరువేరుగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

# జర్నలిస్టులపై దాడి చేసిన మోహన్‌బాబుపై చర్యలు




టియూడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వర్ రావు డిమాండ్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హైద్రాబాద్ నగరంలో వార్త సేకరణకు వెళ్లిన టివి9, ఈటివితో పాటు ఇతర జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మంచు మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలని టియూడబ్ల్యూజె ఐజె యు జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జర్నలిస్టుల దాడికి నిరసనగా పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ ఎఓ రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులపై రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయని, దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను జర్నలిస్టులు వెలికితీస్తుంటే తట్టుకోలేని కొందరు దాడులకు పాల్పడుతున్నారన్నారు. దాడులకు పాల్పడుతున్న వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించి జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాలు తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు దేవరం రాంరెడ్డి, బసవోజు శ్రీనివాసచారి, రావుల రాజు, రాజా రమేష్, ఇందిరాల రామకృష్ణ, వెంకటేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** జర్నలిస్టులపై దాడికి పాల్పడిన సినీ నటుడు మోహన్‌బాబుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కమిటీ పిలుపుతో తహసీల్దార్ హరి ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బి వెంకటేశ్వర్లు, ఎండి రెహమాన్, చాంద్ పాషా, కొమ్ము ప్రవీణ్, రాములు నాయక్, నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** విధుల్లో ఉన్న జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబు పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి లు హెచ్చరించారు, ఈనెల 10న హైదరాబాద్లో విధుల్లో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ప్రెస్ క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో జర్నలిస్టులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం గడియారం సెంటర్లో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ బాధ్యులు మాధురి యాదగిరి, జూలకంటి అశోక్ రెడ్డి, నేతి ఉపేందర్, పిట్టల రామకృష్ణ, దొమ్మాటి విజయ భాస్కర్, మట్టయ్య, రవీందర్ రెడ్డి, లింగయ్య, కట్టా సుధాకర్, గోలి విజయ్ కుమార్ తెలుగమల్ల దశరథ, కంది శ్రీను, భాస్కర్, భవాని ప్రసాద్, సంపూర్ణ పాల్గొన్నారు.




## అయ్యప్ప పడిపూజ మహోత్సవం

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** మున్సిపాలిటి పరిధిలోని పిల్లలమర్రి ఎరకేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి, సుబ్రమణ్య స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వామికి రంగు రంగుల పండ్లు, పూలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అందంగా అలంకరించిన 18 మెట్లపై కర్పూరం జ్యోతులను వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కడారి వెంకన్న గురుస్వామి నిర్వహించిన పూజలో నల్గొండ జిల్లా తిప్పర్తికి చెందిన ఈద సంజీవ ఆధ్వర్యంలో పాటలుపాడుతూ భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలమర్రి దీక్షా స్వాములు పాల్గొన్నారు.



# అభివృద్ధికి 'సుడా' నిధులు

### మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ప్రజల అవసరాలకనుకూలంగా అభివృద్ధికి సుడానిధులు వెచ్చిస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఇరవై రెండవ డివిజన్ పరిధిలోని శివాలయం పక్కన మహిళా సమాఖ్య భవనానికి సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అడిషినల్ కలెక్టర్,సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్‌తో కలి సి శంకుస్థాపన చేశారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని పద్నాలుగు వందల మంది మహిళా సమాఖ్య గ్రూపుల మహిళలకు ఉపయోగపడే విధంగా స్థానిక కార్పొరేటర్ గంట కళ్యాణి శ్రీనివాస్ స్థానిక నాయకులు దండి రవీందర్, ముల్కల కవిత, సమాఖ్య గ్రూపుల విజ్ఞాపన మేరకు ప్రస్తుతం పది ల క్షలు నిధులు మంజూరు చేసినట్లు, అవి సరిపోకపోతే మరిన్ని నిధులు వెచ్చి ంచి భవన నిర్మాణం పూర్తి చేసి అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ రాజేంద్ర ప్రసాద్, ఏఈ రమేష్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సమై ఖ్య సంఘాల అధ్యక్షులు జానంపేట అంజలి, హాజీరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం



✲ సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్‌పై మూడు నెలల ఉచిత శిక్షణ

✲ జిల్లా ఎస్‌పి అఖిల్ మహజన్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో ఔత్సాహిక నిరుద్యోగ యువకులకు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రెండవ దశ ఉచిత భోజనం, వసతితో కలిగిన మూడు నెలల పాటుగా సిసిటివి ఇన్‌స్టాలైజేషన్‌లో భాగంగా సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ ఇచ్చి నైపుణ్యాలు పెంపొందించి హైద రాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి బుధవారం రోజున తెలిపారు. ఉత్సాహం కలిగిన నిరుద్యోగ యువకులు 10వ తరగతి సర్టిఫికేట్‌తో సం బంధిత పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 12 నుండి 15వ తారీఖు సాయంత్రం ఐదు గంటల లోపు తమ పేరును నమో దు చేసుకోవాలని తెలిపారు. నిరుద్యోగ యువత ఇట్టి సువర్ణ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# అస్వస్థతకు గురైన కస్తుర్బా బాలికలు

✲ ఆసుపత్రికి తరలింపు



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** సారంగాపూర్ మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరు గురు విద్యార్థులు మంగళవారం రాత్రి చలి తీవ్రతకు వణుకుతో అవస్థకు గురయ్యారు. సిబ్బంది వీరిని చికిత్స నిమిత్తం బుధవారం 108 ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ తెలియజేశారు. విద్యార్థులను డాక్టర్ పరిశీలనలో సాయంత్రం వరకు ఉంచి తిరిగి యధావిధిగా పాఠశాలకు పంపడం జరుగుతుందన్నారు.

# ఉపాధ్యాయుడు సస్పెన్షన్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లా/ఎల్లారెడ్డిపేట** రాజన్నసిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని నారాయణపూర్ విద్యాలయంలో మతప్రచారం చేసుందుకు యత్నించిన ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ లింగాల రాజును సస్పె ండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓమతానికి సంబంధించిన కరపత్రం సామాగ్రి విద్యార్థులకు పంపిణీ చేశారు. దీనిపై విద్యాధికారికి చేరడం తో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డిఇఒ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

# జాతీయ అవార్డుకు మద్దెల దినేష్ ఎంపిక

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనికి చెందిన ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు, డిహెచ్‌పిఎస్ నాయకుడు మద్దెల దినేష్ బహుజన సాహిత్య అకాడమీ వారి జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. న్యూఢిల్లీలో ఈనెల 15న ఆయన ఈ అవార్డు అందుకోనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నందుకుగాను దినేష్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. న్యూఢిల్లీలోఅకాడమీ 5వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా దినేష్‌కు ఈ అవార్డును అందజేయనున్నారు. దేశంలోని 27 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ మేరకు బుధవారం అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం.గౌతమ్,రాష్ట్రకోఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, జిల్లా అధ్యక్షుడు బాదే వెంకటేశంలు అవార్డు ఎంపిక పత్రాన్ని దినేష్‌కు అందజేశారు.

# బైండోవర్ ఆంక్షల ఉల్లంఘన

### ఇద్దరు మహిళలకు జైలు శిక్ష

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం మండలం పీకె రామయ్యకాలనీకి చెందిన దేదావత్ మారు, మాలోత్ మంజులలు బైండొవర్ అంక్షలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించడంతో రామగుండం తహసీల్దారు జి.కుమార స్వామి బుధవారం ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు అబ్కారీశాఖ గోదావరిఖని సీఐ మంగమ్మ తెలిపారు. గతంలో వీరిద్దరిని బైండొవర్ చేసినట్లు తెలిపారు.ఇటీవల ఈ ఇద్దరు మహిళలు బైండొవర్ అంక్షలను ఉల్లంఘించి నాటు సారా అమ్మకాలు చేయడంతో కేసు నమోదు చేసి రామగుండం తహసీల్దారు ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. దీంతో బైండొవర్ అంక్షల ఉల్లంఘనకు గాను రూ.లక్ష జరిమానా విధించగా అటి డబ్బు కట్టనందుకుగాను జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఎవరైన నాటుసారా తయారు చేసిన, రవాణా చేసిన, విక్రయించిన రూ.లక్ష జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష విధించబడుతుందని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ ఖాదిర్, కానిస్టేబుళ్లు శ్రీలత, శ్యామల, నరేష్‌లు పాల్గొన్నారు.

# సమష్టి నిర్ణయాలతో సత్ఫలితాలు

### ఆర్‌జి-1 జిఎం లలిత్‌కుమార్

**ప్రజాపక్షం/గోదావరిఖని :** ఆర్‌జి1 ఏరియా జీడీకె 2, 2ఎ ఇంక్లైన్‌లలో బుధవారం మల్టి డిపార్టుమెంటల్ సమావేశాన్ని జీఎం డి.లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ పురోభివృద్ధికి సాధించాల్సిన అంశాల గురించి అధికారులు మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు వివిధ సెక్షన్లకు సంబంధించిన అధికారులు సమిష్టి నిర్ణయాలు తీసుకొని అమలు చేయాలన్నారు. దీని ద్వారా మంచి సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. ఉద్యోగులచే రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఏఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, ఏరియా ఇంజినీర్ డివి.రావు, ఎజీఎం(ఐఇడి) అంజనేయులు, డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు, ఎస్‌ఓఎం రమేష్‌బాబు, కాలరీ మేనేజర్ అల్లావుద్దీన్, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# పకడ్బందీగా గ్రూప్‌-2 పరీక్షలు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**కరీంనగర్ జిల్లాలో 15,16 తేదీల్లో గ్రూప్‌-2 పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గ్రూప్-2 పరీక్షకు విధులు కేటా యించిన అధికారులకు బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఆలస్యంగా వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని అధికారులను ఆదేశించారు. విధులు కేటాయించబడిన అధికారులు ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పరీక్ష నిర్వహించే తేదీల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులు కేటాయించిన సిబ్బంది తమకు కేటాయించిన పని పూర్తవగానే వెంటనే పరీక్ష కేంద్రం నుంచి వెళ్లిపోవాలని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మానిటరింగ్ అధికారి పవన్ కుమార్, గ్రూప్ 2 పరీక్ష ప్రాంతీయ కోఆర్డినేటర్లు సతీష్ కుమార్, వరలక్ష్మి న్నారు.

వార్తకు ఫోటో ఉంది

### ఉపాధి పొందిన దివ్యాంగులు మార్గదర్శిగా నిలవాలి

వివిధ రంగాల్లో పలు వృత్తుల్లో రాణిస్తున్న దివ్యాంగులు తోటి దివ్యాంగులకు మార్గదర్శకులుగా నిలవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. యూత్ ఫర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని తారక హోటల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పిస్తూ ఉపాధి కల్పిస్తున్న యూత్ ఫర్ జాబ్స్ సంస్థ గ్రామాలకు సైతం తమ సేవలను విస్తరించాలని సూచించారు. దివ్యాంగులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి స్థానికంగానే శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. అందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టర్లలో పనిచేస్తున్న దివ్యాంగుల ద్వారా ప్రేరణ కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, తద్వారా మరింత మంది దివ్యాంగులు వృత్తి నైపుణ్య శిక్షణలకు హాజరవుతారని సూచించారు. ఈ సందర్భంగా యూత్‌ఫర్ జాబ్స్ సంస్థ ద్వారా ఉపాది పొందిన పలువురు దివ్యాంగుల అభిప్రాయలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, యూత్ ఫర్ జాబ్ ఫౌండర్ మీరా శెన్నయ్, ప్రతినిధులు సమీర్ నాయర్, మధుసూధన్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు ఉండొద్దు

### తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కటారి రేవతి



**ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ :** జగిత్యాల మండలంలోని లక్ష్మీ పూర్ గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతి బాపూలే తెలంగాణ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోరుట్లను తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కటారి రేవతి సందర్శించారు. మొదట లపూర్‌లో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్ ని సందర్శించి అక్కడ ఉన్న హాస్టల్ పరిసరాలను గమనించి వారికి కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. మూడు రోజులకు ఒకసారి కూరగాయలు తీసుకోమని, హాస్టల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కోరుట్లలో ఉన్న వెటర్నరీ కాలేజ్ హాస్టల్‌ని సందర్శించడం జరిగిందని హాస్టల్ సందర్శించి హాస్టల్లో ఉన్న సదుపాయాలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెటర్నరీ స్టూడెంట్స్ తో ఇంటరాక్ట్ అవడం జరిగింది. వెటర్నరీ కాలేజ్ హాస్టల్ ని చూసి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. అనంతరం జగిత్యాల కలెక్టర్ ని కలిసి సందర్శనలో గమనించిన విషయాలు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోవగిరి నరేష్, జగిత్యాల సిడిపిఓ మమత, సూపర్‌వైజర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

✲ ఇంటిస్థలం వద్దనే జియో ట్యాగింగ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి :** అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను అత్యంత జాగ్రత్తగా,పారదర్శకంగా పకడ్బందీగా సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఇందిరమ్మ కమిటిని ఆదేశించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 3వ వార్డు, జిల్లా కేంద్రంలోని 10వ వార్డులో జరుగు తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ అర్హులైన ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఇదివరకు నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కొరకు అర్హులైన లబ్దిదారుల వివరాలను సర్వేయర్లు మోబైల్ యాప్ నమోదు చేసి తీరును పరిశీలించారు. ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండ వివరాలు నమోదు చేయాలని, ఇంటి స్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్‌లు పరిశీలించుకొనిఅవి సరైనవని ధృవీకరించుకున్న తర్వాత యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఇదివరకు ప్రభుత్వంచే లబ్ధి చేకూరిన వారిని అనర్హులుగా, తప్పనిసరిగా ఇంటిస్థలం వద్దనే జియో టా గింగ్ చేసి యాప్ వివరాలను తీసు కుం టుందని సూచించారు. గ్రామాల్లో, మున్సిపాల్టీల్లో ఈ సర్వేలో అర్హులైన ప్రతి ఒక్కరు నమోదు చేసుకునే విధంగా ప్రజలను చైతన్య పర్చాలని ప్రజాప్రతినిధులకు తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరు మిస్‌కాకుండ అత్యంత పారద ర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్బన్ తహశీల్దార్ సలీం, ఎంపిడిఓ సూపర్‌వైజర్లు , సర్వే సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# నిబంధనలు తప్పనిసరి

✲ ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్



**ప్రజాపక్షం/హుజురాబాద్:** హుజురాబాద్ పట్టణ కేంద్రంలోని పర్మిషన్ లేకుండా నడుస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలను గుర్తించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ ఎంఇఒను కోరారు. ఈ సందర్భ ంగా పట్టణ కేంద్రంలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ మాట్లాడుతూ కొన్ని ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకు ండా ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా,ఫైర్ సెక్యూ రీటి లేకున్నా నడుస్తున్నాయని, మరికొన్ని పాఠశాలలు పర్మిషన్ లేకుండా ధనార్జనే ధ్యేయంగా నడుస్తు న్నాయన్నారు. ఎంఇఒ ప్రతి ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలను తనిఖీలు నిర్వహించి పాఠశాలల సౌకర్యాలు, ఫైర్ సేఫ్టి, పాఠశాలలు పర్మిషన్‌లు, ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా ఉన్నాయా లేవా అనే విషయాన్ని బహిర్గతం చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులు మోస పోకుండా ఉండేలా చూడాలని, ప్రభుత్వ నిబంధనలు పాటిం చకుండా నడుస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాము యాదవ్ డిమాండ్ చేశారు. లేని యెడల ఎంఇఒ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ మండల కోశాధికారి మునిగంటి నాగేందర్, వంశీ, సన్ని, మనోజ్, వరుణ్, మణితేజ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను విస్మరిస్తే చర్యలు

### - జిల్లా సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బి.నరేష్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల పట్టణం చిలుకవాడకి చెందిన అలకొండ రాజవ్వ అనే వృద్దురాలిని తన కొడుకు శ్రీనివాస్ మోతే స్మశాన వాటికలోని గదిలో వదిలివెళ్లగా జగిత్యాల రెవిన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ కొడుకులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలి పారు. ధవారం సంక్షేమ శాఖ సఖి కేంద్ర సహాయంలో ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న వృద్దురాలిని పోలీసుల సాయంతో కొడుకులు శ్రీనివాస్, గోపాల్‌లకు అప్పజెప్పినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల ఆర్‌డిఓ మధుసుదన్ మాట్లా దు తూ నడువలేని పరిస్థితులలో ఉన్న వృద్దురాలిని పోషణ సంరక్షణ చూసుకోకుండా కఠినంగా స్మశానంలో విడిచిపెట్టినందుకు తల్లిదండ్రులు,సీనియర్ సిటిజన్స్ నిర్వహణ, సంక్షేమ చట్టం 2007లోని సెక్షన్ 24 ప్రకా రం ఆలకుంట రాజవ్వ కుమారులు తిరుపతి, శ్రీనివాస్, గోపాల్, రవిలకు 3 నెలలు జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. వృద్దురాలి కుమారులను జగిత్యాల మెయిన్స్ ట్రిబ్యునల్ ముందు హాజరు పరిచాలని పోలీసులను కోరారు.

# క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

### జీఎం సుధాకర రావు



**ప్రజాపక్షం/రామగిరి :** క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు. రామగుండం 3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన కంపెనీ స్థాయి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రో బాల్ పోటీలలో భాగంగా బుధవారం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల పోటీలలో గెలుపు ఓటములు తాత్కా లికమని, క్రీడాకారులు పట్టు వదలకుండా సాధన చేస్తే విజయం తప్పకుండా వరిస్తుందన్నారు. క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేస్తూ కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించి సంస్థకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ పోటీలను నిర్వహించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, విజయవంతం చేయడంలో కృషి చేసిన నిర్వాహకులందరికీ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామచంద్రారెడ్డి, ఎన్. శ్రీనివాసరావు, అధికారుల సంఘం అధ్యక్షుడు సి.హెచ్. వెంకట రమ ణ, ఎస్వోటుజియం జి. రఘుపతి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు షబ్బిరుద్దీన్, గుర్రం శీహరి, గౌరవ కార్యదర్శి వి.సునీల్ ప్రసాద్ , అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసింహరెడ్డి, ఇతర అధికారులు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

# న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

### ఉపాధ్యాయ సంఘ నాయకుల డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్, ఎస్టీయు వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూధన్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, పిఆర్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, టిటియు జిల్లా అధ్యక్షుడు ఆదర్శన్‌రెడ్డి, ఆంజనేయులు, తెలంగాణ సిపిఎస్ ఎంప్లా యిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నెల్లి సంపత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెకు వారు సంఘీభావం తెలిపారు. తెలం గాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండ రాజు రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి మహేష్, బి.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు వరలక్ష్మి , నీరజ, రవిచందర్, ఆంజనేయులు, వెంకటేష్, తదితరులున్నారు.

# మంత్రి కొండ సురేఖను బర్తరఫ్ చేయాలి

### బిఆర్ఎస్ నేత నిమ్మశెట్టి విజయ్ డిమాండ్



**ప్రజాపక్షం /వేములవాడ టౌన్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న కు ఎంతో ప్రీతి పాత్రమైన కోడెమొక్కు భక్తులు భక్తితో స్వామివారికి సమర్పించే కోడెలను జంతు కళేబరాలకు తరలుతున్నాయి బుధవారం పత్రిక సమావేశంలో బిఆర్ ఎస్ కౌన్సిలర్ నిమ్మచెట్టి విజయ్ డిమాండ్ చేశారు. మంత్రి సిఫారసు లెటర్‌తో అక్రమ కోడెల తరలింపులో మంత్రి ప్రధాన అనుచరుడు పాత్ర పోషించారు. దీని వెనకాల మంత్రి కొండ సురేఖ హస్తం ఉందని ఆమెను వెంటనే బర్తరఫ్ చేయాలి. స్థానిక ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేసి, కోడెల అక్రమ తరలింపుపై స్పందించాలని,వెంటనే రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటికి మొన్న బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కోడెల అక్రమ రవాణాపై నిరసన కార్యక్రమం చేపట్టాం. కోడెల అక్రమ రవాణాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. హిందువుల మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అంటూ ప్రశ్నించారు. కోడెల అక్రమ రవాణాపై వెంటనే ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు.

# చెరువులకు పారే నీటికి అడ్డుకట్ట సరికాదు

**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి, పాలకుర్తి గ్రామాల చెరువులకు కమ్మరిఒర్రె వాగు నుంచి వచ్చే నీటిని బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారం యాజమాన్యం అడ్డుకట్ట వేయడం సరైందికాదని ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్ అన్నారు. బుధవారం వాగు ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. కర్మాగారం క్వారీల ప్రదేశం నుంచి వస్తున్న నీటిని ముందుకు పారకుండా మట్టితో అడ్డుకట్ట వేశారని దీంతో చెరువుల్లోకి నీరు రాకుండా పోతుందని తద్వారా పంట పొలాలకు సాగు నీరు అందడంలేదని రైతులు, గ్రామస్థులు తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు ఆమె తెలుపడంతో ఆయన కర్మాగారం అధికారులతో మాట్లాడి అడ్డుకట్ట తొలగించాలన్నారు. దీంతో క్వారీల ప్రదేశాల్లో సిమెంటు పైపులు వేసి అడ్డుకట్ట తొలగిస్తామని, చెరువుల్లోకి యధావిధిగా నీరు పారేలా చూస్తామని కర్మాగారం అధికారులు చెప్పినట్లు మనాలి ఠాకూర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కోయ శ్రీహర్షకు 'ఎన్‌పిఎ' అవార్డు

### మహిళా ఫ్రెండ్లీ పంచాయతీలలో ఉత్తమ పంచాయతీగా 'చిల్లపల్లి గ్రామం'



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మంథని మండలం చిల్లపల్లి గ్రామానికి వచ్చిన జాతీయ పంచాయతీ అవార్డు ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్వీకరించారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధానతో కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ తో కలిసి పాల్గొన్నారు. 2022–23 వ సంవత్సరంలో మహిళా ఫ్రెండ్లీ పంచాయతీలలో దేశంలోనే మంథని మం డలం చిల్లపల్లి గ్రామపంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం జరిగింది. గ్రామంలోని ఆరు సంవత్సరాల పిల్లలందరినీ ఐసిడిఎస్ లో రిజిస్టర్ చేయడం, గ్రామ సభలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం, స్వశక్తి మహిళా సంఘాలకు రు ణాలు అందడం, మాతా శిశు మరణాలు సున్నా కు తగ్గడం, బాలికల విద్య ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు అమలు చేసినందుకు చిల్లపల్లి గ్రామం ఉత్తమ గ్రామంగా ఎంపికైనట్లు తెలిపారు. చల్లపల్లి గ్రామానికి 65 లక్షల రూపాయల నగదు బహుమతి వచ్చిందని, ఈ నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఒ వీర బుచ్చయ్య , జెడ్‌పి సిఇఒ నరేందర్, డిఆర్‌డిఒ రవీందర్ , డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ కుమార్, ఎంపిడిఓ పూర్ణ చందర్ రావు, మండల పంచాయతీ అధికారి శేషా సూరి, డి.పి.ఎం రజాక్, పంచాయతీ కార్యదర్శి రాం కిషోర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/చొప్పదండి :** ప్రస్తుత సమాజంలో క్రీడలు అంటే విముఖత స్థాయి నుంచి ప్రపంచంలో ఉన్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. అందులో బాగంగానే గ్రామీణ స్థాయి నుంచి సీఎం కప్ పేరిట ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభను గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని చొప్పదండి మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ ముగింపు సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మంచి నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని, శారీరక దారుడ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం గెలుపొందిన జట్లలోని క్రీడాకారులకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కె.మహేష్, వార్డు సభ్యులు మానస గంగయ్య, అశోక్, మండల అభివృద్ధి అధికారి ఆర్.వేణుగోపాల్, మండల విద్యాధికారి శ్రీనివాస్, దీక్షిత్, ఎస్సై అనూష, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పద్మాకర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మంజిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఖమ్మంజిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించే సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారు. ఖమ్మం గాంధీచౌక్, నర్తకి థియేటర్ రోడ్డులో 32, 36 డివిజన్లకు సంబంధించి సిసి రోడ్లు, సిసి డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేస్తారు. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెంలో రైల్వే మూడవ లైన్ ఏర్పాటులో భూములు కోల్పోయిన వారికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయనున్నారు. ఈనెల 13న దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని, పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. సిసి రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు. అశ్వారావుపేటలో వ్యవసాయ కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారు.

## సిఎం కప్ విజేతలకు బహుమతులు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సిఎం కప్ క్రీడా పోటీల్లో మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. బుధవారం రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల స్థాయిలో వివిధ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ బి.రాములు మాట్లాడుతూ మండల స్థాయిలో మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు సిఎం కప్ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. తొలి రోజు మంగళవారం క్రీడా పోటీలను, రెండవ రోజు బుధవారం అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో వివిధ గ్రామాల నుంచి 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెమొంటోలు, మెడల్స్‌ను అందజేసినట్లు ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు, హెచ్ఎం శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల విచారణ ప్రారంభం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం లబ్ధిదారుల విచారణ ప్రారంభమైంది. బుధవారం నగరంలోని రెండవ డివిజన్ పాండురంగాపురంలో కార్పొరేషన్ సిబ్బంది ప్రజాపాలనలో ప్రజలు అందించిన దరఖాస్తుల జాబితా ఆధారంగా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. వాటిని ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో వివరాలను పొందుపరుస్తున్నారు. తొలి విడతలో ఖాళీ స్థలం ఉండి అద్దె ఇండ్లలో నివాసం ఉంటున్న పేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని అధికారులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, కాలువ నర్సింహారావు, చిన్న మల్లేశం, శీలం శ్రీను, దేగల ఉపేందర్, సిహెచ్ వెంకటేశ్వర్లు, జి. గోపి, చల్లా రాంబాబు, చింతల శ్రీను, రాంబాబు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటిలో విద్యార్థులకు స్వీయ అంచనాలపై పరీక్ష



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విద్యార్థులు తమ లోపాలను గుర్తించి దానికి అనుగుణంగా మార్పు చెందితే ప్రగతి పథంలో దూసుకుపోగలరని ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులకు సూపర్ సెట్ లాంచ్ ప్యాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్థాయి సామర్థ్య పరీక్షలకు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి గుండాల కృష్ణ ప్రసంగించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.జి. ధాత్రి మాట్లాడుతూ ఎస్ఇ, ఇసిఇ, ఇఇఇ, ఎఐఎంఎల్ విభాగాలకు చెందిన 500 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డా.జి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ కోడింగ్, అప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లలో నిర్వహించిన ఈ పరీక్షలో సుమారు ఐదువేల కంపెనీలకు తమ విద్యార్థుల ప్రొఫైల్స్ అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపర్ సెట్ మేనేజర్ నీలాపాల్, కస్టమర్ సక్సెస్ మేనేజర్ శ్రేయాదాస్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే భవిష్యత్తు



ప్రజాపక్షం/కారేపల్లి: విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ అన్నారు. గిరిజన పిల్లల విద్యాభ్యాసం మెరుగుపడి వారి భవిష్యత్తు బాగుపడాలంటే యుఆర్‌జెసి ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. బుధవారం సింగరేణి మండలంలోని గాంధీనగర్ యుఆర్‌జెసి కళాశాలను ఆయన సందర్శించారు. ఎస్‌ఎస్సీ, ఇంటర్మీడియల్ విద్యార్థుల బోధన నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత ఇన్స్టిట్యూషన్లలో డీ గ్రేడ్ పిల్లలను గుర్తించి వారికి సరరెట్గా ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని ప్రోత్సహించాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. గిరిజన పిల్లల భవిష్యత్తు కోసం మనం పని చేయాలన్నారు. ప్రిన్సిపాల్, వార్డెన్ స్థానికంగా ఉండాలన్నారు. పిల్లలకు సక్రమంగా విద్యాబుద్ధులు నేర్పించి విద్యాభివృద్ధికి సహకరించి పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు నా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్సిఓ గురుకులం నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, డిప్యూటీ వార్డెన్ పాషా, ఫ్యాకల్టీలు గామయ్య తదితరులు పాల్గొన్నారు

# పొరపాట్లు లేకుండా పక్కాగా గ్రూప్–2

28,101 మంది అభ్యర్థులు,
85 పరీక్షా కేంద్రాలు
అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా పక్కాగా గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి గ్రూప్ 2 పరీక్షా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 15, 16 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు సెషన్లలో గ్రూప్ 2 పరీక్షలు జరుగుతాయన్నారు. ఖమ్మం జిల్లాలో 28,101 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షలకు హాజరు కానున్నారని వారి కోసం జిల్లాలో మొత్తం 85 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఇద్దరు రీజినల్ కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాలు పనిచేస్తాయన్నారు. విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.చిన్నయ్య, రీజినల్ కో ఆర్డినేటర్ 1గా 40 పరీక్షా కేంద్రాలు, ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జి. రాజ్‌కుమార్, రీజినల్ కో ఆర్డినేటర్ 2గా 45 పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్ పని చేస్తుందని తెలిపారు. ప్రశ్నా పత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు వీలుగా ఎంపిడిఒలను జాయింట్ రూట్ అధికారులుగా, మూడు నుంచి ఐదు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు తహసీల్దార్లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులుగా నియమించామన్నారు. స్ట్రాంగ్‌రూముల వద్ద అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. డిసెంబర్ 14న పరీక్షల నిర్వహణపై పరీక్షా కేంద్రాల వారీగా చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు సమావేశాలు నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. సమయం ముగిసిన తర్వాత ఎవరిని లోనికి అనుమతించడం జరగదన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలను, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసి ద్వారా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరేలా చూడాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను ఒక రోజు ముందుగానే వెళ్లి చెక్ చేసుకునేలా ప్రచారం చేయాలన్నారు. అభ్యర్థులు క్యాలిక్యులేటర్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, జ్యూయలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామాగ్రిని తీసుకు రావడానికి వీలు లేదని, చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని తెలిపారు. పోలీస్ బందోబస్తుతో ప్రశ్నాపత్రాల తరలింపు ఉండాలని తెలిపారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫై చేయాలని, అభ్యర్థుల వివరాలతో కూడిన ఒఎంఆర్ షీట్లు వచ్చాయని వాటిని సరైన అభ్యర్థులకు అందేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ రాజేశ్వరి, ఎసిపి ఎన్.నర్సయ్య, రీజినల్ కో ఆర్డినేటర్లు డా.వి. చిన్నయ్య, డా.జి.రాజ్‌కుమార్, డిఎంహెచ్ఒ బి.కళావతిబాయి, కలెక్టరేట్ ఎఒ అరుణ, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, రవాణా శాఖ, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎంపిడిఒలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## సిఎం కప్ పోటీలు ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ మైదానంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించనున్న సిఎం కప్ క్రీడా పోటీలను ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సిఎం కప్ క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు పోటీలను నిర్వహిస్తుందన్నారు. కబడ్డీ, ఖోఖో,వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్‌రెడ్డి, కోచ్‌లు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రతిభ కనబరిస్తేనే గుర్తింపు






క్రీడా, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులు రాణించాలి
ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : ప్రతిభతోనే గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడా, సాంస్కృతికరంగాలపై దృష్టి సారించి రాణించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని ప్రగతి మైదానంలో సిఎం కప్ జిల్లాస్థాయి క్రీడలను బుధవారం కూనంనేని ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న క్రీడల్లో నైపుణ్యాన్ని సంపాదించుకొని విజయాలు సాధించాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే తగిన గుర్తింపు లభిస్తుందని, ఉద్యోగావకాశాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడా, సాంస్కృతిక రంగాల వైపు ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి సమాజానికి పరిచయం చేయాలన్నారు. సిఎం కప్ జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానం సంపాదించుకొని జిల్లాకు పేరు తేవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ వైస్ చైర్మన్ షేక్ సాబీర్‌పాషా, ఎంఇఒ దయాళ్, మున్సిపాల్ కమీషనర్ శేషాంజన్ స్వామి, సిపిఐ వార్డు కౌన్సిలర్లు బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, నాయకులు మాచర్ల శ్రీనివాస్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టు సంఘాల ఆందోళన

మోహన్‌బాబుపై చర్యలకు డిమాండ్
సిపికి వినతి పత్రం ఇచ్చిన ఐజెయు
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు



ప్రజాపక్షం/ఖమ్మం : సినీ నటుడు, నిర్మాత మోహన్‌బాబు జర్నలిస్టుల పట్ల వ్యవహరించిన ధోరణికి నిరసనగా టియుడబ్ల్యుజె (ఐజెయు) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఖమ్మంలో ఐజెయు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సిపి సునీల్ దత్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు మాట్లాడుతూ జర్నలిస్టుల పట్ల మోహన్‌బాబు వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్లేకార్డులు చేబూని నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేసిన అనంతరం ఆందోళనకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు రక్షణ లేకుండాపోతుందని సమాజంలో గుర్తింపు పొందిన వారు సైతం అవగాహన లేకుండా దాడులకు పాల్పడడం శోచనీయమన్నారు. టివి9, టివి 5, జర్నలిస్టులపై దాడికి పాల్పడిన మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నియోజక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, నాయకులు శివానంద, మోహినుద్దీన్, జనార్ధానాచారి, భూపాల్, అయ్యప్ప, మహేందర్, వేణుగోపాల్, కళ్యాణ్, రమేష్, ఉపేందర్‌రెడ్డి, నామ పురుషోత్తం, సాయి శ్రీధర్, ఆలస్యం అప్పారావు, సుధాకర్, సంపత్, గణేష్, పృథ్వీ, వినయ్, ఫయాజ్, బుర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టిజెఎఫ్ ఆధ్వర్యంలో విలేకరులపై దాడికి నిరసనగా ఖమ్మంలో ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్తూపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఆందోళణకారులను ఉద్దేశించి టిజెఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ పోలీస్ అధికారులు తక్షణం జోక్యం చేసుకుని మోహన్‌బాబు, ఆయన అనుచరులపై తక్షణం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మోహన్‌బాబు జర్నలిస్టులపై దాడి చేయడం హేయమని ఆదినారాయణ తెలిపారు. జర్నలిస్టులపై దాడులు కొనసాగితే ఆందోళనను తీవ్ర తరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిర్రా రవి, నాయకులు వై. సాంబ శివరావు, నాగేంధర్, రజనికాంత్, ప్రశాంతరెడ్డి, రమేష్, కోటేశ్వరరావు, జగదీష్, అశోక్, చక్రవర్తి, జానిపాషా, గోపి తదితరులు పాల్గొన్నారు.

**నేలకొండపల్లిలో :** మోహన్‌బాబు జర్నలిస్టులపై దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ టియుడబ్ల్యుజె(ఐజెయు) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి పోలంపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేసిన మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టియుడబ్ల్యుజె యూనియన్ నాయకులు పి. కోటయ్య, ఆంజనేయులు, వి. వెంకటేశ్వర్లు, తుమ్మా ఉపేందర్, రాంబాబు, మల్లెబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.





## రేపు సిపిఐ జిల్లా సమావేశం

ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 13న ఉదయం 10 గంటలకు ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. 12గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హాజరవుతారని సురేష్ తెలిపారు. పార్టీ సభ్యత్వం, పార్టీ ఆవిర్భావ దినోత్సవం, నల్గొండ సభ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని సురేష్ తెలిపారు.

## నేడు వర్గీకరణపై బహిరంగ విచారణ

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎస్‌సి వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ గురువారం ఖమ్మంజిల్లాకు విచ్చేసి షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ చేయనున్నారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ కమిషన్ డా.జస్టిస్ షమీమ్ అక్తార్ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని షెడ్యూల్ కులాల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై వినతులు అందజేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆటో, రిక్షా కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం : డిఎంహెచ్ఒ

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆటో, రిక్షా కార్మికులకు ఈనెల 12న గురువారం, 13న శుక్రవారం రెండు రోజులు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతిబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నగరంలోని మూడుప్రాంతాలు భక్తరామదాసు కళాక్షేత్రం, నయాబజార్ హైస్కూల్ గ్రౌండ్, ఆర్టీవో కార్యాలయం గట్టయ్య సెంటర్ నందు రెండు రోజుల పాటు ఈ వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. జిల్లాలోని ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్యశిబిరంలో పాల్గొని ఆరోగ్య స్థితి గతులు తెలుసుకుని తగిన పరీక్షలు, చికిత్సలు చేయించుకోవాలని డిఎంహెచ్‌వో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని ఆమె తెలిపారు. వైద్య శిబిరాన్ని ఆటో, రిక్షా కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# పైసలిస్తేనే అనుమతులు..!

అవినీతికి పాల్పడుతున్న ఓ ఉన్నతాధికారి
అక్రమాన్ని సక్రమం చేస్తున్న వైనం
ఖమ్మంరూరల్‌లో యథేచ్ఛగా భవన నిర్మాణల్లో నిబంధనల ఉల్లంఘన
ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ప్రజల విన్నపం

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌: ఖమ్మంరూరల్ మండలంలో భవన నిర్మాణ అనుమతుల మాటున అక్రమాల పర్వం యథేచ్ఛగా సాగుతుంది. ఓ ఉన్న తస్థాయి అధికారి ఇద్దరు ప్లానర్ల ద్వారా అవినీతికి పాల్పడుతున్న తీరు విస్తుగొల్పుతుంది. అన్ని సక్రమంగా ఉండి అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే రాని అనుమతులు ఆ ఇద్దరి వద్దకు వెలితే వస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. అలాగే భవన నిర్మాణాల్లో జరిగిన నిబంధనల ఉల్లంఘనపై చర్యలకు బదులు అమ్యామ్యాలు తీసుకుని అక్రమాన్ని సక్రమం చేస్తున్నారు. అధికారులు అశీస్సులను ఆసరాగా చేసుకొని, బిల్డర్లు, బడాబాబులు నిబంధనలకు తీలోదకాలు ఇస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ఈ వ్యవహారంపై ఏసీబీ దృష్టి సారిస్తే తప్ప ఆగే పరిస్థితులు కనిపించడం లేదు.

**లోపించిన పారదృకత...** భవన నార్మాణ అనుమతులలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేయడానికి, గత ప్రభుత్వం టిఎస్‌బిపాస్‌ను తీసుకువచ్చింది. అనుమతులన్ని పారదర్శకంగా ఇవ్వాలని అందుకు ఓ ఉన్నత స్థాయి అధికారికి బాధ్యతలను అప్పగించింది. కానీ సదరు అధికారి అనుమతుల మాటున అమ్యామ్యాలకు తెరలేపారు. అంతేకాకుండా నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సింది పోయి. అనుమతులలో లొసుగులను అడ్డం పెట్టుకుని, అక్రమాలను సక్రమం చేస్తూ అందినకాడి దండుకుంటున్నారు. ఈ పనులను చక్కబెట్టేందుకు ఇద్దరు ప్లానర్ల ద్వారా చక్కదిద్దుకుంటున్నారు. అనుమతులైన, అక్రమ భవన నిర్మాణాల్లో లోపలైనా..సారు తరుపున ఆ ఇద్దరు మాట్లాడి స్వకార్యంతో పాటు స్వామికార్యాన్ని సైతం చేస్తున్నారు. ఇందులో మాత్రం సార్ కొంత నిజాయితీని కనబరుస్తున్నారు...తనకు పరిచయాలు ఉన్న వారి పనులు వెంటనే చేస్తూ...ప్రభుత్వానికి కట్టాల్సిన ఫీజులోను కొంత వెసులుబాటును కల్పిస్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి.

**ఉల్లంఘనపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం...** ఇల్లు, అపార్ట్‌మెంట్, పరిశ్రమ ఇలా ప్రతి నిర్మాణాలలో చోటు చేసుకుంటున్న ఉల్లంఘనాలపై చర్యలు తీసుకోవడంలో పూర్తి స్థాయి నిర్లక్ష్య వైఖరిని కనబరుస్తున్నారు. అధికారుల సాక్షిగా అనుమతులే లేని పెంట్‌హౌజ్‌లో పుట్టగొడుగొల్లా పట్టుకొస్తున్నాయంటే ఉల్లంఘనలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని, ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా ఉదాసీనతను కనబరుస్తున్నాట్లు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనపై పోలిటికల్ నాయకులు సమాచారం ఇస్తే వారి పేర్లను ప్రత్యర్థి పార్టీ నేతలకు చెబుతూ ఘర్షణలకు కారణమవుతున్నారు. సామాన్యులు పూరి గుడిసె కట్టుకుంటే నిబంధనలు లేవని నిర్మాణాలు కూల్చివేస్తున్నారు. అదే బడాబాబులో, బిల్డర్‌లో నిర్మాణం చేపడితే మాత్రం వారితో చీకటి ఒప్పందాలను కదుర్చుకుంటున్నారు. పేదోడికి చట్టం..పెద్దోడికి చుట్టం అనేలా వ్యవహరిస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**అడిగినంత ఇవ్వలేదని ఆగిన పని...** ఖమ్మం రూరల్ మండలంలోని కార్పొరేషన్ విలీనం అయ్యి..మరల గ్రామ పంచాయతీకి ఆవిర్భవించిన ఓ మేజర్ పంచాయతీలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన స్థలంలో రెండు ఇండ్లను నిర్మాణం చేసుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం తన మొత్తం ప్లాట్‌కు ప్రభుత్వ చలాన ప్రకారం డబ్బులను కట్టాడు. కానీ ప్లాట్ మొత్తం ఇళ్ల నిర్మాణం చేసుకోకుండా..కొంత స్థలాన్ని వదిలేశాడు. కొంతకాలం తర్వాత అందులో ఓ చిన్నపాటి ఇంటిని నిర్మాణం చేశాడు. దానిని చాలన కట్టి సబ్‌రిజిస్ట్రార్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఇంటి నెంబర్ విషయమై ఓ కార్యదర్శిని సంప్రదించగా..ఇందులో కొంత సమస్య ఉన్నది ఇది మా ఉన్నతాధికారి చూడాలని బదులిచ్చాడు. ఆయన మాట ప్రకారమే సదరు ఇంటి యజమాని, సార్‌ను కలిసి పరిస్థితిని వివరించగా..పరిశీలన చేస్తానని సమాదానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో జాప్యం జరుగుతుండగా...అతని మిత్రుడు ఓ ప్లానర్ దగ్గరకు వెళితే పనవుతుందని, సలహా ఇచ్చాడు. దీంతో ప్లానర్ కలిసిన యజమానిని డబ్బులు ఇస్తే పనవుతుందని చెప్పాడు. దీనిపై సదరు యజమాని అడిగినంత ఇచ్చుకోలేనని చెప్పడంతో పని పక్కన పెట్టేసిన వైనం తాజాగా చోటు చేసుకుంది.

# సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మంచాల తిరుపతి మృతి

నివాళులు అర్పించిన చాడ వెంకట్ రెడ్డి, తక్కళ్లపల్లి, నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** మండలంలోని వంగర గ్రామంలో సిపిఐ హనుమకొండ జిల్లా కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ మంచాల తిరుపతి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ల పల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదుమనూరి జ్యోతి, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ హనుమకొండ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్,మండ సదాలక్ష్మి ,జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి,మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మన్, మునిగాల బిక్షపతి,నాయకులు బత్తిని సదానందం, నేదునూరి రాజమౌళి, ఆదరి రమేష్, రావుల తిరుపతి, బోడ బాలరాజు, మర్రి శ్రీనివాస్, తదితరులు మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాడ, తక్కళ్లపల్లి మాట్లాడుతూ మండలంలో మంచి నాయకున్ని కోల్పోయామని అన్నారు. మండలంలో గ్రామం వంగర లో కామ్రేడ్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు మంచాల తిరుపతి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉండి బుధవారం మృతి చెందగా నివాళులు అర్పించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించిన వారిలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు నాయకులు గడ్డం లలిత, మహేంద్ర, హనుమకొండ మండల కార్యదర్శి కేశపోయిన శ్రీనివాస్,హసన్పర్తి మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, ఎర్ర కుమారస్వామి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు సంతాపాన్ని వ్యక్తం చేసినారు. వారి కుటుంబానికి ధైర్యాన్ని నింపినారు.కరీంనగర్ ఉమ్మడి జిల్లా విద్యార్థి నాయకునిగా తెలంగాణ విప్లవ ఉద్యమంలో పని చేసి పలు కార్మిక సంఘాలకు నాయకునిగా, ప్రస్తుతం భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సమితి సభ్యునిగా పనిచేస్తున్న మంచాలమృతి పార్టికి తీరని లోటన్నారు.



## 14న భూపాలపల్లిలో మంత్రుల పర్యటన

హెలీప్యాడ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఈనెల 14న భూపాలపల్లి నియోజకవర్గంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ పర్యటన ఉంటుందని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం రామన్నగూడెం క్రాస్ వద్ద హెలీ ప్యాడ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని భూ పాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ, పోలీసు అధికారులు పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారుల కు సూచించారు. నిర్మాణ పనులు జాప్ ఏం చేయకుండా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆర్ అండ్ బీ డీఈ గౌస్ పాషా, చిట్యాల సర్కిల్ సిఐ మల్లేష్, రేగొండ ఎస్సై సందీప్ కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటా

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




**ప్రజాపక్షం/రాయపర్తి :** కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త ఎండి మన్సూర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా బుధవారం బిఆర్ఎస్ పార్టీ నుండి మంజురైన రూ.2 లక్షల రూపాయల బీమా చెక్కును మృతుని భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనే పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడంలో బిఆర్ఎస్ పార్టీ ముందుంటుందని అన్నారు. ఇటీవలే దేవరుప్పుల లో నష్టపోయినా రైతుకు 5 లక్షలు, పాలకుర్తి లో చనిపోయిన శ్రీను కుటుంబానికి 3 లక్షలు ఇచ్చిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కంటికి రెప్పలా కాపాడుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మునావత్ నర్సింహా నాయక్, డిఆర్ఎస్ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మాజీ రైతు బంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్ రావు, పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు తదితరులు పాల్గొన్నారు.

## కో ఆపరేటివ్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌ను చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావుతో కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ కో ఆపరేటివ్ బ్యాంక్ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా నిలవాలని కోరారు. అనంతరం వారు బ్యాంక్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పోకల జమున లింగయ్య, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు

నూతన పరిజ్ఞానంతో విద్యాబోధన చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాను అభివృద్ధి చేస్తా : మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కేటాయింపు నిధులతో సరిపోదని, స్వచ్ఛంద సంస్థల ద్వారా పలు కార్యక్రమాల ద్వారా అభివృద్ధి సాధించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశపు మందిరంలో క్వాల్ కంపెనీ, ట్రాన్స్‌ఫారం పాఠశాలల యాజమాన్యం సంయుక్తంగా 9,10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన పాఠశాల బోధనలను బోధించడానికి ఇంగ్లీష్, గణితం, సైన్స్ పాఠాలను బోధించే అధ్యాపకులకు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించే సందర్భంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ మహేందర్ జి, ఐటిడిఎ పిఒ చిత్రామిశ్రా, ప్రిన్సిపాల్ ఎన్‌కైనర్, క్వాల్ కమ్ సుధీర్‌కుమార్ సుంకర, ప్రోగ్రాం డైరెక్టర్ శ్రద్ధా ఝూ, హెడ్ ప్రోగ్రాం, క్వాలిటీ ఇంప్లిమెంటేషన్ స్పెషలిస్ట్, నేహారానాలతో కలిసి పుస్తక ఆవిష్కరణ చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు నూతన పరిజ్ఞానంతో విద్యాబోధన చేస్తే విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అన్నారు. అన్ని రంగాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం కేటాయించే నిధులు సరిపోతున్నప్పటికి స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థిని, విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో విద్యను బోధించడానికి ఉపాధ్యాయులకు స్వచ్ఛంద సంస్థల వారు శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం ఆశించదగ్గ విషయమని అన్నారు. ప్రపంచ విషయాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు తెలుసుకున్నప్పుడే విద్యాబోధన మెరుగుపడినట్లు అవుతుందని, ఈ విషయంలో గ్రామీణ ప్రాంతాలంలో విద్యను బోధించే ఉపాధ్యాయులు చొరవ చూపాలని కోరారు. ఆ రెండు సంస్థలు రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ములుగులో నిర్వహించడం జిల్లా కలెక్టర్ కృషి యేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచంద ర్, డిఇఒ పాణిని, మేనేజర్ లీడర్‌షిప్, కమ్యూనిటీ ప్రో గ్రాం పాండా, 20 పాఠశాలలు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠ్యపుస్తకాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిత్యం కార్మిక సమస్యలపై పోరాడేది ఎఐటియుసినే

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** స్ట్రక్చర్ మీటింగ్‌లో భూపాలపల్లి ఏరియాలో కార్మిక సమస్యలపై యాజమాన్యంతో చర్చించడం జరిగిందని, కార్మికుల పక్షాన నిత్యం పోరాడేది ఎఐటియుసి సంఘమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుర్తింపు సంఘం యూనియన్ తో యాజమాన్యం నిర్వహించిన స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన సమస్యలపై విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, భూపాలపల్లి ఏరియాలో ఉన్న అనేక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని అందుకు యాజమాన్యం అంగీకరించిందని అన్నారు. భూపాలపల్లి ఏరియా సింగరేణి ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని, ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేసి డాక్టర్ల కొరతను నివారించాలని అన్నారు. కృష్ణ కాలనీ కార్లమర్క్స్, కృష్ణ కాలనీ డిస్పెన్సర్లను రెగ్యులర్‌గా నడపాలని, రామప్ప కాలనీలో నూతన డిస్పెన్సరీలను ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఏరియా ఆసుపత్రిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో నెలవారీగా మీటింగ్ నిర్వహించాలని కోరడం జరిగింది. హాస్పిటల్ సిబ్బంది ఆదనపు సమయం సేవలకు ఓటి, ఓడి చెల్లించాలన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో క్వార్టర్స్ సమస్యలు అనేకం ఉన్నాయని క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయని, వైరింగ్, గ్రూప్ బోల్ట్ లీకేజీలు తలుపులు, కిటికీలు ఇతర సివిల్ రిపేర్లు చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. రామప్ప కాలనీలో ఓపెన్ జిమ్, స్విమ్మింగ్ పూల్, కూరగాయల మార్కెట్, స్మశాన వాటిక, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. కేటికే ఓసి త్రీలో సిమ్ 2 నుండి సిమ్ 3 టన్నెల్ రైడింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. కమ్యూనిటీ హాల్స్ లలో సదుపాయాలు కల్పించాలని జిల్లా కేంద్రంలో ఉన్న అన్ని ఫంక్షన్ హాల్‌లను ఏసి ఫంక్షన్ హాల్‌గా మార్చాలన్నారు. మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్ట్రక్చర్ మీటింగ్‌లో కోరడం జరిగిందని తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో కుక్కల, కోతుల బెడదను నివారించాలని కోరడం జరిగిందన్నారు. యాజమాన్యం ఈ అనేక కార్మిక సమస్యలను దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో కార్మికుల పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహించేది ఎఐటియుసి కార్మిక సంఘమేనని, కార్మికులంతా ఆదరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం స్పందించిన జిఎంకు ఎఐటియుసి పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియుసి బ్రాంచ్ కమిటీ నా యకులు నూకల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## దాడులు చేస్తే కేసులు పెట్టాల్సిందే

మోహన్ బాబును అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ వద్ద నల్ల బ్యాడ్జీలు, హెల్మెట్లు ధరించి జర్నలిస్టుల నిరసన

**ప్రజాపక్షం/హనుమకొండ :** మీడియా ప్రతినిధులపై దాడి చేసి విచక్షణా రహితంగా వ్యవహరించిన నటుడు మంచు మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న టీవీ9 జర్నలిస్ట్ రంజిత్, టీవీ 5 కెమెరామెన్ సూర్యం, ఈటీవీ కంట్రిబ్యూటర్లపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేసిన ఘటనను ఖండిస్తూ జర్నలిస్ట్ యూనియన్ల నేతలు, పలువురు జర్నలిస్టులు నల్లబ్యాడ్జిలు, హెల్మెట్లు ధరించి భారీ నిరసనకు దిగారు. కేంద్రం స్పందించి ఆయనకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నటుడు మోహన్ బాబు, ఆయన అనుచరుడి వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులపై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. మోహన్ బాబును అరెస్టు చేసి చేయాలని, ఆయనపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జిలు, తలలకు హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకొని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేణుమాధవ్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, టియుడబ్ల్యుజె 143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిఆర్. లెనిన్, జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, సీనియర్ జర్నలిస్టులు గిడుగు కృష్ణమోహన్, పొగాకుల అశోక్, కేకే, టియుడబ్ల్యుజె 143 వరంగల్ జిల్లా కన్వీనర్ కక్కర్ల అనిల్ కుమార్ గౌడ్, జర్నలిస్టులు పబ్బు సతీష్, వేణు, తిరుపతి, వెంకటరత్నం, రవిచంద్ర, చేతి శ్రీనివాస్, గొట్టె వెంకన్న, వేణుప్రసాద్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోకారపు శ్యాంకుమార్, బొడిగ శ్రీను, సహాయ కార్యదర్శి పొడిచెట్టి విష్ణువర్ధన్, ఇసి మెంబర్లు గుండబోయిన దిలీప్, దొమ్మటి శ్రీకాంత్, జనగాని ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ, భూపాలపల్లి ప్రభుత్వం పాఠశాలలో వున్న వంట గది శిథిలావస్థకు చేరుకుంది అని అన్నారు. అంతేకాకుండా భోజనం రుచికరంగా లేకపోవడంతో విద్యార్థులు ఇంటి వద్ద నుండే భోజనం తెచ్చుకుంటున్నారన్నారు. భోజనశాల (డైనింగ్ హాల్) నిర్మాణం సగంలోనే ఆపడంతో విద్యార్థులు తరగతి గదిలోనే భోజనం చేస్తున్నార న్నారు. విద్యార్థులకు సరైనా మూత్రశాలలు మరుగుదొడ్లు లేవన్నారు. కనీసం చేతులు కడుక్కోవడానికి కూడా సదుపాయాలు లేవని, వెంటనే స్థానిక ఎమ్మెల్యే పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనియడల ఆందోళన పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు.

## 16 కేంద్రాలలో 'గ్రూప్-2'కు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జిల్లాలో గ్రూప్2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్‌హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌లతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గ్రూప్2 పరీక్ష నిర్వహణ, బమోమెట్రిక్ విధానంపై చీఫ్ సూపరింటెంట్‌లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, లోకల్, జాయింట్ రూట్ అధికారులు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్‌లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 783 గ్రూప్2 పోస్టులకు గాను 4 పేపర్ల వారీగా ఈనెల 15, 16వ తేదీలలో ఉదయం 10 గంటల నుండి 12:30 గంటల వరకు పేపర్ 1, 3 పరీక్షలు జరుగుతాయని అదేవిధంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ 2,4 పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 5471 మంది అభ్యర్థులు 16 పరీక్ష కేంద్రాలలో గ్రూప్2 పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎసిపి పార్థసారథి, డిడబ్ల్యుఒ ఫ్లోరెన్స్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, విద్యుత్ ఎస్ఇ వేణుమాధవ్, డిఎంహెచ్ఒ మల్లిఖార్జున్‌రావు, డిఎఒ రామారావు నాయక్, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రూప్- 2 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గ్రూప్ 2 పరీక్ష నిర్వహణలో ఎలాంటి మాల్ ప్రాక్టీసు, అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఒసి కార్యాలయంలో గ్రూప్– 2 పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపర్ వైజర్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూటు అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 15,16 తేదీల్లో గ్రూప్–2 పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 1:30 గంటల నుండి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పరీక్షా కేంద్రాల్లో 4423 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది ఉదయం 6 గంటలకు పరీక్షా కేంద్రాల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు. 17 పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. 17 మంది చీఫ్ సూపర్ వైజర్లు, 37 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఒక బయోమెట్రిక్ సూపర్ వైజర్‌తో పాటు 17 మంది అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. 10 మంది దివ్యాంగ అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని వారికి ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన అభ్యర్థులను స్క్రైబ్స్‌గా నియమించనున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యేక గదిని కేటాయించాలని, వారికి అదనపు సమయం ఇవ్వాల్సి ఉందన్నారు. అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఏర్పాట్లుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో పరీక్ష జిల్లా నోడల్ అధికారి విజయలక్ష్మి, పోలీస్ నోడల్ అధికారి కిషన్, కో ఆర్డినేటర్ వెంకన్న, విద్యుత్తు శాఖ ఎస్ఇ మల్చూర్, ఆర్‌డిఒ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం, వంటగది, స్టోర్ రూమ్, డార్మెటరీ రూములు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముకాముఖి అయ్యారు. డైనింగ్ హాల్ లో నిరుపయోగంగా ఉన్న ఆర్ఓ ప్లాంటును వెంటనే మరమ్మత్తులు చేపించి వినియోగంలోకి తేవాలని ప్రదానోపాధ్యాయుడిని ఆదేశించారు. విద్యార్థుల స్నానాలకు వేడినీటి కోసం సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. డైనింగ్ హాలు పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధన ద్వారా జరుగుతున్న హిందీ పాఠాన్ని పరిశీలించారు. అర్థం అవుతుందా లేదా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్లు పరిశీలించి, విద్యార్థులు కంప్యూటర్ లో ఏవేమి నేర్చుకున్నారని అడిగి తెలుసుకున్నారు. మంచి పరిజ్ఞానం సాధించాలని కంప్యూటర్ విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు రాజరత్నం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

టియుడబ్ల్యుజె (ఐజెయు)భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీష్, సామంతుల శ్యామ్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సినీ నటుడు మంచు మోహన్ బాబు ఇంటి వద్ద చోటు చేసుకున్న ఘటన కవరేజ్ కోసం వెళ్లిన టి5, టి9 వీడియో జర్నలిస్టుపై మైక్ లాక్కుని మోహన్ బాబు దాడి చేసి కొట్టడం హెయమైన చర్య అని టియుడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామంతుల శ్యామ్, క్యాతం సతీష్‌లు అన్నారు. బుధవారం ఈ మేరకు వారు ఒక ప్రకటనలో ఖండించారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరించడంతో పాటు జర్నలిస్టుపై దాడి చేసిన నటుడు మోహన్ బాబుపై కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టియుడబ్ల్యుజె, ఐజెయు భూపాలపల్లి జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శు లు క్యాతం సతీశ్, సామంతుల శ్యామ్‌లు బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో వారు డిమాండ్ చేశారు.

### జర్నలిస్టులపై సినీనటుడు మోహన్‌బాబు దాడి చేయడం ఘోరం

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** మీడియా కవరేజ్‌లో ఉన్న జర్నలిస్టులపై సినీనటుడు మోహన్‌బాబు దాడి చేయడం ఘోరమని సీనియర్ జర్నలిస్టులు శ్రీబాష్యం శేషాద్రి, పార్నంది వెంకటస్వామి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జనగామ జర్నలిస్టులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సినీనటుడు మంచు మోహన్‌బాబు టీవీ9 మీడియాపై చేసిన దాడిని ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో ఈ నిరసనను నిర్వహించడం జరిగింది. కాసాని ఉపేందర్ అధ్యక్షతన స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబట్టుకుని ఆందోళన ధర్నాను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియాపై దాడిచేసిన మోహన్‌బాబుపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని నినదించారు. ఈ విషయంలో సినీ పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుని సదరు నటుడు మోహన్‌బాబుపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎస్ ఆనంద్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, జాల రమేష్, ఎండబట్ల భాస్కర్, కన్నారపు శివశంకర్, ఉల్లెంగుల మణి, యూసుఫ్, గోపగాని వినయ్‌కుమార్,గణేష్, తదితరులు పాల్గొన్నారు.



### దాడిని ఖండిస్తూ నిరసన

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** హైదరాబాద్‌లో సీనినటుడు మోహన్‌బాబు జర్నలిస్టులపై చేసిన దాడిని ఖండిస్తూ ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్‌లో మంగళవారం మంచు మోహన్‌బాబు మీడియాపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షఫీ అహ్మద్, పిట్టల మధుసూదన్, జంగిలి కోటేశ్వరరావు, గాదం దేవేందర్, జాలిగం శ్రీనివాస్, నర్రా రఘువీర్, ముకులోతు శరత్, మహమ్మద్ జలీల్, మాట్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరు నాటికి ఇందిరమ్మ ఇళ్ల సర్వే

గ్రూప్-2 పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి మొబైల్ యాప్‌ద్వారా నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం తదితరులతో కలిసి మంత్రి పొంగులేటి బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, గ్రూప్2 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు, సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం చేపట్టిన ఇంటింటి సర్వే హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీల పెంపు అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్ధేశం చేశారు. పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వివరిస్తూ ఈనెల 15, 16లలో జరిగే గ్రూప్ 2 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 19854 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, 63 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

## మరదలిపై కత్తితో దాడి చేసిన వదిన

తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలింపు



**ప్రజాపక్షం/ముధోల్:** మండల కేంద్రంలోని సాయిమాధవ్ నగర్ లో ఉంటున్న ఓ ఇంట్లో మరదలిపై వదిన కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. బుర్కా వేషంలో వచ్చి సొంత వదిన అశ్విని మరదలైన తనూజ పై కత్తితో దాడి చేసి తప్పించుకోవాలనుకుంది. ఘటన జరుగుతున్న సమయంలో వచ్చిన శబ్దాలకు పక్కనున్న వారికీ అనుమానం రావడంతో కత్తి దాడికి పాల్పడిన బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భైంసా లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.దాడికి పాల్పడ్డ మహిళను పోలీసులు అదుపులో తీసుకున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ముధోల్ సిఐ మల్లేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన సాయి మాధవ నగర్‌లో విషాదకరం నెలకొంది.

## ఉపాధి హామీ కూలీలకు శిక్షణ



**ప్రజాపక్షం/వాంకిడి:** వాంకిడి మండలములోని మండల పరిషత్ కార్యాలయంలో ఉన్నతి ట్రైనింగ్ లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి లోని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ తిరుపతి, నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని చేసిన కూలీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు వస్తున్నాయని, శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉందని, వ్యవసాయంలో పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని, రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఆ పరీక్షల ఆధారంగానే పంటలు వేసుకోవడం, వ్యవసాయ అధికారుల సూచనల మేరకే మందుల వాడకం చేసినట్లయితే రైతులకు నష్టాలు కలగకుండా లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకోవాలనుకునే రైతులు కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి వారిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి. దత్తారావు హాజరయ్యారు. ఎంపిపిఒ వి. ప్రవీణ్ కుమార్, ట్రైనింగ్ ఇంచార్జ్, హెచ్‌ఆర్ మల్లేష్, ఐకెపి ఎపిడి రామకృష్ణ, ఎపిఒ శ్రావణ్ కుమార్, ఎపిఎం మహేష్, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

## ఈ నెల 29న 'చలో హైదరాబాద్' సదస్సు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** గిరిజన సంక్షేమ శాఖలో 2685 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా పూల్ సింగ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవన్, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలికలు లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 24 సంవత్సరాలుగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో 2100 కాంట్రాక్టు ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 491 మంది కాంట్రాక్టు బోధినేతర ఉద్యోగులు, 94 మంది గిరిజన సహకార సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగాలు సేవలందిస్తున్నారని ఈ కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలనే ఉద్దేశంతో ఈనెల 29న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రెగ్యులర్ చేస్తామని మభ్యపెట్టి మోసం చేశారని వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల ఎర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు సంఘం జిల్లా అధ్యక్షులు కొమురెల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి జర్పుల విజేశ్, అత్రం పెంటయ్య, శంకర్ దేవ్, లావుడియా రమేష్, శ్రీనివాస్, ప్రకాష్ రాథోడ్, గురుకులం బోధ నేత్ర సంఘం నాయకులు ఎల్లాది బక్కయ్య, గోగుల నగేష్, ఆడ వెంకటేష్, బండి వెంకటేష్ లతో పలువురు కాంట్రాక్టు ఉపాధ్యాయులు, బోధ నేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఈ నెల 13న మినీ జాబ్ మేళా

**ప్రజాపక్షం/మంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాల ఆవరణలో గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిరుద్యోగ యువతకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ. రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్ ఫౌండేషన్ రిసర్చ్ సెంటర్‌సికింద్రాబాద్ సంస్థలో హైదరాబాద్‌లో పని చేసేందుకు 20జనరల్ డ్యూటీ అసిస్టెంట్, 20హాస్పిటల్ బిల్డింగ్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని, అభ్యర్థులు జనరల్ డ్యూటీ అసిస్టెంట్ పోస్టు కొరకు ఎస్.ఎస్.సి. ఉత్తీర్ణులై ఇంటర్ పాస్/ఫెయిల్, హాస్పిటల్ బిల్డింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టు కొరకు డిగ్రీ పూర్తి చేసి 1829 సంల మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. వివరాలకు 8247255859, 8019816641, 9110368501 లో సంప్రదించవచ్చని, అర్హత గల అభ్యర్థులు సకాలంలో జాబ్మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు గూడు కల్పించాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో దరఖాస్తుదారుల వివరాలు, భూ సంబంధిత డాక్యుమెంట్లు, ఇతర వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇ డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్, హౌసింగ్ డిఇ వేణుగోపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/హత్నూర:** హత్నూర మండలం కోడిప్యాక గ్రామానికి చెందిన మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా మంజూరైన 60 వేల చెక్కును ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా వారికి అందజేశారు. పేదలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ఎంతో మేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వావిలాలల నర్సింలు, కొన్యాల నరసింహారెడ్డి, అగమయ్య ,బాలు యాదవ్ ,సురేష్‌గౌడ్, అర్జున్ ,సాజిత్, కృష్ణాగౌడ్,తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టులో పిట్లం విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/పిట్లం:** కామారెడ్డి జిల్లాలో టీఎంఎఫ్ గణిత ఫోరం ఆధ్వర్యంలో బుధవారం గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో పిట్లం మండలంలోని చిల్లర్గి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న డి.పూజ ద్వితీయ స్థానం, జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న జి.స్వరాజ్య లక్ష్మీ కి తృతీయ స్థానం సాధించినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. వీరిని చిల్లర్గి గణిత ఉపాధ్యాయులు బన్సీలాల్, పిట్లం గణిత ఉపాధ్యాయులు టి.రాజులకు ఉపాధ్యాయబృందం అభినందనలు తెలియజేశారు.

## వాంకిడి ఆశ్రమ పాఠశాలలో మళ్లీ అస్వస్థత



**ప్రజాపక్షం/వాంకిడి :** ఆశ్రమ పాఠశాలల విద్యార్థులపై అధికారుల నిర్లక్ష్య ధోరణి కొనసాగుతూనే ఉంది. గత వారం రోజుల క్రితం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు అధికారుల నిర్లక్ష్యంతో అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరగా చికిత్స పొందుతూ శైలజ మృతి చెందిన పాఠశాల ల్లోని అధికారుల తీరు మారడం లేదు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందొర్ మారుతి, మండల నాయకులు వెళ్లి విద్యార్థినిల పరిస్థితిని గమనించగా పాఠశాల లోని ఐదుగురు విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారు అని తెలుసుకొని హుటాహుటిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినిలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను ఏమాత్రం పట్టించుకోకుండా చిత్తశుద్ధి లేకుండా అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత నెల అస్వస్థతతో విద్యార్థిని మరణించిన కూడా ప్రభుత్వానికి బుద్ధి లేదని, ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రాణాలతో ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ నాయకులు చలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి మార్చుకోవాలని, ఏ ఒక్క విద్యార్థినికి హాని జరిగిన పరిణామాలు తీవ్రంగా హెచ్చరించారు. వైద్యులు అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల నాయకులు కోట్నక రాంశావ్, కనక ప్రకాష్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

అదనపు కలెక్టర్ నగేష్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం, వంటగది, స్టోర్ రూమ్, డార్మెటరీ రూములు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముకాముఖి అయ్యారు. విద్యార్థులు చదువులో బాగా రాణించాలని మంచి మార్కులు సాధించి ఉన్నతస్థాయికి వెళ్ళాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పరిశుభ్రత పాటించాలనీ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని వార్డెన్ ను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇన్చార్జి ప్రిన్సిపల్ పద్మావతి, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## జిల్లా సమాఖ్య భవన నిర్మాణానికి స్థల కేటాయింపు



**ప్రజాపక్షం/నిజామాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని డీఆర్‌డీఓ కార్యాలయంలో బుధవారం డీఆర్‌డీఓ సాయగౌడ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం జిల్లా సమాఖ్య నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలో ఇట్టి నూతన జిల్లా సమాఖ్య భవన నిర్మాణానికి ఒక ఎకరం స్థలాన్ని కూడా కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమకు నూతన భవన నిర్మాణం కోసం స్థలం, నిధులు కేటాయించినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ధన్యవాదాలు తెలిపారు. మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా సంఘాల్లో లేని వారిని సంఘాలలో చేర్పించాలని సూచించారు.కార్యక్రమంలో సంస్థాగత నిర్మాణం, బ్యాంకు లింకేజీ శ్రీనిధి, పామ్, నాన్‌పామ్ మండల సమాఖ్య, గ్రామ సమస్యల ఆడిట్ మొదలగు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సాయగౌడ్, సెర్ప్ అధికారి భారతి, డీపీయంఎలు సంధ్యరాణి, సాయిలు, శ్రీనివాస్, మారుతి, శ్రీనిధి ఆర్‌ఎం రాందాస్, ఎపియం సరోజిని, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, కార్యదర్శి లావణ్య, కోశాధికారి లక్ష్మీ , 28 మండల సమాఖ్యల అధ్యక్షులు పాల్గొన్నారు.

## వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లింపు




**ప్రజాపక్షం/జన్నారం:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయాన్ని బుధవారం విద్యార్థులతో ముచ్చటించి, ధర్నా చేశారు.ఆ తర్వాత ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ గణేష్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని ఏండ్ల నుండి డిగ్రీ కాలేజ్ డిమాండ్ ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడం వల్ల ప్రతి ఏటా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న సుమారు 300 మంది విద్యార్థులు డ్రాప్ ఔట్స్ గా మిగులుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపుగా 3ఏండ్ల నుండి ఫీజు బకాయిలు విడుదల కాక విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యమంత్రి స్వయంగా పిసిసి రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఇప్పుడు ఉన్న స్కాలర్ షిప్స్ పెంచి విద్యార్థులకు ప్రస్తుత ధరలకు అనుకుణంగా అందిస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాత్రం దాన్ని విస్మరించారని ఆయన గుర్తు చేశారు. విద్యారంగంలో పలు సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యాశాఖను తమ వద్ద ఉంచుకున్న ముఖ్యమంత్రి విద్యాశాఖ మీద సమీక్ష చేయకపోవడం అన్యాయమని, వెంటనే రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంజిత్, మహేష్, నగేష్, తిరుపతి, మహేశ్వరి, కరుణాకర్,దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## మనిషి తలరాత మార్చేదే భగవద్గీత



**ప్రజాపక్షం/గజ్వేల్:** గీత జయంతి సందర్భంగా బుధవారం గజ్వేల్ శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గీతా జయంతి పూజలు ఘనంగా నిర్వహించి భక్తులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ, భగవద్గీత మానవ జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ సాహిత్యంలో భగవద్గీతను మించిన గ్రంథం లేదని స్పష్టం చేశారు. మనిషి పరమపద ప్రయాణానికి కావలిసిన సాధన సంపత్తి, నేర్చుకోవాల్సిన జ్ఞానం భగవద్గీత బోధిస్తుందని తెలిపారు. గీతా సారం ఒకటేనని, దానిని ఆచరించి మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో రామకోటి ప్రతినిధులు పాల్గొన్నారు

## ఆర్మూర్‌లో దొంగల హల్చల్

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మునిసిపల్ కేంద్రంలోని పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోని జీవన్‌రెడ్డి మాల్ పక్కనున్న దుకాణాలలో దొంగలు బీభత్సం సృష్టించారు. చోరీ విషయం తెలుసుకున్న దుకాణ సముదాయాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికిచేరుకొని పరిశీలించారు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ వివరాలు తెలిపిన ప్రకారం బుధవారం తెల్లవారుజామున మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్ 04 బిడి 2763 గల వాహనంలో దొంగలు మూడు వ్యాపార సముదాయాలు మందుల దుకాణంలో సుమారు మూడు లక్షల రూపాయలు, లైఫ్ కేర్ మందుల దుకాణంలో ముప్పై వేల రూపాయలు, దీపక్ స్కానింగ్ సెంటర్‌లో టెలివిజన్ దొంగతనానికి పాల్పడ్డారని ఎస్‌హెచ్‌వో తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు దొంగలు ముసుగులు ధరించి షట్టర్లు పగులగొట్టి లోనికి ప్రవేశించినట్టు సిసి ఫుటేజీలో స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. దీంతో ఆర్మూర్ పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఆయన తెలిపారు.




## మంచిర్యాలలో వందే భారత్ రైలు హాల్టింగ్‌కు వినతి



**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్:** సికింద్రాబాద్ నాగ్ పూర్ మధ్య నడుస్తున్న వందే భారత్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్ లో హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ బుధవారం ఢిల్లీలో బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నివేదిక మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే లో ఆదాయ పరంగా మంచిర్యాల రైల్వే స్టేషన్ నాన్ సుబర్బన్ గ్రేడ్ రైల్వే స్టేషన్ (ఎన్‌జిఎస్ 4) జాబితా లో 30వ స్థానంలో ఉందని, అత్యధిక ఆదాయం ఉన్న మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత రైలు నిలుపుదల చేయడం లేదని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క రైల్వే స్టేషన్ లో కూడా వందే భారత్ హాల్టింగ్ లేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. రామగుండం, మంచిర్యాల రైల్వేస్టేషన్ మధ్య దూరం తక్కువ ఉందని మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత రైలు నిలుపడం లేదని మరి అదే చంద్రపూర్, బల్లార్ష మధ్య తక్కువ దూరం ఉన్న రెండు స్టేషన్లలో రైలు హాల్టింగ్ సదుపాయం ఉందని వారికి తెలియజేయడం జరిగింది. మంచిర్యాల రైల్వే స్టేషన్ నుండి నిత్యం అనేక మంది వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు హైదరాబాద్, నాగ్‌పూర్ వెళ్తుంటారని మంచిర్యాల రైల్వే స్టేషన్ లో రైలు నిలిపితే రైల్వే సంస్థకు అధిక ఆదాయం రావడంతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది కావున ఈ విషయం సంబధిత రైల్వే అధికారులు దృష్టికి తీసుకువెళ్లి మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలు హాల్టింగ్ కల్పించే విధంగా కృషి చేయాలని వారిని విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షులు వంగపల్లి వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, రవీందర్ రావు, బెల్లంకొండ మురళీధర్, జయ రామ రావు పాల్గొన్నారు.

## మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు పెట్టాలి

టియూడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి



**ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి:** కవరేజ్ కు వెళ్లిన ఈటీవీ, టీవీ9, టీవీ5 టీవీ ఛానళ్ల ప్రతినిధులపై దాడికి పాల్పడిన సీనియర్ సినీ నటుడు మంచు మోహన్ బాబుపై హత్యా యత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజెయూ) జిల్లా అధ్యక్షులు ఎ.శంకర్ దయాళ్ చారి డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ కలెక్టరేట్ ముందు టీయూడబ్ల్యూజే (ఐజెయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ నగేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ జర్నలిస్టులపై నటుడు మోహన్ బాబు విలన్ల జులుం ప్రదర్శించారని మండిపడ్డారు. గతంలో సినిమా నటి సాక్షి శివానంద్, సీనియర్ నటి జయంతిలపై మోహన్ బాబు చేసిన దాడులు, పెట్టిన హింసలు ఇప్పటికి అనేక మందికి గుర్తు వున్నాయన్నారు. ఒక సినిమా నటుడుగా, నిర్మాతగా, డైరెక్టర్ గా, పార్ట్ టైం రాజకీయ వేత్తగా, విద్యా సంస్థల నిర్వాహకుడిగా, రియల్ ఎస్టేట్ ఓనర్ గా ఎన్ని పాత్రలు వేసినా తన క్రిమినల్ బుద్ధిని మోహన్ బాబు ఏనాడు వదిలి పెట్ట లేదని ధ్వజమెత్తారు. నిజాలను భరించే శక్తిలేక టీ.వీ.9 ప్రతినిధిపై నటుడు మోహన్ బాబు వీరావేశంగా దాడి చేయడం అర్థం అవుతుందన్నారు. మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సంతోష్ కుమార్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నాగరాజు, ఐజెయూ మాజీ సభ్యులు ఫరూక్ హుస్సేన్, నాయకులు మురళీధర్ గుప్తా, శ్రీధర్, గోవర్ధన్ రెడ్డి, అల్లాడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడంపై నిరసన



**ప్రజాపక్షం/హత్నూర:** కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ తల్లి రూపురేఖలను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడంపై నిరసనగా హత్నూర మండలంలోని దౌల్తాబాద్ (కసాల) చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి బిఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తెలంగాణ తల్లిగా మార్చడంపై మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమ తల్లిని హస్తం గుర్తు తెలంగాణ తల్లిగా మార్చడంపై నిరసనగా పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు. జొన్నలు, మొక్కలు ఇతర రాష్ట్రాల్లో కూడా పండుతాయని తెలంగాణలో పూలను పూజించే గొప్ప సాంస్కృతిగా తెలంగాణ అని అలాంటి బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి తొలగించడం బతుకమ్మ పండుగను కనుల పండుగ చేసుకునే మహిళలను అవమానించడమేనని అన్నారు.

విగ్రహం నమూనాలు మార్చినందుకే నిరసనగా తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ ఎంపిపి నర్సింలు, శివశంకర్‌రావు, పండుగ రవికుమార్ వీరేశంగౌడ్, శ్రీకాంత్ ,చంద్రశేఖర్ రెడ్డి, చెన్న నర్సింలు రామ్‌రెడ్డి వీరేందర్, శంకర్, సురేష్ గౌడ్, కిషోర్, నరేందర్ ,నామ్య నాయక్, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# పృథ్వీ షా, రహానే విధ్వంసం..

## సెమీఫైనల్‌కు ముంబై!



టీమిండియా యువ బ్యాటర్ పృథ్వీ షా ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై తరఫున పృథ్వీ షా(26 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 49) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. విదర్భతో జరిగిన క్వార్టర్ ఫైనల్ తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నా.. విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబైకి అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. పృథ్వీ షాకు తోడుగా అజింక్య రహానే(45 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 84) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగడంతో ముంబై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 221 పరుగులు భారీ స్కోర్ చేసింది. విదర్భ బ్యాటర్లలో అథర్వ తైడే(41 బంతుల్లో 66), అపూర్వ్ వాంఖడే(33 బంతుల్లో 51), శుభమ్ దూబే(19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 43) రాణించారు. ముంబై బౌలర్లలో అథర్వ అంకోలేకర్(2/32), సుర్యాన్ష్ షెడ్గే(2/36) రెండేసి వికెట్లు తీయగా.. తనూష్ కోటియన్ ఓ వికెట్ పడగొట్టాడు. అనంతరం ముంబై పృథ్వీ షా, అజింక్యా రహానే అసాధారణ బ్యాటింగ్‌తో 19.2 ఓవర్లలో 4 వికెట్లకు 224 పరుగులు చేసి గెలుపొందింది. పృథ్వీ షా, అజింక్యా రహానే తొలి వికెట్‌కు 83 పరుగులు జోడించారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(5), సూర్యకుమార్ యాదవ్(9) విఫలమవ్వగా.. శివమ్ దూబే(37 నాటౌట్), సూర్యాన్ష్ షెడ్గే(36 నాటౌట్) సత్తా చాటారు. విదర్భ బౌలర్లలో దిపేష్(2/32) రెండు వికెట్లు తీయగా.. హర్ష్ దూబే, యష్ ఠాకూర్ తలో వికెట్ తీసారు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో అన్‌సోల్డ్ నిలిచిన పృథ్వీ షా.. తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా పృథ్వీ షా ఫిట్‌నెస్ తీవ్ర చర్చనీయాంశమైంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో రాణిస్తుండటంతో పృథ్వీ షాను ఏ జట్టు అయినా తీసుకునే ఛాన్స్ ఉంది.

# టాప్ మోస్ట్ సెర్చ్ స్టార్స్ ఎవరంటే?



భారత మాజీ రెజ్లర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేష్ ఫోగట్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రముఖ సెర్చ్ ఇంజిన్ గూగుల్ వేదికగా ఈ ఏడాది అత్యధికమంది సెర్చ్ చేసిన భారత వ్యక్తుల్లో వినేష్ ఫోగట్ టాప్‌లో నిలిచారు. అత్యధిక మంది వినేష్ ఫోగట్ కోసం గూగుల్‌ను ఆశ్రయించారు. ఈ ఏడాది ముగుస్తున్న నేపథ్యంలో గూగుల్ తమ టాప్ ట్రెండింగ్స్‌ను విడుదల చేసింది. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా భారత స్టార్ రెజ్లర్లు చేపట్టిన ఉద్యమంలో వినేష్ ఫోగట్ చురుకుగా పాల్గొన్నారు. ఈ ఉద్యమం భారత రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒలింపిక్స్ అనంతరం రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికిన వినేష్ ఫోగట్.. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో జులానా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. దాంతోనే ఈ ఏడాదంతా వినేష్ ఫోగట్ వార్తల్లో నిలిచారు. దాంతో ఆమె పేరు టాప్ మోస్ట్ సెర్చ్‌డ జాబితాలో నిలిచింది. వినేష్ ఫోగట్ తర్వాత బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ గురించి నెటిజన్లు ఎక్కువ సెర్చ్ చేశారు. ఈ ఏడాది అత్యధికంగా సెర్చ్ చేసిన టాప్10 వ్యక్తుల జాబితాల్లో వినేష్ ఫోగట్, నితీష్ కుమార్‌తో పాటు చిరాగ్ పస్వాన్, హార్దిక్ పాండ్యా, టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, శశాంక్ సింగ్, పూనమ్ పాండే, రాధికా మర్చంట్, అభిషేక్ శర్మ, లక్ష్యసేన్‌లు ఉన్నారు. క్రీడల నుంచి వినేష్ ఫోగట్‌తో పాటు హార్దిక్ పాండ్యా, శశాంక్ సింగ్, అభిషేక్ శర్మ, లక్ష్యసేన్‌లు చోటు దక్కించుకున్నారు.

## ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ క్లైమాక్స్ రసవత్తరంగా

### 13వ గేమ్ డ్రా...

ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ క్లైమాక్స్ రసవత్తరంగా మారింది. 14 గేమ్‌లు ఉండే ఈ ప్రపంచ మ్యాచ్‌లో 12 గేమ్‌లు పూర్తయ్యేసరికి భారత యువ సంచలనం గుకేశ్, డింగ్ లిరెన్ 66తో సమంగా నిలిచారు. ఇక బుధవారం జరిగిన 13వ గేమ్ డ్రాగా ముగిసింది. ఈ 13వే గేమ్‌లో 69 ఎత్తుల తర్వాత ఇద్దరు ఆటగాళ్లు డ్రాకు అంగీకరించారు. దీంతో ప్రస్తుతం ఇద్దరు ప్లేయర్స్ 6.5 6.5 పాయింట్లతో సమానంగా నిలిచారు. ఇక గురువారం జరిగే చివరి (14వ) గేమ్‌లో ఏ ప్లేయర్ అయితే గెలుస్తారో, వారే ఛాంపియన్‌గా అవతరిస్తారు. ఒకవేళ ఆఖరి గేమ్ కూడా డ్రా ముగిస్తే, ఇద్దరు ప్లేయర్లు ఏడేసి పాయింట్లతో సమానంగా నిలుస్తారు. అప్పుడు శుక్రవారం టై బ్రేక్‌లో విజేతను నిర్ణయించాల్సి వస్తుంది. కాగా, ఈ టోర్నీలో మొదటి గేమ్‌లో లిరెన్ గెలవగా, రెండో గేమ్ డ్రాగా ముగిసింది. మూడో గేమ్‌లో గుకేశ్ విజయం సాధించి స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత ఏకంగా వరుసగా ఏడు గేమ్‌లు డ్రాగా మిగిలాయి. 11వ రౌండ్లో మాత్రం గుకేశ్ విజయం సాధించి 65తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ,12వ గేమ్‌లో పెద్దగా పోటీ ఇవ్వలేక ఓటమిని అందుకున్నాడు.

# ‘అఖండ-2 తాండవం’ రిలీజ్ డేట్ ఫిక్స్

# రీల్



నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతూ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే ఆయన ‘డాకు మహారాజ్’ చిత్ర షూటింగ్‌ను ముగించుకుని.. ఈ సినిమాను సంక్రాంతి కానుకగా రిలీజ్ చేసేందుకు రెడీ అయ్యాడు. ఈ సినిమాను దర్శకుడు బాబీ డైరెక్ట్ చేస్తుండటంతో ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి విజయాన్ని అందుకుంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమా రిలీజ్ కాక ముందే, మాస్ చిత్రాల స్పెషలిస్ట్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో బ్లాక్‌బస్టర్ మూవీ ‘అఖండ’కు సీక్వెల్‌గా ‘అఖండ2 తాండ వం’ను ప్రారంభించాడు. ఈ సినిమా షూటింగ్ కూడా ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అయితే, ఈ సినిమా నుండి తాజాగా మేకర్స్ ఓ బ్లాస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. ‘అఖండ2 తాండవం’ రిలీజ్ డేట్‌కి సంబంధించిన ప్రోమోను వారు తాజాగా రిలీజ్ చేశారు. అఖండ2 చిత్రాన్ని వచ్చే దసరా కానుకగా 2025 సెప్టెంబర్ 25న గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా వెల్లడించింది. ఇక ఈ అప్డేట్‌తో ‘అఖండ2’ తాండవం ముహూర్తం షాట్‌లో బాలయ్య చెప్పిన పవర్‌ఫుల్ డైలాగును జోడించడంతో ఈ ప్రోమో అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో అందాల భామ ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా థమన్ సంగీత అందిస్తున్నాడు. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.




## మాస్ కా దాస్ తో ‘జాతి రత్నాలు’ కాంబో..

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం మెకానిక్ రాకీ కోసం తెలిసిందే. అయితే ఈ చిత్రం మంచి టాక్ ని తెచుకున్నప్పటికీ ఆశించిన వసూళ్లు అందుకోలేదు. ఇక ఈ సినిమా తర్వాత తన నుంచి రానున్న చిత్రాల్లో దర్శకుడు జాతి రత్నాలు ఫేమ్ అనుదీప్ కేవీతో ఓ సినిమా కూడా ఉంది అని టాక్ ఉంది. అయితే మాస్ కా దాస్ తో ఇపుడు ఫైనల్ గా అఫీషియల్ అప్డేట్ ఇచ్చేసారు. వరుస హిట్స్ తో దూసుకెళ్తున్న సితార ఎంటర్టైన్మెంట్స్ తో ఈ చిత్రం అనౌన్స్ చేసేసారు. మరి ఈ చిత్రాన్ని ఫంకీ అంటూ ఒక సాలిడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా అనౌన్స్ చేసేసారు. కల్కి 2898 ఎడి దర్శకుడు నాగ్ అశ్విన్ క్లాప్ తో నేడు సినిమా మొదలైంది.అలాగే విశ్వక్ తో ఆల్రెడీ సితార వారు గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇది మరో సినిమా అని చెప్పాలి. మరి ‘ప్రిన్స్ తర్వాత అనుదీప్ చాలా గ్యాప్ తీసుకున్నాడు. దీనితో తన నుంచి కూడా సినిమా రావాలని చాలా మంది కోరుకుంటున్నారు. మరి ఈ ఫంకీ ఎలాంటి నవ్వులు పూయిస్తుందో చూడాలి. ఇక ఈ చిత్రం సంక్రాంతి తర్వాత నుంచి షూటింగ్ మొదలు పెట్టుకోనుంది.

## రాబిన్‌హుడ్ వాయిదా నిజమేనా!?



మన టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్న భారీ చిత్రం రాబిన్ హుడ్ కోసం అందరికీ తెలిసిందే. మరి నితిన్ నుంచి చాలా కాలం గ్యాప్ తర్వాత వస్తున్న ఈ సినిమాపై మంచి బజ్ ఆల్రెడీ ఉంది. రాబిన్ హుడ్ ఈ డిసెంబర్ లో 20కి రాకపోవచ్చని లేటెస్ట్ టాక్. అందుకే ఇపుడు రావాల్సిన సాంగ్ కూడా వాయిదా వేశారని వినిపిస్తుంది. మరి ఈ కొత్త రూమర్స్ పై మాత్రం నితిన్ ఫ్యాన్స్ లాస్ట్ మినిట్ లో టెన్షన్ పడు తున్నారు. మరి మైత్రి మూవీ మేకర్స్ దీనిపై ఏమన్నా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఇక ఈ చిత్రానికి జివి ప్రకాష్ సంగీతం అందిస్తున్నాడు అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

## పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ‘దండోరా’ మూవీ



‘కలర్ ఫోటో’, ‘బెదురులంక 2012’ వంటి బాల్క్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రముఖ నిర్మాణ సంస్థ లౌక్య ఎంటర్టైన్‌మెంట్స్ మరో సినిమాకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణ సంస్థలో ‘దండోరా’ సినిమా రూపొందనుంది. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఈ మూవీ బుధవారం రోజున ఫిల్మ్ నగర్ లోని రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలను లాంఛనంగా పూర్తి చేసుకుంది. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు సెలబ్రిటీలు హాజరై చిత్ర యూనిట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టగా.. బేబీ నిర్మాత ఎస్‌కేఎన్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. యంగ్ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ గౌరవ దర్శకత్వం వహించారు. విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, రాహుల్ రామకృష్ణ, రవి కృష్ణ, మనీక చిక్కాల, అనూష తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను తెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరిపై గళమెత్తిన ఎంపి కావ్య

## అదనపు ఫ్లాట్ ఫామ్ లను ఏర్పాటు చేయాలని డిమాండ్



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : లోక్ సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్, బైపాస్ లైన్ అలైన్ మెంట్, ఫ్లాట్ ఫామ్ ల విస్తరణ తదితర అంశాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో ప్రశ్నించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిచ్చారు. కాజీపేట లో రైల్వే వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ సమగ్ర ఇంజిన్, కోచ్, వ్యాగన్ ల ఉత్పత్తి యూనిట్ గా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి వివరించారు. రాష్ట్ర విభజన చట్టం లో ఇచ్చిన హామీ మేరకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారా అని ఎంపీ డాక్టర్ కావ్య నేరుగా వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ప్రస్తుతం రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ లు అన్ని రకాల మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ లు గా అభివృద్ధి పరుస్తున్నామని కాజీపేట మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ లో సమగ్ర కార్యాచరణతో కూడిన పరిశ్రమను డెవలప్ చేస్తున్నామన్నారు. రైల్వే డివిజన్ ఏర్పాటు పై ఎంపీ వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ గత ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులతో పోలిస్తే ప్రస్తుతం 5 వేల కోట్ల పై చిలుకు నిధులు తెలంగాణ రాష్ట్రానికి రైల్వే పనులకోసం కేటాయించామని రైల్వే అభివృద్ధి విస్తరణ ప్రస్తుతం సునాయాసంగా జరుగుతున్నందున ఆ అంశం ఆలోచించటం లేదన్నారు. బైపాస్ రైల్వే లైన్ లు వ్యవసాయ రంగ కార్యకలాపాలకు అవరోధంగా నిలుస్తూ రైతులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఎంపీ డాక్టర్ కావ్య గారు వివరించగా ఈ అంశంలో గౌరవ పార్లమెంట్ సభ్యురాలు చేయబోయే సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. కాజీపేట స్టేషన్ ఫ్లాట్ ఫామ్ ల విస్తరణ అంశాన్ని ఎంపీ డా.కడియం కావ్య ప్రస్తావించగా తాము ఈ విషయంలో జాతీయ కార్యాచరణలో భాగంగా చేపట్టిన అమృత్ తరహా అభివృద్ధిని అమలుపరుస్తున్నామన్నారు.

# ‘భారత్ గౌరవ్ ’ అయోధ్య - కాశీ : పుణ్యక్షేత్ర యాత్ర ’

## టూరిస్ట్ రైలు సికింద్రాబాద్ నుండి ప్రారంభం




యాత్రికులు డాక్టర్ టి.విఠల్‌రెడ్డి, టి.కుసుమలు ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ గ్రూప్ జనరల్ మేనేజర్ పి.రాజ్‌కుమార్ సమక్షంలో జెండా ఊపి ప్రారంభించారు.ఈ

ప్రజాపక్షం/హైదరాబాద్: భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వం, అద్భుతమైన చారిత్రక ప్రదేశాలను ప్రదర్శించడానికి భారతీయ రైల్వేలు ప్రారంభించిన థీమ్‌ఆధారిత టూరిస్ట్ సర్క్యూట్ రైలు భారత్ గౌరవ్ రైలు ప్రయాణికులలో ఉత్సాహాన్ని నింపింది. అయోధ్య కాశీ: పుణ్య క్షేత్ర యాత్ర కొరకై 26వ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ రైలును భారత్ గౌరవ్ రైలు పర్యటన గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ తీర్థ స్థలాలను చేరుకుంటుంది. సికింద్రాబాద్‌తో పాటు, తెలంగాణలోని భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, ఆంధ్ర ప్రదేశ్ లోని విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ , వైజాగ్ (పెందుర్తి), విజయనగరంలో మార్గ మధ్యంలో ఇరువైపులా ప్రయాణికుల కోసం రైలు ఎక్కేందుకు /దిగేందుకు సౌకర్యం కల్పించబడింది. దక్షిణ మధ్య రైల్వే నుండి నడుపబడుతున్న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుకు ప్రయాణికుల నుండి మంచి స్పందన లభించడం పట్ల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సంతోషం వ్యక్తం చేశారు. భారత్ గౌరవ్ రైళ్లు దేశంలో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయని సాంస్కృతికంగా ప్రముఖమైన, చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశాన్ని వినియోగించుకోవాలని రైలు వినియోగదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ టూర్ ప్యాకేజీ కాకుండా,ఐ.ఆర్. సి.టి.సి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ప్రారంభమయ్యే ‘మహా కుంభ పుణ్య క్షేత్ర యాత్ర‘ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు అనే మరో కొత్త పర్యాటక ప్యాకేజీని ప్రకటించింది. ఆసక్తిగల ప్రయాణీకులు ఐ.ఆర్.సి.టి.సి వెబ్సైట్ http://www.irctctourism.com ను సందర్శించవచ్చు. లేదా 04027702407, 9701360701, 9281495845, 9281495843, 8287932228, 9281030740, 928103074, 99281030711 & 9281030712 నెంబర్లపై సంప్రదించాలని అధికారులు సూచించారు.

## నాపై వ్యాఖ్యలు తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర అభ్యంతరం తెలుపుతూ పోడియం వద్దకు దూసుకెళ్లారు. దీంతో సభ వాయిదా పడింది. ఆ తర్వాత సభ సమావేశమైనప్పుడు దుబే, సంబిత్ పాత్రపై తాము ఇచ్చిన సభాహక్కుల ఉల్లంఘన నోటీసుల పరిస్థితి ఏమిటని కాంగ్రెస్ సభ్యులు నిలదీశారు. కాగా, రాహుల్ గాంధీని ‘ద్రోహి’ అంటూ సంబిత్ పాత్ర సంబోధించడాన్ని ప్రియాంక గాంధీ తప్పుపట్టారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలను సైతం ద్రోహులుగా మాట్లాడిన వ్యక్తులు రాహుల్ గాంధీని విడిచిపెడతారని తాము అనుకోలేమని, వాళ్లకు ఇదేమీ కొత్త కాదని అన్నారు. రాహుల్ గాంధీకి అన్నింటికంటే దేశమే ఎక్కువని, ఆయనను చూసి తాను గర్విస్తున్నానని చెప్పారు.

**బ్యాంకులను అపరిమిత నిధుల వనరుగా ఉపయోగించడం మానాలి**

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్రంపై మరోసారి విమర్శలు గుప్పించారు. తమ స్నేహితుల కోసం మోదీ సర్కారు ప్రభుత్వ రంగ బ్యాంకులను అపరిమిత నిధుల వనరుగా ఉపయోగించడం ఇకనైనా ఆపాలని అన్నారు. ఆల్ ఇండియా బ్యాంకింగ్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్‌కు చెందిన ప్రతినిధులతో రాహుల్ బుధవారం సమావేశమయ్యారు. దీనికి సంబంధించి ఎక్స్‌లో ఆయన పోస్ట్ పెట్టారు. ప్రజాప్రయోజనాల కంటే లాభాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ రంగ బ్యాంకులను ఒత్తిడికి గురిచేస్తున్నారు. దీంతో వారు సమర్థంగా ప్రజలకు సేవ చేయలేకపోతున్నారు. సిబ్బంది కొరత, క్లిష్టమైన పని వాతావరణం మధ్య నలుగుతున్నవారిని అసాధ్యమైన లక్ష్యాలు చేరుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగులకు సమాన అవకాశాలు, ఉద్యోగంలో పురోగతి కల్పించట్లేదు అని రాహుల్ కేంద్రంపై మండిపడ్డారు. ‘ప్రతి భారతీయుడి కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులు సేవలు అందించాలి. ఎంతోమందికి జీవనాడి లాంటి ఈ బ్యాంకులను మోదీ సర్కారు మాత్రం కొన్ని ధనిక, శక్తిమంతమైన సంస్థలకు ప్రైవేట్ ఫైనాన్షియర్లుగా మార్చేసింది. వారి మోసపూరిత స్నేహితులకు అపరిమిత నిధులు ఇచ్చే వనరులుగా ప్రభుత్వ రంగ బ్యాంకులను చూడటాన్ని మోదీ ప్రభుత్వం ఇకనైనా మానుకోవాలి’ అని రాహుల్ దుయ్యబట్టారు.

# మోహన్‌బాబు ఇంటి వద్ద మళ్లీ ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు ఉంటాయి, మా ఇంటి సమస్యను ఎక్కువగా చూపించడానికి ప్రయత్నం చేయకండి అని స్పష్టం చేశారు. అయితే మీడియాపై దాడిని మాత్రం ఆయన ఖండించలేదు.

**కూర్చుని మాట్లాడుకోవడానికి నేను సిద్ధం : మనోజ్**

తనంతట తాను గొడవలకు దిగనని.. శాంతి భద్రతలకు విఘాతం కల్గించనని మంచు మనోజ్ బుధవారం రాచకొండ పోలీసు కమిషనర్‌కు రూ.లక్ష బాండ్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంట్లో ఉన్న తన తల్లి ఆసుపత్రిలో ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అన్ని సమస్యలపై తాను కూర్చుని మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన తండ్రి మోహన్ బాబు, అన్న విష్ణు తరఫున జర్నలిస్టులకు క్షమాపణ చెప్పారు. ‘ఆస్తి కోసం నాన్నతో గొడవ పడుతున్నట్లు జరుగుతున్న ప్రచారం నిజం కాదన్నారు. ఈ వివాదంలోకి నా భార్య, ఏడు నెలల కూతురును కూడా లాగుతున్నారు‘ అంటూ మనోజ్ కన్నీరు పెట్టుకున్నారు. ఈ ఎపిసోడ్‌లో మంచు లక్ష్మి ఎంట్రీ అయ్యారు. శాంతి అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఈ పోస్టుకు మనోజ్ భార్య మౌనిక లైక్ కొట్టారు. ఇది చర్చలకు అవకాశం కల్పించినట్లు సంకేతమని పోలీసులు అంటున్నారు.

**మేనేజర్ వెంకటకిరణ్ అరెస్టు..**

మోహన్ బాబు నివాసంలో సిసిటివి ఫుటేజి మాయం చేసిన మోహన్ బాబు మేనేజర్ వెంకట్ కిరణ్‌ను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. విజయ్ రెడ్డి అనే వ్యక్తితో కలిసి వెంకట్ కిరణ్ సిసిటివి ఫుటేజి మాయం చేసినట్టు గుర్తించారు. మంచు మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ అరెస్ట్ చేసినట్టు తెలుస్తోంది.

**ఎడమ కంటికి కింద గాయం-హెల్త్‌బులెటిన్ విడుదల..**

మోహన్ బాబు ఆరోగ్య పరిస్థితిపై గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ బుధ వారం విడుదల చేశారు. మోహన్ బాబు ఎడమకంటి కింద గాయాలు గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని, హృదయ స్పందనలో హెచ్చుతగ్గులు ఉన్నాయని పేర్కొన్నారు.

## మోహన్‌బాబు, విష్ణు.. విచారణకు మినహాయింపు

ప్రజాపక్షం/హైదరాబాద్:కుటుంబ వివాదంలో నటుడు మంచు మోహన్‌బాబు, ఆయన కుమారుడు హీరో మంచు విష్ణులకు పోలీసులు ఇచ్చిన విచారణ నోటీసుల అమలును హైకోర్టు నిలిపివేసింది. నోటీసుల ఆధారంగా విచారణకు హాజరు కానవసరం లేదని చెప్పింది. పహాడీషరీఫ్ పోలీసులకు మంచు మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని మోహన్‌బాబు, విష్ణులకు నోటీసులు జారీ అయ్యాయి. వీటిని రద్దు చేయాలంటూ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ జరిపి పోలీసుల విచారణపై స్టే విధించారు. ఫ్యామిలీలో నెలకొన్న వివాదం ఆ ఫ్యామిలీ మెంబర్స్ పరిష్కరించుకునేందుకు గడువు ఇవ్వాలని పోలీ సులకు సూచన చేసింది. కుటుంబ వ్యవహారంలో మీడియా, పోలీసులు అత్యుత్సాహం పనికిరాదని వ్యాఖ్యానిం చింది. కుటుం బ వివాదంపై మీడియా, పోలీసులు అత్యుత్సాహం చూపడం సబబు కాదదంది. విచారణను ఈనెల 24కు వాయిదా వేశారు.

## సుస్థిర ప్రజాస్వామిక పాలన

# కాంగ్రెస్‌తోనే...

ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి




ప్రజాపక్షం/హైదరాబాద్:అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం నూటికి నూరుపాళ్లు నిలబెట్టుకుందని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణ మూర్తి చెప్పారు. తొలి ఏడాదిలోనే సుస్థిర ప్రజాస్వామిక పాలనతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టిందని, కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలకే పరిమితం కాకుండా దాదాపు ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, అవకాశాలను బట్టి అనేక వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది ప్రజా పాలనా విజయోత్సావల సందర్భంగా హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు సత్య దేవ్, మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి అంబటి వాణి లతోకలసి అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ పదేండ్ల విధ్వంసపు ఆనవాళ్లను రేవంత్ ప్రభుత్వం చెరిపేస్తూ తెలంగాణ పునర్ వైభవాన్ని కొనసాగిస్తూ అన్ని రంగాల్లో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని వివరించారు. కార్మికవర్గం పోరాటం చేసి సాధించుకున్న హక్కులు, ప్రయోజనాలు, సంక్షేమానికి సంబంధించిన 44 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసి 4 కార్మిక కొడ్‌లను తీసుకువచ్చి కార్మికుల జీవనోపాధి దెబ్బతీసిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక ప్రజా వ్యతరేక విధానాలను నిరసిస్తూ 2025 మార్చ్ నెలలో లక్షమంది కార్మికులతో హైదరాబాద్ నిజాం కాలేజ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని అంబటి కృష్ణమూర్తి ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి బి. అమర్ బాబు, సంయుక్త కార్యదర్శి, ఎన్. నాగరాజు, మేడ్చల్ జిల్లా ఉపాధ్యాయు జనార్దన్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు జ్యోతి, నేతలు రాధక్క, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com